

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తాడేపల్లిగూడెం fb.com/vaartha

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

16-8-2024 శుక్రవారం సంపుటి: 30 సంచిక: 198 పేజీలు: 10+4 వెల: 6.50


కోల్‌కతా ఆర్జీకార్ ఆసుపత్రిలో విధ్వంసం 5లో

14000 మంది చిన్నారులతో జాతీయ గీతాలాపన



గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రసంగిస్తున్న ప్రధాని మోడీ, అసంఖ్యాకంగా హాజరైన ప్రజలు

# వికసిత్ భారత్ తొలి లక్ష్యం

**2047 నాటికి పూర్తి అభివృద్ధి చెందిన దేశంగా భారత్**

**భారత్ ప్రస్థానం ప్రపంచ దేశాలకు స్ఫూర్తి**

**అంతరిక్షంలో భారత్ స్పేస్ స్టేషన్ కల త్వరలోనే సాకారం**

**'వోకల్ ఫర్ లోకల్' నినాదంతో ముందుకు**

**78వ స్వాతంత్ర్య వేడుకల్లో ఎర్రకోటనుంచి ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** వికసిత్‌భారత్ లక్ష్యంతో ముందుకు సాగుతున్న భారత్‌ప్రస్థానం ప్రపంచ దేశాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటనుంచి దేశప్రజల నుద్దేశించి ప్రధాని ప్రసంగించారు. వికసిత్‌భారత్ థీమ్‌తోను, హర్‌ఘర్ తిరంగా నినాదంతో ఘనంగా స్వాతంత్యవేడుకలు జరుగుతున్నాయన్నారు. దేశం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకుందామని, దేశం కోసం జీవితాలనే పణంగా పెట్టిన మహనీయులు ఎందరో ఉన్నారని భారత ప్రస్థానం ప్రపంచానికే స్ఫూర్తిదాయకమని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు.

ప్రాణాలర్పించిన మహనీయులకు దేశం రుణపడి ఉందన్నారు. శతాబ్దాలుగా దేశం బానిసత్వంలో మగ్గిందని స్వాతంత్ర్యంకోసం ఆనాడు 40 కోట్ల మంది ప్రజలు పోరాడారని, ఇపుడు మన దేశ జనాభా 140కోట్లకు పెరిగిందన్నారు. >>2



గురువారం విజయవాడలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

# రాష్ట్రంలో సుస్థిర ప్రజాస్వామ్య ప్రభుత్వం

**అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తా**

**స్వాతంత్ర్య వేడుకల్లో సిఎం చంద్రబాబు**

**అధికారంలోకి రాగానే ఐదు కీలక హామీలపై సంతకాలు చేశాం**

**మెగా డిఎస్సీతో16 వేలు పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్నాం**

**అమరావతి, పోలవరంను ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నాం: సిఎం**

**విజయవాడ,ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లో సుస్థిర ప్రజా ప్రభుత్వాన్ని నిర్మిస్తామని సిఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు.గత అయిదేళ్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలు కోల్పోయిన స్వేచ్ఛను అందిస్తామన్నారు.ఒక నిశ్శబ్ద విప్లవం ద్వారా ప్రజలు గత ప్రభుత్వ విధ్వంసపాలనను అంతమోదించారన్నారు.ఒక విధంగా ఎపి ప్రజలు మరో స్వాతంత్ర్య పోరాటాన్ని చేసి విజయం సాధించారన్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సిఎం చంద్రబాబు స్థానిక ఇందిరా గాంధీ నగర పాలక సంస్థ క్రీడా మైదా >>2



గురువారం అనకాపల్లిలో స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న హోంమంత్రి వంగలపూడి అనిత

# మహనీయుల త్యాగాలు భావితరాలకు తెలపాలి

**హోం మంత్రి వంగలపూడి అనిత**

**అనకాపల్లి, ఆగస్టు 15, ప్రభాతవార్త:** దేశ సా వ్వతంత్ర్యం కోసం మహనీయులు చేసిన త్యాగాలు భావితరాలకు తెలపాలని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు.అనకాపల్లిలో ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు పరేడ్ కమాండర్ >>2

# 'అన్న' క్యాంటీన్లు ఆరంభం

**గుడివాడలో ఏర్పాటు చేసిన క్యాంటిన్‌ను ప్రారంభించిన సిఎం దంపతులు**

**గుడివాడకు టిడిపి రుణపడి ఉంటుందన్న ముఖ్యమంత్రి**

**గుడివాడ, ఆగస్టు 15 ప్రభాతవార్త:** పేదరికం లేని సమాజాన్ని నిర్మిండమే ఎన్టీఆర్ లక్ష్యమని, ఆయన స్ఫూర్తితో అన్న క్యాంటీన్లను ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు పేర్కొన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ద్వారా మధ్యహ్నం 12.30గంటలకు చంద్రబాబు దంపతులు గుడివాడకు వచ్చారు. వారికి పార్టీ అభిమానులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం గుడివాడ మునిసిపల్ పార్కులో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి నారా భువనేశ్వరిలు ప్రారంభించారు. క్యాంటీన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, తదితరుల ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అనంతరం స్వయంగా ముఖ్యమంత్రి దంపతులు భోజనాన్ని వడ్డించారు. ఆపై చంద్రబాబు దంపతులు సైతం టోకెన్ తీసుకుని అక్కడే భోజనం చేశారు. భోజనం చేస్తున్న సమయంలో చంద్రబాబు ప్రజలతో కాసేపు ముచ్చటించారు.

ఈ అన్న క్యాంటీన్ల ద్వారా నిరుపేదలకు రూ.5లకే ఆహారాన్ని అందిస్తామని చెప్పారు. పేదలకు కడుపు నిండా అన్నం పెడితే అదే మానసిక సంతోషాన్ని కలిగిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గుడివాడలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గుడివాడకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ రుణపడి ఉంటుందన్నారు. గుడివాడలో మొత్తం మూడు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నియోజకవర్గమని అన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత తిరుమలకు వెళ్లిన ఎన్టీఆర్ అన్నదానానికి శ్రీకారం చుట్టారు. అరకొర సంపాదనతో జీవించే వారికి అన్న క్యాంటీన్లు ఎంతగానో ఉపయోగ పడతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎంతోమంది ఆకలి తీర్చిన అన్నపూర్ణ డొక్కా సీతమ్మ అమె గోదావరి దాడి వచ్చిన వాళ్లకు అన్నం పెట్టేవారు.

2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయంలో నిర్వహించిన అన్న క్యాంటీన్లను గత వైఎస్సార్సీ ప్రభుత్వం మూసివేసి నిరుపేదలను రోడ్డున పడేసిందన్నారు. అధికారంలోకి వచ్చాక తిరిగి అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకువస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఎన్డీయే ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 203 అన్న క్యాంటీన్లకు గాను మొదటి విడతలో >>2

# ఎన్టీపీసీతో ఒప్పందం

**ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు చర్యలు**

**సిఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం**

**విజయవాడ ఆగస్టు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీపీసీ విద్యుత్ వ్యాపార్ నిగమ్ లిమిటెడ్‌తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వ కార్యాలయాలపై 300 మెగావాట్ల సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుపై ఒప్పందం చేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఎన్టీపీసీ ఎపి నెడ్ క్యాప్ సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలపై సోలార్ ప్యానెల్స్ అమర్చేందుకు వీలుగా సంస్థల మధ్య ఒప్పందం చేసుకున్నాయి. 2025నాటికి ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం సోలార్ ప్యానెల్స్ అమర్చాలని ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ సౌర విద్యుత్ ఉత్పత్తి చేయటంతో పాటు పొల్యూషన్ తగ్గింపు దిశగా 25 ఏళ్ల పాటు ఈ ఒప్పందం విద్యుత్ వ్యయాన్ని తగ్గిస్తుంది అన్నారు. 300 మెగావాట్ల విద్యుత్ రూఫ్ టాప్ >>2

# బుల్లి రాకెట్ ఎస్ఎస్ఎల్వి-డి3 ప్రయోగం నేడే

**ముహూర్తం: ఉ.9.17 గం.**

**శ్రీహరికోటలో ఏర్పాట్లు పర్యవేక్షించిన ఇస్రో ఛైర్మన్ సోమనాథ్**



**శ్రీహరికోట (తడ), ఆగస్టు 15 ప్రభాతవార్త:** శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి శుక్రవారం ఉదయం 9.17 గంటలకు భారత శాస్త్రవేత్తలు రూపొందించిన బుల్లి రాకెట్ ఎస్ఎస్ఎల్వి డి3ని ప్రయోగిస్తున్నారు. షార్‌లోని మొదటి ప్రయోగ వేదికపై ఈ రాకెట్ ప్రయోగానికి సిద్ధంగా ఉంది. తక్కువ ఖర్చు, ఎక్కువ ఆదాయం లక్ష్యంగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌ను మొదలు పెట్టింది. ఇందులో భాగంగా తొలి ప్రయోగం ఎస్ఎస్ఎల్వి డి1 2022 ఆగస్టు 7న ప్రయోగించగా అది విఫలం చెందింది. అయితే ఆరు నెలల వ్యవధిలో శాస్త్రవేత్తలు ఎస్ఎస్ఎల్వి డి2ను రూపొందించి 2023 ఫిబ్రవరి 10న విజయవంతంగా ప్రయోగించారు. మూడు ఉపగ్రహాలను ఆ రాకెట్ భూమికి తక్కువ ఎత్తు ఉన్న కక్ష్యలో ప్రవేశపెట్టింది.

ఈ సారి మళ్లీ మూడవ ప్రయోగానికి కొంత సమయం తీసుకున్నారు. ఎస్ఎస్ఎల్వి డి3 పేరుతో రూపొందించిన ఈ రాకెట్ ద్వారా భారత భూపరిశీలన ఉపగ్రహం ఇఓఎస్ 08ను ప్రయోగిస్తున్నారు. దీనితో పాటు ఎస్ఆర్-0 డెమోశాట్ ఉపగ్రహాన్ని కూడా అంతరిక్షంలోకి చేర్చనున్నారు. మూడు అత్యంత శక్తివంతమైన ఉపకరణాలు ఈ ప్రయోగంలో కీలకం కానున్నాయి. ఇఓఎస్ 08ని బెంగళూరులోని యుఆర్ రావు శాటిలైట్ సెంటర్లో రూపొందించారు. దీని బరువు 175.5 కిలోగ్రాములు. డెమో శాట్ ఉపగ్రహాన్ని స్పేస్ కిడ్జ్ ఇండియా వారు రూపొందించారు. దీని బరువు 0.2 కిలోగ్రాములుగా ఉంది. అంతరిక్షంలో సుమారు 17 నిమిషాల వ్యవధిలో ఈ రెండు ఉపగ్రహాలు చేర్చనున్నారు.

**బుల్లి రాకెట్ ఎంతో ప్రత్యేకం**

ఇస్రో ఉపగ్రహాలను మోసుకెళ్లడానికి రూపొందించిన 6వ తరహా రాకెట్ ఎస్ఎస్ఎల్వి. భూమికి 500 కిలోమీటర్ల కన్నా తక్కువ దూరంలో ఉపగ్రహాలను ఈ రాకెట్లు విడిచిపెడతాయి. మినీ, మైక్రో, నానో శాటిలైట్లను ప్రయోగించడానికి ముఖ్యంగా 10 నుంచి 500 కిలోల బరువు ఉన్న తక్కువ బరువు గల ఉపగ్రహాలను గగనతలంలో చేర్చడానికి ఈ రాకెట్లు తయారు చేశారు. దీన్ని ఛోటాభాయ్‌గా పేర్కొంటారు.

ఈ రాకెట్ బరువు మొత్తం 119 టన్నులు కాగా, 34 మీటర్ల పొడవు, రెండు మీటర్ల వెడల్పు కలిగి ఉంటుంది. మొత్తం మూడు ఘన ఇంధన దశలతో ఈ రాకెట్ నిర్మాణం పూర్తి చేశారు. ఈ రాకెట్లో విటిఎంగా పిలిచే మరో దశ కూడా ఉంటుంది. ఆ దశ రాకెట్‌ను క్రమబద్ధంగా నిర్ణీత కక్ష్యకు చేర్చడానికి ఉపయోగపడుతుంది. ఈ సారి దీన్ని నిశితంగా పరిశీలించి రూపొందించారు. గతంలో జరిగిన మొదటి ప్రయోగం విఫలం చెందడానికి ఈ విటిఎంలో తలెత్తిన సాంకేతిక అవరోధం ఒక కారణంగా అప్పట్లో భావించారు. ఇదిలావుంటే షార్‌లో ఉపగ్రహాలను మోసుకెళ్లే రాకెట్ ప్రయోగం జరగడం ఇటీవల కొంత ఆలస్యమైంది. మధ్యలో కొన్ని ప్రైవేటు ప్రయోగాలు, >>2

# రాజ్‌భవన్‌లో 'ఎట్ హోం'

**గవర్నర్ విందుకు హాజరైన సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్, పలువురు మంత్రులు, ప్రముఖులు**



గురువారం రాజ్‌భవన్‌లో ఎట్‌హోం కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ నజీర్, సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ తదితరులు

**విజయవాడ,ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఇచ్చిన తేనీటి విందు(ఎట్ హోమ్) గురువారం సాయంత్రం ఘనంగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్. ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ తదితరులు కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. అత్యంత సందడిగా జరిగిన ఈ కార్యక్రమం జాతీయ గీతం ఆలాపనతో ఆరంభమైంది,జాతీయ గీతం ఆలాపనతో ముగిసింది.ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరిని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ స్వయంగా వారి వద్దకు వచ్చి పలకరించి.అభివాదం చేసారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పలు అంశాలపై తేనీటి విందు స్వీకరిస్తూ మాట్లాడారు. వారితో పాటు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ మాట కలిపారు.ఈ కార్యక్రమానికి హాజరైన ఎపిపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, మానవవనరుల శాఖా మంత్రి నారాలోకేష్ తదితరులతో ముచ్చటించారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను అభినందించారు. మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరితో మాట్లాడుతూ హుషారుగా కన్పించారు. ఆయన రాష్ట్రమంత్రులు పలువురిని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు పరిచయం చేసారు. సిఎం సతీమణి నారా భువనేశ్వరి,బిజెపి ఎంఎల్ఏ యలమంచిలి సత్యనారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి. మాజీ ఎంఎల్ఏ కె.రామకృష్ణ, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎంఎల్ఏలు, ఐఎఎస్,.ఐపిఎస్ అధికారులు,కళాసాంస్కృతిక రంగాలకు చెందిన ప్రముఖులు,స్వాతంత్ర్య సమర యోధులు, రచయితలు హాజరయ్యారు.వైకాంగ్రెస్ పార్టీ నేతలు ఎవ్వరు ఈ విందుకు హాజరు కాలేదు.

# ఎపికి ఐపిఎస్ కేడర్ సంఖ్యాబలం పెంపు

**విజయవాడ.ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపికి ఐపీఎస్ క్యాడర్ సంఖ్యా బలాన్ని ప్రభుత్వం పెంచింది.ఇప్పటి వరకు 144 మంది ఐపిఎస్‌ల సంఖ్యాబలం ఎపి కేడర్‌కు ఉంది.దీనిని 174కు పెంచింది. కేడర్ స్ట్రేంత్‌పై ఇటీవల ఏపీ ప్రభుత్వ కేంద్ర అంతరంగిక శాఖకు ప్రతిపాదనలను పంపింది.ఇందుకు కేంద్ర హోం మంత్రిత్వశాఖ అనుమతినిస్తూ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.ఆ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం గెజిట్‌లో ప్రచురించింది.

ఈ క్యాడర్ పెంపు వల్ల రాష్ట్రానికి అదనంగా మరో 30మంది ఐపిఎస్‌ల సంఖ్యాబలం పెరుగుతుంది. దీంతో సీనియర్ డ్యూటీ పోస్టుల్లో 95 మంది అధికారులను,కేంద్ర డిప్యూటేషన్‌కు రిజర్వ్‌గా 38మందిని,రాష్ట్రాలకు డిప్యూటేషన్‌కు రిజర్వ్‌గా 28మందిని కేటాయించింది.డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా 121 మందిని,పదోన్నతుల ద్వారా 58 మంది ఐపీఎస్‌లను ఇవ్వనుంది.వీటికి సంబంధించిన వివరాలన్ని గెజిట్ నోటిఫికేషన్‌లో ప్రస్తావించారు.ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్వర్వులు జారీ చేసారు.

## గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం మిగిల్చిన విషాదం

## 40 వేలు దాటిన మరణాలు

5లో



గురువారం 78వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా న్యూఢిల్లీలోని నేషనల్ వార్ మెమోరియల్ వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ముర్ము



గురువారం ఎర్రకోటవద్దకు వచ్చిన ప్రజలను పలుకరిస్తున్న ప్రధాని మోడీ



గురువారం న్యూఢిల్లీలోని ఏఐసిసి ప్రధాన కార్యాలయంవద్ద ఖర్గేతో సోనియా గాంధీ, రాహుల్

# ప్రజాస్వామ్య ప్రభుత్వం

>>నంలో జరిగిన వేడుకల్లో గురువారం పాల్గొన్నారు.భారత స్వాతంత్ర్య విజయకేతనం మువ్వన్నెల జెండాను ఎగురవేసారు.అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.స్వాతంత్ర దినోత్సవ ఉత్సవాలు జరుగుతున్న మైదానంలో ప్రత్యేక వాహనంలో తిరుగుతూ ప్రజలందరికి అభివాదం చేసారు.తదుపరి ఉత్సవ వేడుకల వేదికపై నుంచి సిఎం చంద్రబాబు ఉద్వేగపూరిత ప్రసంగం చేస్తూ గత అయిదేళ్లలో దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను తిరిగి పొందేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.గత అయిదేళ్లు ప్రజలు ఏ స్వేచ్ఛను కోల్పోయారో దానిని అందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధానాలు రూపొందిస్తున్నామన్నారు.అభివృద్ధి,సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని 100 రోజుల టార్గెట్‌గా అన్ని శాఖల్లో సమీక్షలు చేస్తున్నామన్నారు.గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన శాఖలన్నింటిని పునరుద్ధరిస్తున్నామన్నారు.1957 కంటే ముందు బ్రిటిష్ దుర్మార్గపు పాలనపై తెలుగునేల తిరుగుబాటు చేసిందని చరిత్రకారులు చెబుతున్నారు.ఇది చైతన్యం కలిగిన ప్రాంతం,విభజనతో ఏర్పడిన నవ్యాంధ్రకు రాజధాని కూడా లేని పరిస్థితిలో నాడు పాలన ప్రారంభించామన్నారు.అటువంటి పరిస్థితి నుంచి ప్రభుత్వాన్ని పట్టాలెక్కించామన్నారు.మాకున్న అనుభవం, ప్రజలు సహకారంతో కొద్ది కాలంలోనే నిలదొక్కుకున్నాం,120కిపైగా సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచాం,ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రథమంగా నిలిచాం.రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకుని దేశం దృష్టిని ఆకర్షించామన్నారు.2014లో రాజధాని లేని పరిస్థితి నుంచి 2014లో పాలన ప్రారంభించామన్నారు.కొద్దికాలంలోనే నిలదొక్కున్నామన్నారు.దేశంలో ఎవ్వరు ఊహించని విధంగా అభివృద్ధి చెందామన్నారు.2014-19 మధ్య కాలంలో టాప్-3 రాష్ట్రాల్లో ఒక్కటిగా నిలిచామన్నారు.2014-19 మధ్య కాలంలో పోలవరం, రాజధాని నిర్మాణ పనులు పరుగులు పెట్టించామన్నారు.టిడిపి అధికారం కొనసాగుంటే పోలవరం ఫలితాలు ఇప్పటికే వచ్చేవన్నారు.దురదృష్టవశాత్తు ఒక్క ఛాన్స్ పేరుతో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసారు. ప్రశ్నిస్తేనే దాడులు చేసారు. ప్రజా వేదికతోనే విధ్వంస పాలన చేపట్టారు. రాజధాని అమరావతి పురిట్లోనే చంపే ప్రయత్నం గత ప్రభుత్వం చేసింది.అన్ని రంగాల్లో దోపిడీ చేసారు.ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ ఉప ప్రణాళిక నిధులను పక్కదారి పట్టించారు.గత ప్రభుత్వ విధానాల అప్పుల భారం పెరిగింది.గత ప్రభుత్వ విధానాల వల్ల తలసరి రుణం భారం పెరిగింది.తలసరి ఆదాయం తగ్గిందని విమర్శించారు.మద్యం ఆదాయాన్ని ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టారు.విధ్వంస పాలనపై ప్రజలు విసిగిపోయారు.చైతన్యం వెల్లువెత్తిందన్నారు.వైఎస్సార్సీ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసి,కూటమి అద్భుత విజయం అందించారు.కొత్త ప్రభుత్వంపై ఎన్నో ఆశలు ఉన్నాయి. ప్రజల ఆశలు నెరవేరుస్తామన్నారు.సుపరిపాలనకు తొలిరోజు నుంచే కూటమి ప్రభుత్వం నాంది పలికింది.100రోజుల కార్యచరణ రూపకల్పన చేసి వెళ్లిపోయిన పరిశ్రమలను తిరిగి రప్పించే ప్రయత్నం చేస్తున్నామన్నారు.ప్రజలే దేవుళ్ళు, సమాజమే దేవాలయం అన్న ఎన్టీఆర్ అడుగు జాడల్లో ప్రభుత్వం పయనిస్తోందన్నారు.అధికారం చేపట్టిన రోజే ఐదు సంతకాలు చేసి మాట నిలబెట్టుకున్నాం,నాడు,నేడు పేరిట గత ప్రభుత్వ పాఠశాల విద్యను నిర్వీర్యం చేసింది. పాఠశాలలకు పార్టీ రంగులేసి,. విద్యా ప్రమాణాలకు గత ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చింది.మెగా డీఎస్సీపై సంతకం చేసి 16వేలకుపైగా ఉపాధ్యాయపోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే రద్దు చేసామన్నారు.వృద్ధుల పెన్షన్‌ను రూ.4వేలకు పెంచి అందిస్తున్నామన్నారు. పంపిణీలో రికార్డు సృష్టించామన్నారు. వలంటీర్లు లేకుంటే పెన్షన్ పంపిణీ సాధ్యం కాదని,గత ప్రభుత్వం వృద్ధుల ప్రాణాలు తీసిందన్నారు.వలంటీర్లు లేకుండానే తొలి రోజునే 99శాతం ఫింఛన్లు అందించామన్నారు.అన్న క్యాంటీన్లను నేటి నుంచి ప్రారంభిస్తున్నాం,1.45లక్షల మందికి రూ.5రోజునే భోజనం అందిస్తామన్నారు.గిరిజన ప్రాంతాల్లోను అన్న క్యాంటీన్లు ఉంటాయన్నారు.అన్న క్యాంటీన్లకు విరివిగా విరాళాలు ఇవ్వాలన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పనకు స్కిల్ సెన్సస్ చేపడుతున్నామన్నారు. ప్రపంచంలో తొలిసారి స్కిల్ సెన్సెస్‌ను చేపడుతున్నాన్నారు.నిర్మాణ రంగ కార్మికులను దృష్టిలో పెట్టుకుని ఉచిత ఇసుక విధానం తెచ్చామన్నారు.గత ప్రభుత్వంలో జరిగిన ఇసుక అక్రమాలపై సిఐడితో విచారణ జరిపిస్తామని ప్రకటించారు.రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం నిర్దిష్ట నిర్ణయాలతో పాలన సాగించబోతున్నాం,నూతలన ఆలోచనలతో 15శాతం వృద్ధి రేటు సాధించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం,దేవుడి దయ వల్ల సాగునీటి ప్రాజెక్టులకు జూలైలోనే జలకళ వచ్చింది. కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులన్ని నిండాయి. సమర్ధనీటి నిర్వహణ ద్వారా అన్ని ప్రాంతాలకు సాగునీరందిస్తాం.రైతు ఆదాయం పెంచి వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం. వంశధార.,నాగావళి, గోదావరి,కృష్ణా,పెన్నా నదుల అనుసంధానం మా ప్రభుత్వ విధానం అన్నారు.గత ప్రభుత్వ అసమర్ధతతో దెబ్బతిన్న పోలవరాన్ని ముందుకు తీసుకుని వెళ్తామన్నారు.యువతకు అవకాశాలు సృష్టిస్తే అద్భుతాలు సాధిస్తారు.అందుకే మేము నైపుణ్యగణనను చేపట్టిన విషయాన్ని ప్రస్తావిస్తున్నాం.ప్రభుత్వ ఉద్యోగులంటే ప్రభుత్వంలో భాగస్వాములు,వాళ్ళకు 1వ తేదినే జీతాలు ఇస్తున్నామన్నారు.అభివృద్ధి, సంక్షేమం,సామాజిక న్యాయం,సూపర్ సిక్స్-6 హమీలను ఇచ్చాం. రాష్ట్ర పరిస్థితిపై ఏడు అంశాలపై శ్వేత పత్రాలు విడుదల చేసాం,. పోలవరం, అమరావతి, రాజధాని, విద్యుత్తు వంటి శాఖలపై శ్వేతపత్రాలు విడుదల చేసాం,.శ్వేత పత్రాలతో ఎపికి జరిగిన నష్టాన్ని ప్రజలకు వివరిస్తున్నామన్నారు.రివర్‌టెండరింగ్ పేరుతో పోలవరం ప్రాజెక్టుకు తీవ్ర నష్టం చేసారు.మూడు రాజధానుల పేరుతో ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారు.2018 నాటికి ఇంధన మిగులు రాష్ట్రంగా ఏపీ మారింది.2019-24 మధ్య ఏపీ ఇంధనరంగానికి రూ.1,29,503 కోట్లు నష్టం జరిగింది.ఇసుక,ఖనిజ సంపదను కొల్లగొట్టడం ద్వారా రూ.19వేల కోట్లు నష్టం వచ్చిందన్నారు.అస్తవ్యస్థ ఇసుక విధానంతో 20లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారు.నాణ్యతలేని మద్యం,గుర్తింపు లేని బ్రాండ్లు తీసుకొచ్చారు. రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయానికి భారీగా నష్టం తీసుకొచ్చారన్నారు.వైకాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం కారణంగా రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడింది.ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలును ప్రారంభించామన్నారు. సూపర్ సిక్స్ వాగ్దానాలకు కట్టుబడి ఉన్నామన్నారు.16,347 ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి మెగా డీఎస్సీ ప్రకటించామన్నారు. ల్యాండ్‌టైటిలింగ్



పోలీసు దళాలకు ట్రోఫీని అందజేస్తున్న సిఎం చంద్రబాబు

చట్టాన్ని రద్దు చేసామన్నారు.గత ప్రభుత్వ విధానాల కారణంగా రాష్ట్ర ఆర్ధిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపటం ప్రారంబించుటమే అన్నారు.మొత్తంగా ప్రజల విశ్వాసాన్ని ముఖ్యంగా పెట్టుబడులదారులల నమ్మకాన్ని ప్రభావిత పరచి.వారిని గందరగోళానికి గురిచేసిందన్నారు.ఆదాయ వృద్ధి పరిమితంగా ఉన్నప్పటికి ఖర్చులు అపరిమితంగా ఉన్నాయన్నారు. అప్పులు చెల్లింపు బాధ్యతలు బాగా పెరిగాయన్నారు.సామాజిక భద్రత పెన్షన్లను రూ.4వేలు పెంచామన్నారు.రాష్ట్ర పరిస్థితిని అర్ధం చేసుకుని రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజలు సహకరించాలన్నారు.

నిధుల మళ్ళింపు,అధిక ద్రవ్యోల్బణం ఉన్నప్పటికి అధిక పన్నులు విధించడం,విద్యుత్తు రంగంలో రుణాలు పెరగడం,మూలధన వ్యయాన్ని నిర్లక్ష్యం చేయడం ద్వారా ఆర్ధిక దుర్వినియోగానికి కారణమై, చివరకు ఆర్ధిక వ్యవస్థ మందగమనానికి దారి తీసింది. వనరులలో అపారమైన అంతరాన్ని కార్పొరేషన్ల ద్వారా రుణాలు తీసుకొని తరచూ పూరించడానికి ప్రయత్నించడం. ప్రభుత్వ వ్యయంపై ఖర్చు చేయమనని ఒత్తిడి చేయడం ద్వారా ఈ ప్రక్రియలో కార్పొరేషన్లను బలహీనపరచడం జరిగింది. సహజ వనరుల దోపిడిని బహిర్గతం చేస్తామన్నారు.తప్పు చేసిన ఏ ఒక్కరిని వదిలిపెట్టం ,నాటి అక్రమాలపై లోతైన దర్యాప్తు చేయిస్తాం, అక్రమార్కులను శిక్షించి తీరుతామన్నారు.రాష్ట్రం నడిబొడ్డున సంపదను సృష్టించే ప్రజా రాజధానిగా అమరావతికి శంకుస్థాపన చేసామన్నారు.

రాష్ట్రం నడిబొడ్డున ఏర్పాటు చేసిన ఈ రాజధాని గత అయిదేళ్ళలో నిర్లక్ష్యానికి గురి అయినట్లు సీఎం తెలిపారు.రాజధాని తిరిగి ప్రతిష్టాత్మకంగా నిర్మించుకుందామన్నారు.గత ప్రభుత్వ అసమర్ధ విధానాలతో రాష్ట్రంలో అప్పులు పెరిగి రూ.9.74లక్షల కోట్లుకు చేరుకున్నాయన్నారు.తలసరి అప్పు ఇప్పుడు రూ.1,44,336కు పెరిగిందన్నారు.తలసరి ఆదాయం 13.2శాతం నుండి 9.5శాతానికి తగ్గింది.అంటే గత ప్రభుత్వంలో ప్రజల తలసరి ఆదాయం బాగా తగ్గిందన్నారు. రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధి,విమానాశ్రయాల అభివృద్ధి ,వివిధ రంగాలకు రాష్ట్రాన్ని హబ్‌గా మార్చడం.,అన్నదాత సుఖీభవ తదితరంశాలపై సీఎం చంద్రబాబు మాట్లాడారు.ఆయన ప్రసంగం అనంతరం వివిధ రాష్ట్ర అంతరంగిక దళాలను.,విధి నిర్వహణలో మంచి ప్రతిభను కనర్చిన ఉద్యోగులను సీఎం చంద్రబాబు ఘనంగా సత్కరించారు.వారికి ట్రోఫీలు,జ్ఞాపికలు అందించారు.సీఎం చంద్రబాబు స్వాతంత్ర ఉత్సవ వేదిక దగ్గరకు రాగానే ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్.డీజీపీ ద్వారకా తిరుమలరావు,ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు జి,సృజన తదితరులు ఘనం స్వాగతం పలికారు.సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఈ ఉత్సవాల గ్యాలరీలో కూర్చుని సీఎం ప్రసంగ పాఠాన్ని చదువుతూ.విన్నారు.ఉత్సవాల సందర్భంగా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

# తొలి లక్ష్యం

>> 140 కోట్లమందిప్రజల కలలను సాకారంచేయాలని, లక్ష్యనిర్దేశంతో ముందుకు సాగాలన్నారు. కొన్నేళ్లుగా విపత్తులు దేశాన్ని ఇబ్బంది పెట్టాయని, ఈసందర్భంగా విపత్తు బాధిత కుటుంబాలకు మోడీ తన సానుభూతిని ప్రకటించారు. 2047 నాటికి వికసిత్‌భారత్ మనందరి లక్ష్యమం అని భారత్‌నుప్రపంచ నైపుణ్యాల రాజధానిగా మార్చాలని తయారీ రంగంలో గ్లోబల్ హబ్‌గా భారత్‌ను మార్చాలని ప్రధాని అన్నారు. ప్రపంచానికే అన్నం పెట్టేస్థాయికి భారత్ ఎదగాలని, దేశాభివృద్ధికి పాలనా సంస్కరణలు అవసరమని న్యాయవ్యవస్థలో సంస్కరణలు అవసరమని ప్రధానిమోడీ ఆకాంక్షించారు. అంతరిక్షంలో భారత్ స్పేస్‌స్టేషన్ కల త్వరలో సాకారం కావాలని కోరారు. మనం అనుకుంటే 2047నాటికి భారత్ అభివృద్ధిచెందిన దేశంగా మారుతుందని, వికసిత్‌భారత్ 2047 నినాదం 140 కోట్లమందిప్రజల కలల తీర్మానమన్నారు. దళితులు పీడితులు ఆదవాసీలు గౌరవంగాజీవించాలని, వోకల్‌ఫర్ లోకల్ అనేది ప్రభుత్వ వ్యూహం అని ఈ నినాదమే ఇపుడు ఆర్థికవ్యవస్థలో సమూల మార్పులు తెచ్చిందన్నారు.

మెరుపుదాడులను దేశప్రజలు గర్వంగా భావించారని, అభివృద్ధి బ్లూప్రింట్‌గా సంస్కరణలు తీసుకొస్తున్నామని ప్రధానిమోడీ తెలిపారు. నేషన్ ఫస్ట్ రాష్ట్ర హిత్ సుప్రీం సంకల్పంతో ముందుకెళుతున్నామని బ్యాంకింగ్ రంగంలో ఎన్నో సంస్కరణలు తెచ్చామని భారత్ బ్యాంకింగ్ వ్యవస్థ ప్రపంచంలో అందరికీ చేరాలని మోడీ ఆకాంక్షించారు. భారీ సంస్కరణలు తెచ్చేందుకు ప్రభుత్వం సంకల్పంతో ఉందని దేశాభివృద్ధికి కొత్త ఆర్థిక విధానాలు అమలుచేస్తున్నామని తెలిపారు. ఉపాధి కల్పనలో గణనీయమైన ప్రగతిని సాధించామనియువతకు నూతన ఉపాధి అవకాశాలు ందుబాటులో ఉన్నాయన్నారు. అన్నిరంగాల్లో ఆధునిక సాంకేతికతకు పెద్దపీట వేస్తామని భారత్ త్వరలోనే ప్రపంచంలో మూడో ఆర్థికవ్యవస్థగా ఆవిర్భవిస్తున్నదన్నారు. స్వయం సహాయక రంగాలకు ఇప్పటివరకూ రూ.09 లక్షలకోట్ల రుణాలిచ్చామని, కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తామని ప్రధాని అన్నారు.

అంతరిక్ష రంగంలో భారత్ బలమైన శక్తిగా ఎదిగిందని, వందలకొద్దీ స్టార్టప్‌లు వచ్చాయని ప్రైవేటు ఉపగ్రహాలు రాకెట్లు ప్రయోగిస్తున్నారని ప్రధాని అన్నారు. మరో 10 కోట్లమంది మహిళలు, కొత్తగా స్వయం సహాయక సంఘాల్లో చేరారని మౌలిక సదుపాయాల్లో పెనుమార్పులు తెచ్చామన్నారు. దేశ హితమే ప్రథమ ప్రాధాన్యమని అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని, మనకలలు సాకారం అయ్యే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. నూతన నేర చట్టాల్లో శిక్షలకంటే న్యాయానికే ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రభుత్వ ప్రమేయం అతితక్కువ ఉండేలా పౌరసేవలు ఉంటాయని ఎగుమతుల్లో పురోగతితో ప్రపంచ ప్రగతిలోభారత్‌పాత్ర పెరిగిందనిప్రధాని అన్నారు. ఒకప్పుడు మొబైల్‌ఫోన్లు దిగుమతిచేసుకున్నామని, ఇపుడు మనమే ఎగుమతిచేస్తున్నామన్నారు. వైద్యవిద్యకోసం లక్షలు ఖర్చుచేసి విదేశాలకు వెళుతున్నారని, విద్యకోసం విదేశాలకు వెళ్లే దుస్థితిని తప్పిస్తామని స్పష్టంచేసారు. వచ్చే ఐదేళ్లలో 75 వేల మెడికల్ సీట్లు రాబోతున్నాయని తెలిపారు. చంద్రయాన్‌ప్రయోగం యువతలో శాస్త్రీయ ఆసక్తిని పెంచిందని ప్రపంచానికి సేంద్రీయ ఆహారం అందించేస్థాయికి మన రైతులు చేరుకున్నారన్నారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే భయపడే పరిస్థితి తెస్తామని హెచ్చరించారు. 5జితోనే ఆగదని, కమ్యూనికేషన్ల వ్యవస్థలో 6జిపైనా అధ్యయనం కొనసాగుతోందన్నారు. గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా భారత్‌ను రూపొందిస్తామని ప్రధాని పేర్కొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 16-08-2024, శుక్రవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
శ్రావణమాసం, దక్షిణాయనం,
వర్ష ఋతువు, శుక్లపక్షం,
ఏకాదశి ఉ.9.40,
మూల మ.12.43,
వర్జ్యం ఉ.11.08-12.44,
2) రా.9.57-11.29
దు.ఉ.8.32-9.23, 2) మ.12.46-1.37,
శుభసమయం : ఉ.6.30-7.15,
సా.5.30-6.15
రాహుకాలం - ఉ.10.30-12.00

# 'అన్న' క్యాంటీన్లు ఆరంభం

>> 100 అన న్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. సెప్టెంబర్ నాటికి పూర్తి స్థాయిలో అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. పేదరికం లేని సమాజం కావాలన్నదే ఎన్టీఆర్ లక్ష్యమని చంద్రబాబు తెలిపారు. టిడిపి ప్రభుత్వం హయంలో నిర్వహించిన అన్న క్యాంటీన్లను గత వైఎస్సార్సీ ప్రభుత్వం మూసివేసి నిరుపేదలను రోడ్డున పడేసింది. క్యాంటీన్లలో అందించే ఆహారం సోమవారం నుండి శనివారం వరకు రోజూ ఉదయం అల్పాహారం కింద ఇడ్లీ-చట్నీ, సాంబరు అందిస్తారు. సోమవారం, గురువారం ఇడ్లీతో పాటు పూరీ కుర్మా, మంగళవారం, శుక్రవారం ఉప్మా-చట్నీ, బుధవారం, శనివారం పొంగల్-చట్నీ అందుబాటులో ఉంటాయిన్నారు. సోమవారం నుంచి శనివవారం వరకు రోజూ మధ్యాహ్నం, రాత్రి అన్నంతోపాటు కూర, పప్పు-సాంబారు, పెరుగు పచ్చడి అందిస్తారు.



గురువారం గుడివాడలో అన్న క్యాంటిన్ ప్రారంభించి భోజనం చేస్తున్న సిఎం చంద్రబాబు దంపతులు

## స్వాతంత్ర్య ప్రసంగంలో ప్రధాని మోడీ సరికొత్త రికార్డు

### వరుగా 11 సార్లు.. తాజాగా 98 నిమిషాలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** స్వాతంత్ర్యదినోత్సవం రోజున జాతినుద్దేశించిన చేసిన ప్రసంగాల్లో కూడా ప్రధానిమోడీ రికార్డునమోదుచేసారు. వరుసగా 11వ సారి 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట బురుజుమీదినుంచి ప్రధాని మోడీ ఈసారి 98 నిమిషాల పాటుప్రసంగించారు. గత స్వాతంత్ర్య దినోత్సవాలతోపోలిస్తే ఈసారి మోడీ సుదీర్ఘ సమయం తీసుకున్నారు. ప్రసంగ అవధిలో కూడా మోడీదే రికార్డుగా నిలిచింది 2016లో మోడీ కేవలం 96 నిమిషాలపాటు ప్రసంగిస్తే 2017లో మోడీ కేవలం 56 నిమిషాల పాటుమాత్రమే ప్రసంగించారు. వరుసగా మూడోసారి పగ్గాలుచేపట్టిన మోడీ ఈసారి కూడా స్వాతంత్ర్య దినోత్సవం రోజున జెండా ఎగురవేసి దశాబ్దకాలంపైగా జాతీయ పతాకాలు ఆవిష్కరించిన భారత ప్రధానిగా రికార్డునమోదుచేసారు. ప్రధానిమోడీకి ముందు జవహర్‌లాల్ నెహ్రూ 1947లోను, ఐకె గుజ్రాల్ 1997లోను సుదీర్ఘ సమయంపాటుప్రసంగాలుచేసారు. నెహ్రూ 72 నిమిషాలు, గుజ్రాల్ 71 నిమిషాలపాటుప్రసంగాలుచేసారు. గతంలో నెహ్రూ కూడా స్వల్ప వ్యవధి ప్రసంగాలుచేసినవారిలో ఉన్నారు. 1954లో కేవలం 14 నిమిషాలు మాత్రమే నెహ్రూ ప్రసంగిస్తే 1966లో ఇందిరాగాంధీ కూడా 14నిమిషాలపాటు ప్రసంగించిన సందర్భాలున్నాయి.



రాకెట్ ప్రయోగానికి ముందు ప్రత్యేక పూజలు చేసిన ఇస్రో చైర్మన్ సోమనాథ్

# ప్రయోగం నేడే

>> పరిశోధనాత్మక ప్రయోగాలు మాత్రమే ఇక్కడ జరిగాయి. గగన్‌యాన్‌కు పూర్తి దృష్టి పెట్టడం, చంద్రయాన్-3 విజయం తర్వాత విజయోత్సవాలకు కొంత సమయం కేటాయించడంతో రాకెట్ ప్రయోగాలు ఆలస్యమైనట్లు కొందరు అంటున్నారు. శుక్రవారం ఉదయం ఎస్ఎస్ఎల్‌వి డి3 ప్రయోగం పూర్తి స్థాయి విజయం సాధించి భారత దేశానికి సమాచార, వాతావరణ, భూపరిశీలన, రక్షణ వంటి వాటి పరిష్కారానికి సహాయపడుతుందని భావిస్తున్నారు.



గురువారం సిఎం చంద్రబాబు సమక్షంలో ఎన్టీపిసితో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్న దృశ్యం

# ఎన్టీపీసీతో ఒప్పందం

>> వ్యవస్థల ఏర్పాటు ద్వారా ఏటా రూ.118.27 కోట్ల మేర విద్యుత్ ఆదా అవుతుంది. 25 ఏళ్లలో రూ.2957 కోట్ల మేర ఆదా కానుంది. దీంతో పాటు ఏడాదికి 3.41 లక్షల మెట్రిక్ టన్నుల మేర పొల్యూషన్ తగ్గుతుంది అని చెప్పుకొచ్చారు. 25 ఏళ్లలో 85.25 లక్షల మెట్రిక్ టన్నుల మేర పొల్యూషన్ తగ్గించగలం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పుకొచ్చారు.

## భావితరాలకు తెలపాలి

>> ఆధ్వర్యంలో పోలీసు దళం మంత్రికి సెల్యూట్ సమర్పించారు. 194మంది అధికారులు సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందించారు. ఈకార్యక్రమంలో ఎంపీ సీఎం రమేష్, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ జిల్లా ఎస్పీ ఎం దీపిక తదితరులు పాల్గొన్నారు. హోంమంత్రి నివాసం వద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నక్కపల్లిలో గల హోం మంత్రి నివాసం వద్ద అట్టహాసంగా నిర్వహించారు

## దేశంలోకి విదేశీ పర్యాటకులకు ఆహ్వానం

### ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ కొత్తనిర్ణయం

**ప్యాంగ్యాంగ్( ఉత్తరకొరియా), ఆగస్టు 15:** నియంతపాలకుడుగా పేరుపొందిన ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్ ఉన్ విదేశీ పర్యాటకులకు తీపి కబురు చెప్పారు. ఈశాన్యనగరమైన సంజియోన్‌కి డిసెంబరునెలనుంచి అంతర్జాతీయ పర్యాటకాన్ని పునఃప్రారంభిస్తున్నారు. ఇదే సమయంలో దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా పర్యాటకులను అనుమతించవచ్చని ఆదేశ టూరిస్టు కంపెనీలు వెల్లడించాయి.

## వార్తాఫలం

**మేషం :** వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. ఆరోగ్య విషయాలలో జాగ్రత్త.

**వృషభం :** ముఖ్యమైన విషయాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. స్వల్పధన లాభం.

**మిథునం:** పలుకుబడి కలిగిన వ్యక్తులు పరిచయమవుతారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**కర్కాటకం :** సోదరులను కలిసి ఆనందంగా గడుపుతారు. సంఘంలో గౌరవమర్యాదలు పెరుగుతాయి.

**సింహం:** మీలోని ప్రతిభా పాటవాలు వెలుగులోకి వస్తాయి. సమస్యలు కొంతవరకు తీరుతాయి.

**కన్య :** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. కాంట్రాక్టులు లభిస్తాయి.

**తుల :** ఎంత కష్టించినా ఫలితం అంతంత మాత్రమే. భూవివాదాలు పరిష్కరించుకొంటారు.

**వృశ్చికం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రముగా వున్నా అవసరాలకు డబ్బు అందుతుంది.

**ధనుస్సు:** రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి అనుకోని ఆహ్వానాలు అందుతాయి.

**మకరం:** భూములు క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**కుంభం:** అనుకోని అతిథుల నుండి శుభ ఆహ్వానాలు అందుకొంటారు. క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**మీనం :** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. కాంట్రాక్టులు లభిస్తాయి. వాహనాల కొనుగోలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




గురువారం విజయవాడలో 78వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా రాష్ట్ర అభివృద్ధిని ప్రదర్శించే అలంకృత శకటాలు

# ఢిల్లీ స్వాతంత్ర్య వేడుకలకు అంగన్‌వాడీలు

**విజయవాడ ఆగస్టు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలోని వివిధ విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన అంగన్‌వాడీ కార్యకర్తలను ఢిల్లీలో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక అతిథులుగా ఎంపిక చేసినట్లు ఆ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. వారంతా నేడు ఢిల్లీలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. అనకాపల్లి జిల్లా మల్లెనాయుడుపాలేనికి చెందిన ఆర్.రమణమ్మ, అనంతపురం నేతాజీకాలనీకి చెందిన నిర్మలమ్మ, అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన జయలక్ష్మి, బాపట్ల జిల్లా కె.మల్లాయపాలేనికి చెందిన నాగమణి, ఏలూరు పీడీ కార్యాలయంలో పనిచేసే సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ సిహెచ్.నిర్మలను ఎంపిక చేసినట్లు తెలిపారు. పూర్వ ప్రాథమిక విద్య నమోదు, పోషణ స్థితిని పెంపొందించడం, ఇంటికేరేషన్ సరుకుల పంపిణీ, గర్భిణులు బాలింతల నమోదు, లబ్ధిదారుల వివరాలు పోషణ్ ట్రాకర్‌లో నమోదు చేయడంలో వీరు ఉత్తమ పనితీరు కనబరిచారు. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆహ్వానంపై గుంటూరు జడ్పీ ఛైర్‌పర్సన్ కథేరా హెనీక్రిస్టినా, పశ్చిమగోదావరి జిల్లా వీరాసరం ఎంపీపీ వీరపల్లి దుర్గాభవాని, అల్లూరి సీతారామరాజు, కృష్ణా, అనంతపురం, విజయనగరం జిల్లాలోని వివిధ గ్రామాల సర్పంచులు ఎల్.చిత్తమ్మ పి.కృష్ణకుమారి, బి.కవిత, వై.ఆదిలక్ష్మి కె.ఆదినారాయణ, వి.వెంకటరావు, పి.రామమణికంఠ, ఎస్, మోహనరావు. వి.వెంకటరావులను ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు పంపించినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ అధికారులు తెలిపారు.

## రాష్ట్రంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ : ఇసి

**విజయవాడ ఆగస్టు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కోసం ఎన్నికల సంఘం ప్రకటన జారీ చేసింది. అక్టోబరు 1 వ తేదీ నాటికి ఓటర్లుగా అర్హులయ్యే వారి పేర్లను జాబీతాలో చేర్చేలా సవరణ ప్రక్రియ చేపట్టనున్న ఈసీ 2025 జనవరి 1 వ తేదీ నాటికి తుది ఓటర్ల జాబీతా ప్రకటన కోసం ప్రక్రియను ప్రారంభించేలా ప్రకటన విడుదల చేసింది. ఓటర్ల జాబితాలో సవరణలు, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌ప్రక్రియను ఆగస్టు 20వ తేదీ నుంచి ఈసీ ప్రారంభించనుంది. ఇక ,అక్టోబరు 28 వ తేదీ వరకూ ముసాయిదా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని నిర్ణయం తీసుకుంది. అలాగే అక్టోబరు 29వ తేదీన ముసాయితా ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించనుంది. 2024 నవంబరు 29 వ తేదీ వరక ముసాయితా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించనుంది.

# భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం మన ధ్యేయం

## -సేవాభావంతో మరింత ఉన్నతంగా సేవలు - తిరుపతిలో టిటిడి ఇఒ శ్యామలరావు

**తిరుపతి,ఆగస్ట్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచం నలుమూలల నుండి తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి వస్తున్న భక్తులకు మరింత త్వరగా, సంతృప్తికరంగా స్వామివారి దర్శనం కల్పించేందుకు టిటిడి ఉద్యోగులు అంకితభావంతో సేవలందించాలని టిటిడి ఇఒ జె.శ్యామలరావు పిలుపునిచ్చారు. టిటిడి నిర్వహణలోని అన్ని ఆలయాల్లో జాయంగార్లు, ఆతర ప్రముఖ ఆగమశాస్త్ర నిపుణుల సలహాల మేరకు నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహిస్తున్నామన్నారు. రానున్న అక్టోబర్ 4నుండి స్వామివారి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు విస్తృతంగా ఏర్పాట్లుచేస్తున్నామన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని గురువారం ఉయదం టిటిడి పరిపాలన భవనం ప్రాంగణంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒలు గౌతమి, వీరబ్రహ్మం, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, సిఇ నాగేశ్వరరావు, ఎఫ్ఎసిఎఒ బాలాజీ ఇతర అధికారులతో కలసి గురువారం ఉదయం జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఇఒ శ్యామలరావు మాట్లాడుతూ తిరుమల స్వచ్ఛతకు మారుపేరని, పరిశుభ్రతను మెరుగ్గా ఉంచడానికి



ఎప్పటికప్పుడు మెరుగైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తులకు దర్శనం, వసతి మరింత సులభతరం చేశామన్నారు. స్థానిక ఆలయాల్లోనూ భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పన దిశగా పనిచేస్తున్నామని ఇఒ తెలిపారు. సనాతన హిందూ ధర్మప్రచారాన్ని విస్తృతంగా జనబాముళ్యంలోనికి తీసుకెళ్ళడంలో టిటిడి హిందూ ధార్మికప్రాజెక్టులను కొన్ని దశాబ్ధాల క్రిందట ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. టిటిడిలోని 33విద్యాసంస్థల్లో 19 వేలమందికిపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. ఎక్కువమంది యువత స్వచ్ఛం దంగా శ్రీవారి సేవలో పాల్గోని, భక్తులకు విశేషసేవలందిస్తున్నారని ఇఒ తెలిపారు. ఇతర ధార్మిక సంస్థలకు టిటిడి స్ఫూర్తి దాయ కంగా ఉండాలని, సర్వజగ ద్రక్షకుడైన శ్రీవేంకటేశ్వరస్వామి యావత్ ప్రపంచానికి శాంతి సౌఖ్యాలు ప్రసాదించాలని ప్రార్థిం చడం జరుగుతుందని తెలిపారు. అనంతరం టిటిడిలో వివిధ విభాగాల్లో అంకిత భావసేవలం దించిన 36మంది అధికారులు, 251మంది ఉద్యోగులకు శ్రీవారి వెండిడాలర్, ప్రశంసాపత్రం అందజేశారు. అలాగే టిటిడి ఉద్యోగుల పిల్లలకు సంబంధించి ఇంటర్‌లో ప్రతిభ కనబరచిన 19మంది విద్యార్థులకు 2,116 రూపాయలు, 10వతరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు 55మందికి 1,116 రూపాయలు నగదు బహుమతులను ఇఒ శ్యామలరావు అందజేశారు. సాంస్కృతిక,నృత్య కార్యక్రమాలు, పోలీసు జాగిలాల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# అంతరిక్ష కేంద్రంలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

## - జాతీయ జెండా ఎగురవేసిన ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్



షార్‌లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్

**శ్రీహరికోట (తడ), ఆగస్టు 15 ప్రభాతవార్త** శ్రీహరికోటలోని సతీష్‌థవన్ అంతరిక్ష కేంద్రంలో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక స్పేస్ సెంట్రల్ స్కూలు ఆవరణలో ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ జాతీయ జెండాను ఎగురవేసి ప్రసంగించారు. ఒక ఛైర్మన్ హోదాలో షార్‌లో జాతీయ జెండాను ఎగురవేయడం ఇదే తొలిసారి. శుక్రవారం ఉదయం జరగనున్న ఎస్ఎస్ఎల్‌వి డి3 రాకెట్ ప్రయోగ సన్నాహాల కోసం సోమనాథ్ షార్‌లోనే ఉండటంతో ఆయన చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పేస్ సెంట్రల్ స్కూలు విద్యార్థులు, షార్ అధికారులు, సీఐఎస్ఎఫ్ దళాల ముందు ఛైర్మన్ సీఐఎస్ఎఫ్ కమాండెంట్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పెరేడ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమనాథ్ మాట్లాడుతూ గత ఏడాది దాదాపు ఇదే సమయాన చంద్రయాన్-3 ప్రయోగ విజయంతో దేశం గర్వించే స్థానం సంపాదించామన్నారు. పరిశోధనలు, ప్రయోగాలలో ఇస్రో మరింత ముందుకు దూసుకెళుతుందని చెప్పారు. ఇందుకు తగ్గట్లే ప్రతిష్టాత్మక ప్రయోగాలు భవిష్యత్‌లో జరుపుతున్నామని చెప్పారు. దేశాభివృద్ధిలోను, అంతరిక్ష ప్రయోగాలపరంగాను ఇస్రో ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ 2040లో చంద్రునిపైకి మనిషిని పంపించాలని ఆకాం క్షించిన విషయాన్ని గుర్తు చేశారు. అంతకు ముందు గగన్‌యాన్ ద్వారా వ్యోమగాములను అంతరిక్షంలోకి ఇస్రో పంపించనుందన్నారు. శ్రీహరికోట అంటే ఇస్రో గఘన విజయాల్లో పాలుపంచుకునే ఒక ముఖ్యమైన ప్రదేశమని ఆయన కొనియాడారు. ఇక్కడ కష్టపడి పనిచేసే తత్వంతో నిరంతరం శ్రమిస్తున్నట్లు సోమనాథ్ ఈ సందర్భంగా అన్నారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, వీఎస్ఎస్‌సి డైరెక్టర్ ఉన్ని కృష్ణన్ నాయర్, కంట్రోల్ ఎం.శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌బాబు, గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్పేస్ సెంట్రల్ స్కూలు విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇదిలావుంటే శ్రీహరికోటలోని వివిధ కాలనీలు, ప్రభుత్వ పాఠశాలల్లో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సూళ్లూరుపేటలోని స్వర్ణముఖి నగర్ స్పేస్ సెంట్రల్ స్కూలు వద్ద రేంజ్ ఆపరేషనల్ డిప్యూటీ డైరెక్టర్ జి.గ్రహందొరై, షార్‌లోని క్యూసీహెచ్ కాలనీలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూలులో వాల్ఫ్ డిప్యూటీ డైరెక్టర్ రఘురామ్, శ్రీహరికోట ఎంపిపి స్కూల్లో ఎల్ఎస్ఎఫ్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.ముత్తు తెజియన్‌తో పాటు శ్రీహరికోట ఉద్యోగులు నివాసం ఉండే పులికాట్ నగర్ కాలనీలో అసోసియేట్ డైరెక్టర్ ఎ.సయ్యద్ హమీద్‌లు జాతీయ జెండాలు ఎగురవేసి ప్రసంగించారు. పాఠశాలల పిల్లలు, సిబ్బందితో పాటు సిఐఎస్ఎఫ్, పోలీసులు, యానాది వెల్ఫేర్ కమిటీ వారు పాల్గొన్నారు.

# హైకోర్టు ఆవరణలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

## జాతీయ జెండాను ఆవిష్కరించిన చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

**విజయవాడ ఆగస్టు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర రాజధాని అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో 78 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం జరిగిన ఈ వేడుకలకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా పాల్గొని మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఠాకూర్ మాట్లాడుతూ స్వరాజ్యం, స్వపరిపాలన భారతీయుల జన్మ హక్కు అంటూ నినాదాలు చేస్తూ స్వాతంత్ర సాధనకై ఎంతో మంది తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి వలస వాదుల పాన నుండి భారత దేశాన్నికి విముక్తి కలిగించారన్నారు.నేడు అటువంటి మహానుభావుల అందరినీ స్మరించుకుంటూ శిరస్సు వంచి ప్రణామాలు చేయాల్సిన శుభదినం అన్నారు. వారి దేశభక్తి, జాతీయవాదం ప్రస్తుత మరియు రానున్న తరాలవారికి ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు. దేశ సమైఖ్యతను సమగ్రతను కాపాడేందుకు సరిహద్దుల్లో నిరంతరం పాటుపడుతున్న సాయుధ దళాల సేవలకు మనం అందరం



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

ఎల్లవేళలా కృతజ్ఞులై ఉండాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందాన్నరు. ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చట్టాన్ని గౌరవించే పౌరులుగా సమిష్టిగా పనిచేస్తూ దేశ గౌరవం సార్వభౌమత్యం మరియు ఐక్యతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాల్సి ఉందాన్నారు.

# ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూస్తున్నాయి: పురందేశ్వరి కీలక వ్యాఖ్యలు

**విజయవాడ ఆగస్టు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ దేశాలు భారతదేశం వైపు నేడు చూస్తున్నాయని బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిపారు. జాతీయ పతాకాన్ని పురందేశ్వరి ఎగుర వేశారు. ఈ వేడుకల్లో వివిధ మోర్చాల రాష్ట్ర అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ దేశ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మనకంటే ముందు తరం వాళ్లు ఎన్నో త్యాగాలు చేసి స్వాతంత్ర్యం తెచ్చారు. ఆ ఐకమత్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరి పైనా ఉంది. ఆ నాడు నలభై కోట్ల మంది దేశ ప్రజలు ఈ స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వామ్యం అయ్యారు. ఇప్పుడు మన దేశ జనాభా 144 కోట్ల మంది ఉన్నారు. మన దేశ ప్రజలంతా ఐకమత్యంతో ముందుకు వెళ్లాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు ఇచ్చారు. అని పురందేశ్వరి వెల్లడించారు. కొన్ని దేశాల



కుట్రల నేపథ్యంలో భారతీయులంతా ఒకటనే భావనతో ఉండాలి. 2040 నాటికి వికసిత భారత్ చూడాలనేది ప్రధాన మోదీ లక్ష్యం. వికసిత ఏపీ కోసం అంతా కలిసి పనిచేయాలి. రాష్ట్ర అభివృద్ధికి అంకితమై ముందుకు సాగాలి. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కూటమికి తిరుగులేని అధికారం ఇచ్చారు. ప్రజల సమస్యలు పరిష్కారానికి బీజేపీ వారధి కార్యక్రమం ప్రారంభించింది. నేటి నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉంటారు. ప్రజల సమస్యలు పరిష్కరించి వాటిని ఒక యాప్‌లో కూడా పెడతాం. ప్రజలకు సేవకులుగా పని చేసి వారి కన్నీరు తుడుస్తాం అని పురందేశ్వరి పేర్కొన్నారు.

# ఇంజినీరింగ్ ఉద్యోగుల కోసం రాత్రి కళాశాలలు

**విజయవాడ ఆగస్టు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ ప్రభుత్వం ఆయా రాష్ట్ర సర్వీసుల్లో ఉద్యోగులకు శుభవార్త తెలిపింది.గత మూడేళ్లుగా మొదటి సంవత్సరంలో 80 శాతం సీట్లు భర్తీ అవుతున్న కళాశాలలను, యాస్పిరేషనల్ జిల్లాల్లో ఉన్న కళాశాలల్లో ఈ కోర్సులను ప్రవేశపెట్టేందుకు ఏపీసీటీఈ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో 8 కళాశాలల్లో 3 కోర్సులకు అనుమతులు ఇవ్వగా మరో ఎనిమిదింటిల్లో 2, ఒక కళాశాలలో ఒక్క కోర్సుకు అనుమతులు లభించాయి. మొత్తం 41.కోర్సుల్లో 1230 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. వీటిల్లోనూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు సంబంధించిన కోర్సులే ఎక్కువగా ఉన్నాయి. సీఎస్ఈ కృత్రిమ మేధ మెషీన్ లెర్నింగ్ కంప్యూటర్ సైన్సు ఇంజినీరింగ్ మెకానికల్, సివిల్, ఈసీఈ, ఈఈఈ కోర్సులు ఉన్నాయి. రెగ్యులర్ బ్రాంచికి 60 సీట్లు కాగా దీనికి సంబంధించి ఒక్కో బ్రాంచికి 30 సీట్లకు ఏపీసీటీఈ అనుమతులు ఇచ్చింది. కొత్తగా వచ్చిన ఈ కోర్సులు, కళాశాలల నిర్వహణ, సీట్ల భర్తీకి ఉన్నత విద్యామండలి మార్గదర్శకాలు సిద్ధం చేస్తోంది. వీటిని ప్రభుత్వానికి సమర్పించనుంది. ఆ తార్వత విశ్వవిద్యాలయాలు అనుమతులు ఇస్తాయి. ప్రవేశాలకు ఏపీసీటీఈ మార్గదర్శకాలివి...కోర్సు నిర్వహించేందుకు మొత్తం సీట్లలో 1/3 సీట్లు భర్తీ కావాలి. అర్హత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పించాలి. విద్యా సంస్థకు 50 కిలోమీటర్ల దూరంలో పరిశ్రమలు ఎంఎస్ఎంఈ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పని చేస్తూ ఉండాలి. పాలిటెక్నిక్ డిప్లొమా చేసిన వారు బీటెక్ రెండో ఏడాదిలో నేరుగా ప్రవేశాలు పొందొచ్చు మూడేళ్లు చదవాల్సి ఉంటుంది. పరీక్షలు, పాఠ్యాంశాలు రెగ్యులర్ విధానంలో ఉన్నట్లే నిర్వహిస్తారు. ఈ కోర్సులకు కళాశాలల్లో అందుబాటులో ఉన్న మానవ వనరులు, సదుపాయాలను ఉపయోగించుకోవచ్చు. అలా ఉపయోగించుకున్న సేవలకు అదనంగా గౌరవ వేతనం చెల్లించాలి. వర్కింగ్ ప్రొఫెషనల్స్ ప్రవేశాలకు విశ్వవిద్యాలయాలు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

# తిరుమల సమాచారం

## పవిత్రప్రతిష్టతో గోవిందుని పవిత్రోత్సవాలు



**తిరుమల,ఆగస్ట్ 15ప్రభాతవార్తప్రతినిధి:** వైష్ణవ సాంప్రదాయం ప్రకారం జాతశౌచం, మృతశౌచం వంటి సమయాల్లో తెలిసీతెలియకో భక్తులు, ఆలయ సిబ్బందిచేత కలిగే దోషాల వల్ల ఆలయ పవిత్రతకు ఎటువంటి భంగం వాటిల్లకుండా జరిపించే మూడురోజుల పవిత్రోత్సవాలు గురువారం ఉదయం ప్రారంభమయ్యాయి. వైఖానస ఆగమోక్తంగా జరిపించే ఈ ఉత్సవాల్లో తొలిరోజు ఉదయం శ్రీదేవి భూదేవిసమేత మలయప్పస్వామివారిని సంపంగిప్రాకారంలోని పవిత్రమండపంలోనికి వేంచేపుచేశారు. అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. వేడుకగా ఉత్సవమూర్తులకు పాలు,పెరుగు, తేనె, చందనం, కొబ్బరిజలం సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. వేదపండితులు వేదసూక్తాలను పఠించారు. సాయంత్రం ఉత్సవమూర్తులు స్వామిఅమ్మవార్లు ఆలయ నాలుగు మాఢ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో స్వామివారికి జరిగే ఆర్జితసేవలు రద్దుయ్యాయి. పవిత్రోత్సవాల్లో తొలిరోజు గురువారం మధ్యాహ్నం శ్రీదేవిభూదేవిసమేల మలయప్పస్వామికి పవిత్ర ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకారసేవలు రద్దయ్యాయి.

ఈ కార్యక్ర మంలో పెద్దజీయంగారు, చిన్నజీయంగారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ ప్రధానఅర్చకుడు వేణు గోపాలదీక్షితులు, అర్చకులు పాల్గొన్నారు.

## పిఎస్ఎల్‌వి -డి 3 విజయవంతం కావాలి

### - తిరుమలలో ఇస్రో శాస్త్రవేత్తలు



**తిరుమల,ఆగస్ట్ 15ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశం ఖ్యాతి అంతర్జాతీయ స్థాయిలో మరింత ఇనుమడింపజేసేందుకు శ్రీహరికోటలోని ఇస్రో నూతన ప్రయోగాలు చేస్తూండటం తార్కాణమని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. నూతనంగా ఇస్రో చేపడుతున్న పిఎస్ఎల్‌వి-డి 3 ఉపగ్రహం ప్రయోగం మరో 48గంటల్లో మొదలవనుండగా గురువారం ఉదయం ఇస్రో శాస్త్రవేత్తలు డైరెక్టర్ ఎకె పాత్ర, ప్రిన్సిపల్ కార్యదర్శి యశోధ బృందం తిరుమలకు చేరుకున్నారు. ఈ బృందం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. నమూనా ఉపగ్రహాన్ని స్వామివారి పాదాలచెంత ఉంచి పూజలు చేశారు. అనంతరం ఈ ప్రయోగం విజయవంతం కావాలని శాస్త్రవేత్తలు శ్రీవారిని వేడుకున్నారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి సుప్రభాతసేవలో నటుడు మహేశ్‌బాబు కుటుంబం



**తిరుమల,ఆగస్ట్ 15ప్రభాతవార్తప్రతినిధి:** స్వాతంత్ర్యదినోత్సవ వేల కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం బాగా జరిగిందని, స్వామివారిని సుప్రభాతసేవలో దర్శించుకోవడం మనసు ఆనందంగా ఉందని సినీనటుడు మహేశ్‌బాబు కుటుంబం భార్య నమ్రత శిరోద్కర్, కుమారుడు గౌతమ్, కుమార్తె సితారతో కలసి దర్శనం చేసుకుంది. వేకువజామున ఆలయం వద్దకు చేరుకున్న వీరికి టిటిడి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. సుప్రభాతసేవలో స్వామివారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి, శేషవస్త్రం, స్వామిచిత్రపటం బహుకరించారు. ఆలయం వెలుపల వీరిని చూసేందుకు అభిమానులు ఉత్సాహంచూపారు.

# ఉత్తమ అవార్డును అందుకున్నమున్సిపల్ కమిషనర్



దేవాదాయశాఖ మంత్రి నుంచి ఉత్తమ కమిషనర్ అవార్డు అందుకుంటున్న రమేష్‌బాబు

**శ్రీకాళహస్తి,ఆగస్టు 15 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా అందించే ఉత్తమ పని తీరు అవార్డులలో ఈ ఏడాది శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ్‌నారాయణ రెడ్డి చేతులు మీదుగా అందుకున్నారు. గురువారం తిరుపతి కలెక్టరేట్ వద్ద విధి నిర్వహణలో జవాబు దారితనంతో వ్యవహారించి ప్రజాసంక్షేమ కార్యక్రమాల్లో చొరవ చూపిన అధికారులకు 'ఉత్తమ అధికారి' అవార్డులను అందించారు. ఈ అవార్డుల పండగలో శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబుకు అవకాశం దక్కింది. రమేష్‌బాబు 2017-2019లో ఇక్కడ తెలుగుదేశం పాలనలో కమిషనర్‌గా పని చేసారు. ఆయన హయాంలో టిడ్కో ఇళ్ళ నిర్మాణం,అన్నా క్యాంటిన్లు,రోడ్లు, మురుగునీటి కాలువలు,అమృతపథకాలు అమలు జరిగాయి. 2022లో మళ్ళీ ఇక్కడకు కమిషనర్‌గా వచ్చారు..ఆయన వచ్చినప్పటి నుంచి 'ప్లాస్టిక్ మీద యుద్ధం ప్రకటించారు.' ఇక తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శాసనసభ్యుడు వెంకటసుధీర్‌రెడ్డి సూచనలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. ముఖ్యంగా శానిటేషన్ మీద దృష్టి సారించారు. పరిపాలనలో ఆయన సిబ్బంది ద్వారా పని చేయించటంలో ఉదయమే వార్డుల్లో దర్శనమిస్తుంటారు. ఇక స్థానికంగా జరిగే శివరాత్రి, ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలు, సుబ్రమణ్యం స్వామి మహోత్సవాల్లో పారిశుద్ధ్యం విషయంలో ఆయన పని తీరు ప్రత్యేకంగా ఉంటుంది. ఉత్సవాల సందర్భంగా రోడ్ల మీద పడే చెత్త కంటికి కనబడకుండా తొలగించటానికి ప్రణాళికా బద్ధంగా వ్యవహారించారు. ఉత్తమ కమిషనర్ అవార్డును దేవాదాయశాఖ మంత్రి ఆనం, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఇచ్చారు.

వార్త

మితిమీరిన ఆశలకు పోయేవారే ఎక్కువగా మోసాలకు గురి అవుతుంటారు.

-అరిస్టాటిల్

# చిద్రమవుతున్న చిన్ననీటి వనరులు?


పాలకుల అలక్ష్యం, ఆశ్రితపక్షపాతం, అవినీతి కారణంగా ఒకనాడు దేశంలో కోట్లాది ఎకరాలకు సాగునీరు అందించిన లక్షలాది చిన్ననీటి వనరుల్లో అధికశాతం ఆక్రమణలకు గురై అదృశ్యమైపోతుండడం ఆందోళన కలిగిస్తున్నది. దేశంలో స్వాతంత్ర్యం వచ్చేనాటికి ఎన్ని చెరువులు, కుంటలు లాంటి చిన్ననీటి వనరులున్నాయి? ప్రస్తుతం ఎని ఉన్నాయి? ఉన్నవాటిలో ఎన్ని సాగునీరు అందిస్తున్నాయి? పరిశీలిస్తే దాదాపు సగానికిపైగా అదృశ్యమైపోయాయని చెప్పొచ్చు. వాటి స్థానాల్లో కొన్ని ప్రాంతాల్లో కాలనీలకు కాలనీలే వెలిస్తే మరికొన్ని ప్రాంతాల్లో చిన్ననీటి వనరుల కట్టలను తెంచివేసి సాగుభూములుగా మార్చుకున్నారు. ఉన్నవాటిని కూడా కాపాడేందుకు అటు కేంద్రం, ఇటు రాష్ట్రపాలకులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. దశాబ్దాల తరబడి మరమ్మత్తులకు నోచుకోని చిన్ననీటి వనరులు వేల సంఖ్యలో ఉన్నాయని చెప్పొచ్చు. అయితే తెలంగాణకు సంబంధించి గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా పూడికలు తీయించే కార్యక్రమం చేపట్టి మరమ్మత్తులు కూడా చేయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాజధాని హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న చెరువుల స్థానంలో వెలిసిన అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు గతవారం రోజులుగా గట్టి ప్రయత్నమే చేస్తున్నది. భారత్‌లో ఒకనాడు చెరువుల సంఖ్యలోనూ వాటి కింద సాగు అవుతున్న విస్తీర్ణంలోనూ ఉమ్మడి రాష్ట్రం ఎంతో ముందు ఉండేది. ఆనాటి పాలకులు చిన్ననీటి వనరులకు ఎంతో ప్రాము ఖ్యత ఇచ్చేవారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత క్రమేపీ చిన్ననీటి వనరులపై శ్రద్ధతగ్గిపోయిందని చెప్పొచ్చు. అందులో ముఖ్యంగా ఆయా ఆయకట్టులోని రైతులను భాగస్వాములను చేయకుండా చేపట్టిన మరమ్మత్తులు కాంట్రాక్టర్లకు కల్పతరువుగా మారిపోయింది. అందుకే ఎన్నో చిన్న నీటి వనరులకు మరమ్మత్తులు చేసినట్లు రికార్డుల్లో లక్షలాది రూపాయలు వెచ్చించినట్లు రాసినా వాస్తవంగా క్షేత్రస్థాయిలో ఖర్చుపెట్టలేదు. చిన్ననీటి వనరులు అంతరించిపోతున్నాయనే విమర్శలు వెల్లుబుకడంతో దేశంలో చెరువులకు మరమ్మత్తు చేసి పునరుద్ధరణకు సంబంధించి ప్రత్యేక పథకం అమలుకు శ్రీకారం చుట్టినా పాలకులు క్షేత్రస్థాయిలో అంతగా ఉపయోగించలేకపోయారు. సాక్ష్యాత్తు కేంద్ర మంత్రిత్వశాఖే ఆనాడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఒకదశలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న సమస్యలేమిటో తెలుసుకోవాలని, చెరువులపై అధ్యయ నం చేసిన స్థాయీసంఘాన్ని ఆదేశించిందంటే అర్థం చేసుకోవచ్చు. వాస్తవంగా ఈ చిన్ననీటి వనరులపై అధ్యయనం చేసినకేంద్రం నియమించిన స్థాయీసంఘం ఆనాటి ఉమ్మడి రాష్ట్రంలో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను కేంద్రం దృష్టికి తీసుకు వెళ్లింది. ఉమ్మడిరాష్ట్రంలో డెబ్భైఐదువేల ఏడువందల అరవై ఒక్క చెరువులు, చిన్ననీటి వనరుల ద్వారా 16.4 లక్షల హెక్టార్ల సాగునీరు అందేదని ప్రస్తుతం ఎన్ని చిన్ననీటి వనరులున్నాయో వాటికింద ఏమేరకు సాగవుతుందో ప్రభుత్వం వద్ద నిర్దిష్టమైన రికార్డులు లేవనిపదేళ్ల క్రితమే స్పష్టం చేసింది. ఈ చెరువుల మరమ్మత్తుకు కేంద్రం ఇచ్చిన నిధులను కూడా అప్పటి పాలకులు ఏమాత్రం ఉపయోగించుకోలేకపోయారని స్థాయీసంఘం ఆ నివేదికలో వెల్లడించింది. ఉమ్మడి రాష్ట్రానికి ప్రపంచబ్యాంకు రుణం ఇరవైఐదు శాతం, కేంద్రం నిధులుకలిపి వెయ్యి నలభైనాలుగువేల కోట్ల రూపాయలతో మూడువేల చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని 2007-08లోప్రారంభించగా, 2014 ఆరంభం నాటికి కేవలం ఆరువేల ఎనిమిది వందల తొంభైఆరు చెరువులే మరమ్మత్తులకు నోచుకున్నాయని నివేదికలో వెల్లడించారు. అంతేకాదు వ్యవసాయవ్యర్థాలు, వ్యవసాయ రసాయనికాలు, మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలతో చాలాప్రాంతాల్లో చెరువులు నిండిపోయి నిరుప యోగంగా మారిపోతున్నాయని, భూగర్భజలాలు కూడా కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేసింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి ఇప్పటికికూడా ఎవరు అధికారంలోఉన్నాభారీ ప్రాజెక్టుల విషయంలో తీసుకున్నశ్రద్ధ పదోవంతు కూడా ఈ చిన్ననీటి వనరుల విషయంలో తీసుకోవడంలేదనే విమర్శను కొట్టివేయలేం. కొన్ని మరమ్మత్తులకు నోచుకోక వరద నీటికి పడినగండ్లు పూడ్చేవారులేక, మరికొన్ని సాగు కోసమో, లేక ఇళ్లపట్టాల కోసమో ఆక్రమణకు గురై వేలాది చిన్ననీటి వనరులు అదృశ్యమైపోయాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రపరిశీలిస్తే చిన్ననీటి వనరులకు మన పెద్దలెంత ప్రాధాన్యం ఇచ్చారోఅర్థమవుతుంది. కాకతీయులు కానీ, ఆ తర్వాత వచ్చిన విజయనగరాధీశుడు శ్రీకృష్ణదేవరాయల కాలం నుంచి సాగునీటికి ముఖ్యంగా చిన్ననీటి వనరులకు ఎంతోప్రాధాన్యత ఇచ్చారు. వాననీటిని వృధాగా పోనీయకుండా భౌగోళికపరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఒక క్రమపద్ధతిద్వారా నీటిపారుదల వ్యవస్థను ఏర్పాటు చేశారు. వాగులు, వంకలకు అడ్డుకట్టవేసి నీటిని మళ్లించి చిన్నచిన్న కుంటలు ఏర్పాటుచేయడం, అవి నిండితేఅలుగు ద్వారా మరొక కుంటలోకి నీటిని మళ్లించడం ఇలా కుంటలు, చెరువులు ఏర్పాటుచేశారు. వర్షాలవల్ల వస్తున్ననీటిని అంచనావేసి చిన్న, పెద్ద చెరువులను నిర్మించారు. రాజుల తర్వాత వచ్చిన బ్రిటిష్ కాలంలోనూ ఆయా ప్రాంతాల అవసరాలను బట్టి భూములను బట్టి వేలాది చిన్ననీటి వనరులను ఏర్పాటు చేశారు. కొత్త చిన్ననీటి వనరులను నిర్మించకపోతే పోయారు ఉన్నవాటిని కాపాడేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతిపాదనలు, ప్రణాళికలు కాగితాల్లో తయారు చేసుకుంటే సరిపోదు. ఆచరణ రూపం దాల్చాలి. నీరు లేకుండా మనిషి మనుగడే కాదు నాగరికత ఊహించడం కష్టం.

చదరంగంలో మాదిరిగానే జీవితంలో కూడా ముందుచూపు ఎంతో అవసరం.



ఐ.జాన్సన్

జీవితంలో ఏదీ వ్యసనంగా పరిణమించకూడదు. అదే జీవితానికి ప్రధాన సూత్రం.



బైరన్

## ప్రజావాక్కు



### వైద్యుల దుస్థితి

**కోల్‌కతా** నగరంలో ఆర్‌జికార్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలోవిధుల్లోఉన్న మహిళావైద్యురాలిపై అత్యాచారం చేసి, హత్య చేసిన దారుణ సంఘటన దేశాన్ని దిగ్భ్రాంతికి, తీవ్ర ఆందోళనకు గురి చేసింది. దేశంలో ఎలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో, రక్షణ కొరవడిన స్థితిలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ముఖ్యంగా మహిళలు విధుల్ని నిర్వహించాల్సి వస్తుందో ఇంకోసారి తేటతెల్లం చేసిన దుర్ఘటన. ఆపీజీ వైద్య విద్యార్థి36గంటలుగా విధుల్లో ఉన్నారు. అర్థరాత్రి దాటాక కాసేపు సెమినార్‌రూమ్‌లో విశ్రమించిన సమయంలో దారుణ సంఘటనకి బలయ్యారు. నగరం మధ్యలో ప్రభుత్వఆస్పత్రిలో తమకి బాగా పరిచయమైన స్థలంలో తమ రక్షణకి ఇంతతీవ్రమైన ప్రమాదం ఉంటుందని ఆమె కలలో కూడా అనుకుని ఉండరు. అక్కడ సిసి కెమెరాలు పనిచేయడంలేదట. ఆగంతకులు రాకుండా సరిపడా భద్రత, సరైన వెలుతురు లేనిక్యాంపస్. ఇవన్నీ ఆ కిరాతక చర్యకు దోహదపడ్డాయి. ఇది వ్యవస్థాగత లోపం.

-డా.డి.వి.జి.శంకరరావు, విజయనగరం

### డ్రైనేజీ సమస్యలను తీర్చండి

**తెలంగాణ** రాజధానికి మరిన్నిహంగులంటూ ప్రభుత్వం సేకరిస్తామంటున్న వివరాలుతమవద్ద ఉన్నవే. ఇంటిపన్ను, కరెంట్, నీటి బిల్లులు మొదలైన ఆన్‌లైన్‌లో చెల్లించిన సమాచారం ప్రింట్‌వుట్లు తీసి పెట్టుకోవడం ఓపని. అదనంగా డిఫాల్టులుప్రభుత్వానికి తెలియందికాదు. మేకను మేపేది బలికేనని జనానికి తెలుసు. రోడ్లపైకి వస్తున్న డ్రైనేజీ చిన్న వానకు మునకలేస్తున్నా రోడ్లను సరిచేయడం సవాలుగా తీసుకుంటే ఏలిన వారిని తలుచుకుంటారు జనం.

-వి.ఆర్.ఆర్.ఎ.రాజు, హైదరాబాద్

### నిరాశ పరిచిన తీర్పు

**ఎంతో** శ్రమకోర్చి ఒలింపిక్స్‌లో బంగారు పతక అర్హత చేజార్చుకున్న భారత్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ కేవలం వంద గ్రాముల బరువే ఆమెపై అనర్హత వేటు వేసింది. అప్పటికి చాలా కష్టపడి ఎన్నో ప్రయాసలు, ప్రయత్నాలు చేసి బరువుతగ్గినా ఆ వందగ్రాముల బరువే భారమైంది. ఆమె దీనిపై కౌన్సిల్‌లో అప్పీల్‌చేసింది. తీర్పుని వాయిదాలు వేసి ఆమెతోపాటు భారత దేశ ఆశలని ఆశ నిరాశపరిచారు. ఆమెని వెన్నుతట్టి మరో విజయానికి ప్రోత్సహించాలి.

-శ్రిష్టి శేషగిరి, సికింద్రాబాద్

### హామీలను నెరవేర్చాలి

**ఏపిలో** మూడు పార్టీలకూటమి అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఆ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి నెల దాటిపోయినా వారిచ్చిన హామీఅమలుకు నోచుకోలేదు. అధ్యయనం అంటు కాలయాపన చేస్తూ వచ్చారు. మరికొన్ని పథకాల విషయంలోను వారి తీరు ఇలానేఉంది. మాట మార్చేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే తెలంగాణలో అధికారంలోకి వచ్చిన రెండోరోజు నుంచే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆ వెంటనే యువతకు ఉద్యోగ అవకాశాలు. ఆసరా పథకం ద్వారా డబ్బులు అందిస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం. ఈ మధ్యనే రైతు రుణమాఫీ పథకాన్ని అమలులోకి తెచ్చారు. కొందరి రైతుల రుణాలను మాఫీ చేశారు. దశలవారీగా రైతులందరి రుణాలు మాఫీ చేసి తీరు తామని అంటున్నారు. అయితే బిజెపి నాయకులు ప్రతి రోజూ విమర్శలు చేస్తున్నారు.

-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

### బాధ్యతను విస్మరిస్తున్న నాయకులు

**తమ పార్టీ** ఎన్నికల్లో ఓడి అధికార పక్షం నుంచి ప్రతిపక్షంలోకి రావటాన్ని బిఆర్ఎస్ నాయకులు భరించలేకపోతున్నారు. ప్రతిపక్ష స్థానంలో కూర్చోవటం అంటే ముళ్లపై కూర్చోవడంలా భావిస్తూ బాధపడుతున్నారు. ప్రభుత్వానికి సహకరించడం పోయి వారు చేస్తున్న ప్రతిఒక్క పనిని విమర్శిస్తున్నారు. అడ్డు తగులుతున్నారు. మరో ప్రతిపక్ష పార్టీ అయిన బిజెపి కూడా ఇలానే ఉంది. రాష్ట్రాన్ని అభివృద్ధిపరచడంలో భాగస్వాములు కావలసిన బిఆర్ఎస్, బిజెపి నాయకులు తమ బాధ్యతను విస్మరించి ప్రవర్తిస్తున్నారు. ఇది సమంజసం కాదు. ప్రతిపక్ష స్థానంలో కూర్చోవటం ఎంతటి వారికయినా తప్పదని ఈ పార్టీల నాయకులు గ్రహించాలి.

-మిథునం, హైదరాబాద్

### పన్నుల మోత

**గత** కొంతకాలంగా కేంద్రప్రభుత్వం వారుదాదాపు ప్రతి వస్తువుపై పన్నులమోత మోగిస్తుండటంతో సామాన్య ప్రజలు బేజారెత్తిపోతున్నారు. ముఖ్యంగా ప్యాక్ చేయని వస్తువులను మినహాయిస్తే ప్యాకింగ్ అయిన ప్రతి వస్తువుపై కేంద్రప్రభుత్వం ఎడాపెడా జిఎస్టీ విధిస్తూ సామాన్య ప్రజల అరకొర ఆదాయంపై చాలా తీవ్రస్థాయిలో కొరడా ఝుళిపిస్తుండటంతో వారు దిక్కుతోచని పరిస్థితులలోకి నెట్టివేయబడుతున్నారు.

-బి. మధుసూదనరెడ్డి, నంద్యాలజిల్లా

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail: editpage@vaartha.com

# తెలంగాణ ఐజిఎస్టీలో భారీ మోసం!

**ఐఐటీ హైదరాబాద్ తయారు చేసిన అప్లికేషన్ సర్వర్‌లోని వివరాలు స్పెషల్ ఇనీషియేటివ్స్ వాట్సాప్ గ్రూపులోకి వెళ్లాయని తేలింది. వాణిజ్య పన్నుల శాఖలో చాలా అక్రమాలు జరిగినట్లుగా అల్గారిథమ్ గుర్తించిన విషయం ప్రొఫెసర్ శోభన్‌బాబుకు తెలుసు. ఆ డేటాను ట్రాన్స్‌ఫర్ చేయాలని వాణిజ్య పన్నులశాఖ ఎన్నిసార్లు అడిగినా చేయలేదు. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ఫిబ్రవరి 8న మెయిల్లో స్పందిస్తూ, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన ఆదేశాలనే వాణిజ్య పన్నుల శాఖాధికారులు అనుసరిస్తున్నట్లు చెప్పారు. ఈ పరిణామాలన్నీ నిశితంగా పరిశీలిస్తే సోమేశ్‌కుమార్‌కి కృష్ణ జన్మభూమికి వెళ్లక తప్పదని తెలుస్తుంది.**



మన్నారం నాగరాజు

తెలంగాణలో ఐజిఎస్టీ (ఇంటిగ్రేటెడ్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్) ఎగవేత ద్వారా రూ. వెయ్యి కోట్ల మోసం జరిగినట్లు తెలంగాణ కమర్షియల్ ట్యాక్స్ విభాగం తెలిపింది. ఈ వ్యవహారంపై నమోదైన కేసులో తెలంగాణ ప్రభుత్వ మాజీప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ పేరును ఏ5గా పోలీసులు చేర్చారు. ఇదే కేసులో ఏ1గా తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ ఎస్వీ కాశీ విశ్వేశ్వరరావు, ఏ2గా ఉపకమిషనర్ ఎ.శివరామ్ ప్రసాద్, ఎ3గా హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ శోభన్‌బాబు, ఏ4గా ప్లియంటో టెక్నాలజీస్ కంపెనీలు ఉన్నాయి. ఈ కుంభకోణంపై వాణిజ్య పన్నుల శాఖ సెంట్రల్ కంప్యూటర్ వింగ్ జాయింట్ కమిషనర్ రవి కానూరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీపిఎస్ (సెంట్రల్ క్రైం స్టేషన్) పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన ట్యాక్స్‌లను సొంత జేబులోకి తీసుకోవడం మహాపాపం. అటువంటి పాపానికి పాల్పడటం, వారిని శిక్షించడం అనివార్యమని చెప్పకతప్పదు. వ్యాపారుల నుంచి వాణిజ్య పన్నుల శాఖ గూడ్స్ అండ్ సర్వీస్‌ట్యాక్స్‌లో భాగంగా సిజిఎస్టీ, ఎస్జీఎస్టీ, ఐజిఎస్టీ, సెస్ వసూలు చేస్తూ ఉంటుంది. బిగ్ లీఫ్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ మానవ వనరులను సరఫరా చేస్తుంటుంది. ఈసంస్థ పన్ను చెల్లించకుండానే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకుందనేది ఆరోపణ. 2023 డిసెంబరులో ఆ కంపెనీ పన్నుల చెల్లింపుపై చేసిన ఆడిట్‌లో రూ.22.51 కోట్లు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకున్నట్లు తేలింది. ప్రభుత్వానికి ఎలాంటి పన్నులూ చెల్లించకుండానే ఈ మొత్తాన్ని క్లెయిమ్ చేసుకున్నట్లు వాణిజ్య పన్నుల శాఖాధికారులు తేల్చారు. దీని మీద విచారణ ప్రారంభించిన వాణిజ్య పన్నుల విభాగం, మరికొన్ని కంపెనీలు కూడా ఈ తరహాలోనే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొంది భారీ కుంభకోణానికి పాల్పడినట్లు గుర్తించారు. కొందరు వ్యాపారులు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను వివిధ రకాలుగా క్లెయిమ్ చేసుకుని మోసానికి పాల్పడ్డారనివాణిజ్య పన్నుల శాఖ, సెంట్రల్ కంప్యూటర్ వింగ్ జాయింట్ కమిషనర్ రవి కానూరి మీడియాతో తెలిపారు. వ్యాపారులు ఏదైనా వస్తువు కొన్నప్పుడు తమ పెట్టుబడిపై కొంత పన్ను కడుతుంటారు. ఆ వస్తువును ప్రాసెస్‌చేసి మరొక రాష్ట్రానికి విక్రయించినప్పుడు మళ్లీ అమ్మకం పన్ను చెల్లిస్తారు. దీంతో కొనుగోలు పన్నును ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌గా తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీన్ని అవకాశంగా తీసుకొన్ని కొందరు వ్యాపారులు వస్తువుల కొనుగోలు, అమ్మకాలను కేవలం కాగితాలపైనే చూపించి ఇన్‌పుట్ క్రెడిట్‌ను పొందినట్టు తేలిందన్నది తెలిసిందే. ఇలా మొత్తం 11 కేసులకు సంబంధించి రూ. 400 కోట్ల కుంభకోణం జరిగినట్టు గుర్తించినట్లు సిసిఎస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ద్వారా బహిర్గతం అయింది. ఇందులో తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ తెలంగాణ రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ కూడా ఉంది. ఈ సంస్థ కూడా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ విషయంలో అవకతవకలకు పాల్పడిందని అధికారులు వెల్లడించారు. మరింత లోతుగా విచారణ చేయగా దాదాపు రూ.1000 కోట్ల కుంభకోణం జరిగినట్టు తేలిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. బోగస్ క్లెయిమ్‌లకు పాల్పడకుండా





ఐఐటీ హైదరాబాద్ సహకారంతో ఓ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను వాణిజ్య పన్నుల శాఖ సమకూర్చుకుంది. తెలంగాణలో వ్యాపారుల ట్యాక్స్ రిటర్న్‌లో ఏమైనా తేడాలుంటే ఈ సాఫ్ట్‌వేర్ పసిగడుతుంది. ఈ సాఫ్ట్‌వేర్‌ను నిర్వహించే ఐఐటీ హైదరాబాద్ వెంటనే ఆ సమాచారాన్ని వాణిజ్యపన్నుల శాఖకు అందిస్తుంది. అయితే బిగ్ లీఫ్ టెక్నాలజీస్ కంపెనీకి సంబంధించి ఆడిట్‌లో ఇన్‌పుట్ ట్యాక్స్ అదనంగా తీసుకున్నట్టు తేలినా, ఈప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లోని 'స్క్రూటినీ మాడ్యూల్' రికార్డు చేయలేదు. వాణిజ్య పన్నుల శాఖకు చెందిన అధికారి 2023డిసెంబర్ 26న ఐఐటీలో విచారణ చేశారు. సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పరంగా చేస్తున్న మోసాలు బయటకు రానివ్వకుండా చేసినట్లు విచారణలో తేలింది. సాఫ్ట్‌వేర్‌లో మార్పులకు అప్పటి వాణిజ్య పన్నుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా కూడా ఉన్న సోమేశ్ కుమార్‌తోపాటు అదనపు కమిషనర్ ఎస్వీ కాశీ విశ్వేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ శివరామ్ ప్రసాద్ నుంచి వచ్చిన సూచనలే కారణమని, ఆమేరకు స్క్రూటినీ రిపోర్ట్స్‌లో ఐజిఎస్టీలో అవకతవకలు రికార్డు కాకుండా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసినట్టు తేలింది అని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రవి కానూరి ఈ వ్యవహారంపై 2024 జనవరి 8న కాశీవిశ్వేశ్వరరావు, శివరామ్ ప్రసాద్‌కువాణిజ్య పన్నుల శాఖ మెమోజారీ చేసింది. ఈ మెమోకు వారిద్దరూ సమాధానం ఇచ్చారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ సోమేశ్ కుమార్ నుంచి వచ్చిన ఆదేశాలను అనుసరించామని, ఐజిఎస్టీ, సీజీఎస్టీ, ఎస్జీఎస్టీ, సెస్‌లోటుపాట్లు కప్పిపుచ్చేలా ఒక ఫార్మాట్ ఇచ్చామని వాళ్లుతెలిపారు. ఈవ్యవహారంపై ఆడిట్ విభాగంతోపాటు సీడ్యాక్ (సెంటర్ ఫర్‌డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్సుడ్ కంప్యూటింగ్)తో పూర్తిస్థాయి ఆడిట్ చేయించింది వాణిజ్య పన్నులశాఖ. జనవరి 30న ఆడిట్ వివరాల మీద చర్చించేందుకు సీడ్యాక్, ఐఐటీ హైదరాబాద్, వాణిజ్య పన్నుల శాఖాధికారులు సమావేశమయ్యారు. సోమేశ్ కుమార్, కాశీ విశ్వేశ్వరరావు, శివరామ్‌ప్రసాద్, ఐఐటీ హైదరాబాద్ ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్‌గా ఉన్న శోభన్‌బాబుతో స్పెషల్ ఇనీషియేటివ్స్ పేరిట వాట్సాప్ గ్రూపు ఏర్పాటైంది. గ్రూపులో వచ్చే ఆదేశాలను శోభన్‌బాబు పాటించేవారు. ఈవ్యవహారంపై వాణిజ్య పన్నులశాఖ ఇచ్చిన నోటీసుకు కాశీవిశ్వేశ్వరరావు సమాధానం ఇచ్చారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ పర్యవేక్షణలో వాట్సాప్ గ్రూప్ పనిచేసిందని, 2022 డిసెంబర్ నుంచి గ్రూప్ యాక్టివ్‌గా లేదు. ఫొటోలు, ఇతర వివరాల్లేకుండా వాట్సాప్ చాట్ హిస్టరీని ఇచ్చారు. దీంతో అన్నివివరాలు ఇవ్వాలని వాణిజ్య పన్నుల శాఖ మరో మెమోఇచ్చింది. వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులు చేసిన విచారణలో మాత్రం 2024 ఫిబ్రవరిలోనూ వాట్సాప్ గ్రూపులో చాట్ నడిచినట్లు చెప్పారు. వాట్సాప్ చాట్ హిస్టరీని పరిశీలించినప్పుడు ఐజిఎస్టీ నష్టం గురించి రిపోర్టులు ఉన్నట్లు వాణిజ్య పన్నులశాఖ గుర్తించింది. అక్రమ కేసులు గుర్తించినా రిజిస్ట్రేషన్లు రద్దు చేయవద్దని ఆదేశాలు ఉన్నట్టు తేలింది. దీని ఆధారంగా కాశీ విశ్వేశ్వరరావు, శివరామ్ ప్రసాద్‌ల మొబైల్ ఫోన్లను జిఎస్టీ అదనపు కమిషనర్ ఎన్.సాయికిశోర్ సీజ్ చేశారు. దీనిపై వారిద్దరూ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, వారి పిటిషన్ తిరస్కరణకు గురైంది. సీడ్యాక్ ఇచ్చిన నివేదిక ప్రకారం 75 మంది పన్ను చెల్లింపుదారుల వివరాలను ఉద్దేశపూర్వకంగానే కప్పిపుచ్చారు. కొందరు అధికారుల, ఉద్యోగుల ఐడీలను కూడా కనిపించకుండా చేశారు. ఐఐటీ హైదరాబాద్, వాణిజ్య పన్నుల శాఖ డాటా బేస్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపురం నుంచి థర్డ్‌పార్టీ నిర్వహించినట్లు తేలింది. దీనికి ఐపి 103.168.83.131గా ఉంది. పాస్‌వర్డ్ ప్లియాంటోగాఉన్నట్లు తేలింది. ఐఐటీ హైదరాబాద్ తయారు చేసిన అప్లికేషన్ సర్వర్‌లోని వివరాలు స్పెషల్ ఇనీషియేటివ్స్ వాట్సాప్ గ్రూపులోకి వెళ్లాయని తేలింది. వాణిజ్య పన్నుల శాఖలో చాలా అక్రమాలు జరిగినట్లుగా అల్గారిథమ్ గుర్తించిన విషయం ప్రొఫెసర్ శోభన్‌బాబుకు తెలుసు. ఆ డేటాను ట్రాన్స్‌ఫర్ చేయాలని వాణిజ్య పన్నులశాఖ ఎన్నిసార్లు అడిగినా చేయలేదు. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ఫిబ్రవరి 8న మెయిల్లో స్పందిస్తూ, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శిఇచ్చిన ఆదేశాలనే వాణిజ్య పన్నుల శాఖాధికారులు అనుసరిస్తున్నట్లు చెప్పారు. మొత్తం ఈ వ్యవహారాన్ని మరింత లోతుగా దర్యాప్తు జరిపితే విస్తుపోయే విషయాలు వెలుగుచూస్తాయి. •

# భవిష్యత్తు నిర్ణయాలతో భవితకు భరోసా!

మోటె చిరంజీవి

పాఠశాలల సమూహం నాణ్యమైన విద్యను విశ్వసిస్తుంది. నాణ్యమైన విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ఒక రకమైన విద్యగా పరిగణించబడుతుంది. శారీరక, మానసిక, మేధోపరమైన కోణంలో అభ్యాసకుడికి సర్వతోముఖాభివృద్ధిని కలిగించే విద్యఇది. ఆరోగ్యకరమైన శరీరంలో ఆరోగ్యకరమైన మనస్సు పడునుగా, మరింత గ్రహణశక్తిని కలిగి ఉంటుంది. కాబట్టి సమూహం విద్యార్థుల మానసిక కోణాన్ని సుసంపన్నం చేయడానికి అనేక కార్యకలాపాలను నిర్వహించడంజరుగుతుంది. నాణ్యమైన విద్య అందని ద్రాక్షగా మారింది. పాఠశాల విద్యపై ప్రభుత్వాల పట్టింపు లేనితనంతో రానురాను విద్యాప్రమాణాలు క్షీణిస్తున్నాయని ఇటీవల కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన పనితీరు గ్రేడింగ్ సూచికల నివేదిక తేటతెల్లం చేస్తున్నది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు బాగా పడిపోయాయి. సర్కారుబడుల్లో విద్యార్థులు నమోదు అంతకంతకూ తగ్గుతున్నది. జాతి భవిత తరగతి గదిలో రూపుదిద్దుకుంటుంది. కాబట్టి నాణ్యమైన విద్య అందరికీ అందినప్పుడే మానవ వనరులు అభివృద్ధి చెందుతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై అధికంగా నిధులు వెచ్చించాల్సిన అవసరం ఉంది. విద్య లేకుండా సామాజిక, ఆరోగ్య, ఆర్థిక, రాజకీయ ప్రగతిసాధ్యం కాదు. కాబట్టి ప్రపంచ భవిష్యత్తుకు విద్యపై పెట్టుబడి చాలా అవసరం. చాలా సంవత్సరాలకుపైగా యాక్షన్ ఎడ్యుకేషన్ అనేది అందరికీ నాణ్యమైన విద్యను అందించడానికి, ప్రధానంగా బలహీన అట్టడుగు జనాభాకు ప్రాప్తిని ప్రోత్సహించడానికి భూమిపై పనిచేస్తుంది. కార్పొరేట్‌కు దీటుగాప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంతో పేద విద్యార్థులు ఉన్నతమైన స్థానాలు అధిరోహిస్తున్నారని విద్యా అంటున్నారు. నాణ్యమైన విద్య పేదరికాన్ని తగ్గిస్తుంది. పర్యావరణాన్ని కాపాడుతుంది. విద్యతో ఎటువంటి వ్యాధులు దరి చేరకుండా చూసుకోవచ్చు. ఒకవేళ ఏవైనా వ్యాధులు వచ్చినా అతి త్వరగా బాగు చేసుకునేందుకు వీలుంటుంది. తక్కువ ఆదాయ వనరులు గత దేశాల్లోని పిల్లలందరూ చదవగలిగేలా పాఠశాలలకు పంపిస్తే ప్రపంచ



పేదరికం 12శాతం తగ్గుతుంది. పేదలందరూ సెకండరీ విద్యను పూర్తిచేస్తే నాలుగు వందల మిలియన్లకుపైగా ప్రజలు పేదరికం నుండి బయటపడవచ్చు. ప్రపంచవ్యాప్తంగా మొత్తం పేదల సంఖ్యను సగానికి పైగా తగ్గించవచ్చు. ఒక అదనపు సంవత్సరం పాఠశాల పురుషుల ఆదాయాన్ని కనీసం పదిశాతం, మహిళల ఆదాయాన్ని కనీసం 20 శాతం పెంచవచ్చు. భారతదేశంలోని ప్రతి అమ్మాయి, అబ్బాయికి నాణ్యమైన విద్యను పొందే ప్రాథమిక హక్కు ఉంది. ఇది ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానాన్ని పొందేందుకు, నిర్భయంగా నేర్చుకోవడాన్ని ఆస్వాదించడానికి, వారుఎక్కడినుంచి వచ్చినా వారితో సంబంధం లేకుండా విలువైనదిగా సహాయపడేదే విద్య. పాఠశాలలో విజయవంతమైన పనితీరు సంప్రదాయ అక్షరాస్యత, సంఖ్యానైపుణ్యాలకు అతీతంగా విస్తృత శ్రేణి సామర్థ్యాలు, వైఖరులు, సామాజిక భావోద్వేగ సామర్థ్యాల ద్వారా మద్దతునిస్తుంది. జీవిత నైపుణ్యాలు నేర్చుకోవడానికి గణనీయంగా దోహదం చేస్తాయి. విద్యాశాఖలో సమూల మార్పులు జరగాలి. విలువలతో కూడిన నాణ్యమైన విద్యఅందించేలా ప్రభుత్వాలు చర్యలుతీసుకోవాలి. ముఖ్యంగా మారుతున్న కాలానికి అనుగుణంగా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సిలబస్‌లో మార్పులు చేయాలి. ఇందుకోసం విద్యారంగ నిపుణులు, మేధావులు, ఆయా రంగాల ప్రముఖులతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ప్రభుత్వాలపైన ఉంది. విద్య ప్రతిఒక్కరి హక్కు. బడి ఈడు పిల్లలు బయట ఉండడానికి వీలు లేకుండా ఈ విషయంలో కఠినంగాఉండాలి. శిథిలావస్థలో ఉన్న భవనాలు, వాటిని పునరుద్ధరించేలా ప్రణాళికలు, నిధులు ఏర్పాటు, పిల్లలకు సురక్షిత తాగునీరు సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా మరుగుదొడ్లు ఏర్పాటు, బాలికలకు ప్రత్యేకంగా మరుగుదొడ్ల ఏర్పాటు, ఆటలకు అనుకూలంగా క్రీడారంగాన్ని ప్రోత్సహించాలి. ప్రైవేట్ విద్యాసంస్థలతో ప్రభుత్వ స్కూళ్లు పోటీపడేలా, ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోని బోధన చేయాలి. విద్యార్థుల హాజరు 100శాతంఉండేలా, డిగ్రీవరకు ఇది కొనసాగేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులది, అధ్యాపకులది. ప్రైవేట్ స్కూళ్ల తరహాలో ప్రభుత్వపాఠశాలల్లోకూడా తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి పిల్లల చదువు ఏ విధంగా ఉందో వారికి తెలియచేయాలి. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు యేటా ప్రతిభాఅవార్డులు అందించి ప్రోత్సహించాలి. అప్పుడే చదివే పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుంది. •

# మౌలిక సదుపాయాల కల్పనతోనే రాష్ట్రాభివృద్ధి

డా.చిట్యాల రవీందర్

రోడ్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, వాష్‌రూమ్స్‌పరంగా అభివృద్ధి దిశగా సాగాలి మనదేశం. భారతదేశం ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఒకటిగా నిలుస్తోంది. కానీ ఇంకా మౌలిక సదుపాయాలలో కొన్ని లోటుపాట్లు సరిచేసుకోవాల్సినవి ఉన్నాయి. ముఖ్యంగా రోడ్లు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, ప్రజలకు సరైన వాష్‌రూమ్స్ అందుబాటులో ఉండాలి. ఈ అంశాలు అభివృద్ధి చెందే దేశం నుండి అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి చాలా ముఖ్యం. రోడ్ల నాణ్యత, సదుపాయాలు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు నగరాల్లో ప్రజల రవాణాకు ముఖ్యమైనవి. అభివృద్ధి చెందిన దేశాలో, ముఖ్యంగా అమెరికాలో ప్రతి పౌరుడికి ఒక సురక్షితమైన, సులభమైన ప్రయాణ మార్గం ఉంది. అక్కడి రోడ్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు అత్యధిక నాణ్యతతో నిర్మించబడినవి. రవాణా సమస్యలు లేకుండా ప్రజలు సులభంగా గమ్యస్థానానికి చేరుకోగలరు. భారతదేశంలో ఈ అంశాలు ఇంకా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. పేద ప్రాంతాలు, నగరాల కనీస సదుపాయాలు లేనివారి పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి. ముఖ్యంగా ప్రధాన నగరాలు, మహానగరాలు నుండి ప్రారంభించి ఈ సదుపాయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. వాష్‌రూమ్స్ పరిస్థితి చూస్తే అమెరికా, భారతదేశం మధ్య చాలా తేడాలున్నాయి. అమెరికాలో ప్రతి వెయ్యి మందికి సుమారు 20-25 పబ్లిక్ వాష్‌రూమ్స్ అందుబాటులో ఉంటాయి. ఇవి ప్రధానంగా పబ్లిక్ పార్కులు, మాల్‌లు, ట్రాన్స్‌పోర్టు హబ్‌ల వంటి చోట్ల కేంద్రీకృతం చేయబడ్డాయి. ఇదే సమయంలో భారతదేశంలో ఈ సంఖ్య చాలా తక్కువగా ఉంది. పబ్లిక్ వాష్‌రూమ్స్ అందుబాటులో ఉండటం చాలా పెద్ద సమస్యగా ఉంది. భారతదేశంలో ప్రతి వెయ్యి మందికి సగటున 3-5 పబ్లిక్ వాష్‌రూమ్స్ మాత్రమే ఉన్నాయి. చాలా ప్రాంతాల్లో ఈ వాష్‌రూమ్స్ సరిగ్గా నిర్వహించబడటం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సులభ్ కాంప్లెక్స్‌ల నిర్వహణ కొంత వరకు పర్వాలేదు. 2022లో గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 95.4 శాతం కుటుంబాలకు ఇంటి వద్ద టాయిలెట్ సదుపాయం



ఉందని చెప్పబడింది. కానీ వాస్తవంలో ఇది వివిధ రాష్ట్రాల్లో విస్తృతంగా మారుతుంది. కొన్ని రాష్ట్రాల్లో ర్యాపిడ్ అసెస్మెంట్ చేసినప్పుడు అంచనా గణాంకాలతో పోల్చితే చాలా తక్కువ సదుపాయాలు ఉండటం బయటపడింది. భారతదేశం అభివృద్ధి చెందాలంటే, మౌలిక సదుపాయాల పరంగా రోడ్లు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, వాష్‌రూమ్స్ వంటి అంశాలు ప్రాధాన్యంగా తీసుకుని అభివృద్ధి జరగాలి. అభివృద్ధి చెందడానికి కావాల్సిన క్రమంలో ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని పథకాలు రూపొందించాలి. ఇంకా అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చి చూస్తే భారతదేశం ఇంకా ఈ దిశలో సాగాల్సిన మార్గం చాలా ఉంది. భారత ప్రభుత్వం స్వచ్ఛభారత్ మిషన్ వంటి పథకాల ద్వారా శుభ్రత, సులభత పెంచే చర్యలు తీసుకుంటోంది. కానీ వాటిని సురక్షితంగా కొనసాగించడం, ప్రతిపౌరుడికి సౌకర్యాలు అందించడం చాలా ముఖ్యం. ఈ ప్రణాళికలు త్వరితగతిన అమలు చేయబడితే, భారతదేశం అభివృద్ధి దిశలో ముందడుగు వేయగలదు. తెలంగాణలో మౌలిక సదుపాయాలు రోడ్లు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, వాష్‌రూమ్స్, జనాభాపరంగా గమనిస్తే తెలంగాణ రాష్ట్రం గత కొన్ని సంవత్సరాలుగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. కానీ ఇంకా మౌలిక సదుపాయాలపరంగా కొన్ని సమస్యలు ఉద్భవిస్తున్నాయి. ముఖ్యంగా రోడ్లు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, పబ్లిక్ వాష్‌రూమ్స్ విషయంలో ప్రధాన నగరాలు, పట్టణాల్లో ప్రజలకు సమర్థవంతమైన రవాణా, హైజీన్ సౌకర్యాలు అందించేందుకు అవసరవుతున్నాయి. రోడ్లు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు తెలంగాణలో కొద్దిగా మెరుగుపడినప్పటికీ ఇంకా చాలాచోట్ల ఈ అంశంలో అభివృద్ధి జరగాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్ వంటి మహానగరాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉంటాయి. తెలంగాణ ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాల్లో రోడ్ల విస్తరణ, కొత్త ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు నిర్మాణం వంటి కార్యక్రమాలను చేపట్టింది. అయినప్పటికీ వీటి సమర్థవంతమైన నిర్వహణ కోసం ఇంకా ఎక్కువ నిధులు, ప్రణాళిక అవసరం. 2023గణాంకాల ప్రకారం రాష్ట్రంలో మొత్తం రోడ్ల పొడవు సుమారు 2,20,000కిమీ కాగా హైదరాబాద్‌లోని ప్రధాన రహదారులు అనేక చోట్ల ట్రాఫిక్ కాంప్లెక్స్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలు కలిసి పనిచేసి, ప్రతి పౌరుడికి సౌకర్యాలు అందించాల్సిన బాధ్యత తీసుకోవాలి. దీంతో రాష్ట్రం కూడా వేగంగా అభివృద్ధి చెందుతుంది. •



గురువారం శ్రీనగర్‌లోని లాల్‌చౌక్ వద్ద స్వాతంత్ర్య సంబరాల్లో ఓ యువకుడు


ఎర్రకోటవద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ


ఎర్రకోటవద్ద జరిగిన స్వాతంత్ర్య సంబరాల్లో భద్రతా దళాల ప్రదర్శన

# కోల్‌కతా ఆర్జీకార్ ఆసుపత్రిలో విధ్వంసం

## ఘటనల్లో తొమ్మిదిమంది అరెస్టు

## ట్రైనీ వైద్యురాలి హత్యాచారం కేసు

## లాఠీ-ఛార్జీలో 15 మందికి గాయాలు



**కోల్‌కత్తా, ఆగస్టు 15:** ఆర్జీకార్ ఆసుపత్రి వైద్యకళాశాలలో గురువారం ఉదయనే నిరసన ప్రదర్శనలకు దిగిన చోట అల్లర్లు జరిగి విధ్వంసానికి పాల్పడటంతో పోలీసులు తొమ్మిది మందిని అరెస్టుచేసారు. ట్రైనీ వైద్యురాలు దారుణ హత్యాకాండపై జరుగుతున్న దర్యాప్తుకు సంబంధించి కోల్‌కత్తా, దేశంలోని అనేకప్రాంతాల్లో నిరసనలు వెల్లువెత్తాయి. బుధవారం రాత్రి 11 గంటల నుంచి ప్రారంభం అయిన ఈప్రదర్శనలు రాను రాను ఘర్షణలతో మునిగిపోయాయి. కొందరు వ్యక్తులు ఆసుపత్రిలోకి ప్రవేశించి దాడులకు దిగారు. వాహనాలపై దాడికి దిగారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించారు. దీనితో రంగంలోకి దిగిన పోలీసులు లాఠీ ఛార్జిచేసి భాష్పవాయు గోళాలు వదిలారు. కోల్‌కత్తా పోలీసుల్లో 15 మందికూడా గాయాలయ్యాయి. గురువారం ఉదయం పోలీసులు కొందరి ఫోటోలు విడుదల చేసి వారి సమాచారం ఇవ్వాలని వీరంతా ఆసుపత్రుల్లో విధ్వంసానికి కారకులని సోషల్ మీడియాలో కూడా షేర్‌చేసారు. అందులోనూ అనుమానితుల ముఖాలను ఎర్రటి గీతతో వలయం చుట్టిమరీ వదిలారు. ఆతర్వాత వీరిని అరెస్టులు చేస్తున్నట్లు కూడా ప్రకటించారు. అయితే తొమ్మిది మంది వివరాలను మాత్రమే పోలీసులు విడుదలచేయలేదు. డాక్టర్ అనుభవ్ మొండల్ తనను కూడా పోలీసులు ఫోటోతీసి ప్రచారంచేసారని వాపోయాడు. ఆర్జీకార్ వైద్య కళాశాల ఆసుపత్రిలో జరిగిననిరసనల్లో తాను కూడా పాల్గొన్నట్లు తెలిపాడు.

మా నిరసనలు కొనసాగుతూ మరింత ఉధృతం అయ్యాయని, ఎవరు మాలో భయాలు కలిగించాలని చూసినా వారేమి చేయలేరని ఎట్టి పరిస్థితుల్లోను మాకు న్యాయం జరగాల్సిందేనని అన్నారు. నిష్పాక్షిక విచారణ కోర్టు పర్యవేక్షణలో ఈ ప్రక్రియజరగాలని, ఒక జస్టిస్ ఆధ్వర్యంలో సాగించాలనిమోండల్ తెలిపారు. ఆందోళన చెందాల్సినపనిలేదని, అభూతకల్పనలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎలాంటి హాని జరగలేదని పోలీసులుహెచ్చరించారు. నేరం జరిగినప్రాంతం సెమినార్ గది అని ఎవ్వరూ టచ్‌చేసేందుకు వీలులేదని, ఎలాంటి పుకార్లనుప్రచారంచేయవద్దని, న్యాయపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. బెంగాల్ గవర్నర్ సివి ఆనందబోస్ కూడా గురువారం ఆసుపత్రిని సందర్శించి వైద్యులకు పూర్తి భరోసా ఇచ్చారు. వైద్యులకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. వైద్యులు తాము భయాందోళనల్లో ఉన్నట్లు భావిస్తున్నారని, వారి ఆందోళనలకు అర్థం ఉందని గవర్నర్ అన్నారు నేను మీతో ఉన్నాను. మనం కలిసి పోరాడదాం. ఎలాంటి విధ్వంసక చర్యలు వద్దు. సానుకూల దృక్పథంతో ముందుకువెళతామని గవర్నర్ వైద్యులకు సూచించారు.

ఇదిలా ఉంటే దర్యాప్తుచేపట్టిన సిబిఐ అధికారుల బృందం మృతిచెందిన వైద్యురాలి కుటుంబ సభ్యులను కలిసింది. ట్రైనీ డాక్టర్ మృతదేహం గత శుక్రవారం గుర్తించామని, శవపరీక్షలో ఆమె మృతి తెల్లవారుఝామున మూడునుంచి ఐదు గంటలమధ్యలో జరిగిందని భావిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఆమె శరీరంపై అనేక గాయాలున్నాయని, మరణానికి ముందు ఆమెను అనేకరకాలుగా హింసించినట్లు తెలుస్తోందన్నారు. సంజయ్‌రాయ్ అనే సివిక్ వలంటీర్‌ను అరెస్టుచేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆతడు మా కస్టడీలోనే ఉన్నట్లు సిబిఐ అధికారులు ఆకుటుంబానికి తెలిపారు. అలాగే ట్రైనీ డాక్టర్ తల్లితండ్రులు తమ కుమార్తె మృతదేహంలో 150 మిల్లీగ్రాముల సెమెన్ లభించిందని దీన్నిబట్టిచూస్తే ఆమె సామూహిక అత్యాచారానికి గురయినట్లు తెలుస్తోందన్నారు.

ఇప్పటివరకూ ఇతర నిందితులెవ్వరినీ అరెస్టు చేయలేదని హైకోర్టుకు కూడా స్పష్టంచేయడం వల్లనే సిబిఐ దర్యాప్తునకు ఆదేశించారని వారు అధికారులకు తెలిపారు. తమ కుమార్తె మరణంలో కేవలం ఒక్కరి ప్రమేయం మాత్రమే కాదని, సామూహికంగానే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు అనుమానం ఉందని వారు హైకోర్టుకు, సిబిఐకి కూడా తెలిపారు.




## 14000 మంది చిన్నారులతో

# జాతీయ గీతాలాపన

## గిన్నిస్ కెక్కిన గ్రామీ విజేత !

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** గ్రామ అవార్డు విజేత రిక్కీ కేజ్ నిర్వహించిన జాతీయ గీతాలాపన గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లో చోటు దక్కించుకుంది. తన గానంతో ప్రపంచ వ్యాప్తంగా పేరు పొందిన భారతీయ సంగీత దర్శకుడు, గ్రామీ విజేత రిక్కీ కేజ్ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అద్భుతమైన వీడియోను రూపొందించారు. ప్రముఖ సంగీతకారుల సహకారంతో మన జాతీయగీతాన్ని వైవిధ్యభరితంగా ఆలపించారు. బ్రిటష్ ఆర్కెస్ట్రా 14 వేలమంది ఆదివాసీ చిన్నారులతో రూపొందిన ఈ గీతాలాపన.. గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లో చోటు దక్కించుకోవడం విశేషం. ఈ వీడియోను రిక్కీ కేజ్ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేశారు.

పండిత్ హరిప్రసాద్ చౌరాసియా, రాకాశ్ చౌరాసియా, రాహుల్ శర్మ, అమన్, అయాన్ అలి బంగాశ్, జయంతి కుమరేశ్, షేక్ మహబూమ్, సలీషాబీ మహబూబ్ వంటి ప్రముఖ క్లాసికల్ మ్యూజిషియన్లు తమ వాయి ద్యాలతో జాతీయ గీతాన్ని ప్రత్యేకంగా పలికించారు .వీరితోబాటు యూకేలోని రాయల్ వాయిద్యాలతో జాతీయ గీతాన్ని ప్రత్యేకంగా పలికించారు. వీరితో పాటు యూకేలోని రాయన్ ఫిల్మ్‌హార్మోనిక్ ఆర్కెస్ట్రాకు చెందిన 100 మంది సభ్యుల బృందం కూడా ఈ గీతాలాపనలో పాల్గొంది. కలింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌కు చెందిన 14 వేల మంది ఆదివాసీ చిన్నారులు భారతదేశ చిత్ర పటం ఆకృతిలో, భారత్ ఆంగ్ల, హిందీ అక్షరక్రమంలో నిల్చొని జాతీయ గీతాన్ని ఆలంపించారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

ఈ సందర్భంగా రిక్కీ కేజ్ మాట్లాడుతూ.. చిన్న వయసులో నేను విన్న తొలి మ్యూజిక్ మన జాతీయగీతమే. అత్యుత్తమ శాస్త్రీయ సంగీత కారులను ఒక వేదికపైకి తీసుకొచ్చి ఇలా జాతీయగీతాన్ని ఆలపించడం చాలా అద్భుతంగా వుంది. అని ఆనందం వ్యక్తం చేశారు. వీఆర్ ఫిల్మ్‌మేకర్ సాయిరామ్ సాగిరాజు, కొంతమంది డెవలపర్లతో కలిసి రిక్కీ ఇలా వర్చువల్ రియాల్టీ వెర్షన్ ప్రాజెక్ట్ రూపొందించారు. ఆయన గతంలోనూ ఇలాంటి వైవిధ్యభరిత ప్రదర్శనలు ఇచ్చారు. 2023లో లండన్‌లోని అబే రోడ్ స్టూడియోస్ వద్ద అతి పెద్ద సింఫనీ ఆర్కెస్ట్రాతో జాతీయ గీతాన్నిఆలపించారు.



## ఇక రైళ్లలో కొత్తరకం

# దుప్పట్లు!

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** మరింత సౌకర్యవంతంగా ఉండేలా అత్యంత మృదువైన దుప్పట్లను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని రైల్వేశాఖ నిర్ణయించింది. మరింత సౌకర్యవంతంగా ఉండేలా అత్యంత మృదువైన దుప్పట్లను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఎక్కువకాలం మన్నడంతో పాటు ప్రయాణికులు వీటిని కప్పుకొంటే మెరుగ్గా శ్వాస తీసుకునే వీలుంటుంది. భారత ప్రమాణాల సంస్థతో కలిసి విస్తృత పరిశోధన చేసి, ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్లతో సంప్రదించి వీటిని రూపొందించారు. ఆతిథ్య పరిశ్రమతో సమానంగా తాజా అనుభూతి కలిగేలా చూడడం ఈ ప్రయత్నం ఉద్దేశమని ఉత్తర రైల్వే తెలిపింది. రాంచీ రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో వీటిని ప్రవేశపెట్టారు. ప్రయాణికుల అభిప్రాయాలు తీసుకున్న తర్వాత మిగిలిన రైళ్లకుకు అందుబాటులోకి తెస్తారు.

# గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం మిగిల్చిన విషాదం

## 40 వేలు దాటిన మరణాలు



**జెరూసలేం, ఆగస్టు 15:** ఇజ్రాయెల్-హమాస్ మధ్య కొనసాగుతున్న యుద్ధం.. గాజాలో వేల మంది కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపుతోంది. ఓవైపు కాల్పుల విరమణకు ప్రయత్నాలు జరుగుతున్నా.. దాడుల తీవ్రత మాత్రం ఆగడం లేదు. తాజాగా మరణాల సంఖ్య 40 వేలు దాటినట్లు గాజా ఆరోగ్య విభాగం వెల్లడించింది. అందులో ఎంతమంది మిలిటెంట్లు ఉన్నారనే విషయం చెప్పనప్పటికీ.. చిన్నారులు, మహిళలు అధికంగా చనిపోతున్నట్లు సమాచారం. బర్త్ సర్టిఫికేట్ తెచ్చేలోగా, గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న వరుస దాడులతో వేల మంది పాలస్తీనీయన్లు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ క్రమంలో ఇటీవల వెలుగుచూసిన ఓ ఘటన తీవ్రంగా కలచివేస్తోంది. పుట్టిన నాలుగు రోజులకే కవల పిల్లలను కోల్పోయిన ఓ తండ్రి పడుతున్న వేదన వర్ణనాతీతం.

చిన్నారుల బర్త్ సర్టిఫికేట్ తెచ్చేందుకు వెళ్లిన అతడు.. తిరిగి ఆశ్రయం పొందుతున్న శిబిరానికి వచ్చేసరికి కవలలతోపాటు భార్య కూడా ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో కన్నుమూయడం కంటతడి పెట్టిస్తోంది. ఇదొక్కటే కాదు.. సైనిక దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన చిన్నారులను చేతుల్లో పట్టుకొని తల్లిదండ్రులు మోసుకెళ్తున్న ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. తీవ్ర గాయా లతో వందలాది చిన్నారులు ఆస్పత్రుల్లో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. మరోవైపు ఇజ్రాయెల్ సైన్యం దాడులతో గాజా నగరాలు నామరూపాలు లేకుండా పోయాయి. లక్షల మంది ఇప్పటికే నిరాశ్రయులయ్యారు. తాత్కాలిక శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. ఔషధాలు, ఆహారం, మంచినీటి కొరత తీవ్రంగా వేధిస్తోంది. పారిశుధ్యంతో ఇతర వ్యవస్థలన్నీ కుప్పకూలిపోవడంతో అక్కడి వారిని వ్యాధుల భయం వెంటాడుతోంది. పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న వారిపైనా ఇజ్రాయెల్ దాడులు జరుపుతుండడంతో సామాన్య పౌరుల మరణాలు అధికంగా ఉంటున్నాయి.

గతేడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపు దాడి చేయడం భీకర యుద్ధానికి దారితీసింది. ఆ ఘటనలో 1200 మంది ఇజ్రాయెల్ పౌరులను హతమార్చిన హమాస్ మిలిటెంట్లు.. మరో 250 మందిని బందీలుగా చేసుకున్నారు. వీరిలో 100 మందిని చర్చల క్రమంలో వదిలిపెట్టగా.. మరో 110 మంది అక్కడే ఉండిపోయినట్లు అంచనా. బందీలుగా ఉన్న వారిలో కొందరు ఇప్పటికే ప్రాణాలు కోల్పోయారు. ఇలా పది నెలలుగా వైమానిక, క్షిపణి దాడులతో గాజా దద్దరిల్లుతూనే ఉంది.

# ఒకే కుటుంబంలో ఐదుహత్యలు

## అక్రమసంబంధమే ఘాతుకానికి కారణం!

**భాగల్పూర్(బీహార్), ఆగస్టు 15:** ప్రభుత్వం కేటాయించిన క్వార్టర్స్‌లో నివసిస్తున్న ఒక పోలీస్ కుటుంబంలో దారుణ హత్యలు బీహార్‌లోని భాగల్పూర్‌లో సంచలనం రేపాయి. కానిస్టేబుల్ పంకజ్ కుటుంబంలో ఆమె భార్య, ఇద్దరు పిల్లలు, అత్తతోపాటు చివరికు ఆతడు కూడా ఆత్మహత్యచేసుకుని చనిపోవడం ప్రకంపనలు రేకెత్తించింది. ప్రతిరోజు పాలుపోసే మిల్క్‌మాన్ వచ్చి తలుపులు తట్టినా ఎవ్వరూ స్పందించకపోవడంతో అనుమానం వచ్చిన ఇరుగుపొరుగు క్వార్టర్ల నివాసితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి తలుపులు బలవంతంగా తెరిచిచూసేసరికి ఇంట్లో కానిస్టేబుల్ రీతు, ఆమె ఇద్దరు పిల్లలు, అత్త కూడా విగతజీవులై పడి ఉన్నారు. బయట వరండాలో నీతు భర్త పంకజ్ ఉచ్చుకు వేలాడుతూ కనిపించాడు. ఇంట్లో సోదాలుచేసిన పోలీసులకు పంకజ్ ఆత్మహత్యకు గల కారణా లను కూడా వివరిస్తూ లేఖరాసాడు.

కానిస్టేబుల్ నీతు అక్రమ సంబంధం కొనసాగిస్తోందని ఈ కారణంగానే ఇద్దరిమధ్య వివాదాలు నడుస్తు న్నట్లు వివరించాడు. అయితే ఈలేఖలో ఉన్న వాస్తవాలను నిర్ధారించాల్సి ఉందని తేలింది. ఈ హత్యోదంతంలో నీతుపాత్ర ఎంతవరకూఉంది. పంకజ్ ఈ హత్యలు మొత్తం చేశాడా అన్నది తేల్చాల్సి ఉంది. నీతు భర్తతో గొడవల కారణంగా తన అత్త, పిల్లలను హత్య చేసిందా? లేక భర్త పంకజ్ మొత్తం ఈ హత్యలు చేసి ఆత్మహత్యకు పాల్పడ్డాడా అన్న కోణంలో కూడా దర్యాప్తుచేస్తామని పోలీసులు తెలిపారు. ఇంటికి పక్కనే ఉన్న క్వార్టర్లలో ఈ హత్యోదంతం ఎవ రికీ కనీసం అరుపులు కూడా వినిపించక పోవడం పట్ల ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు.

ఇంట్లోనే రక్తంతో ఉన్న ఒక కత్తిని కూడా పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. ఈ హత్యల్లో మూడో వ్యక్తి అంటే బయటి వ్యక్తుల ప్రమేయం ఉందా అన్నదానిపైనా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డిఐజి ఆధ్వర్యంలో ఒక ఫోరెన్సిక్ టీమ్ ఆప్రాంతానికి వచ్చి దర్యాప్తుప్రారంభించింది. జాగిలాలను కూడా రప్పించారు. నీతు మొబైల్ ఫోన్ డేటానువిశ్లేషిస్తున్నారు.

## ఒడిశాలో మహిళలకు 'సుభద్ర యోజన'

### పథకం కింద యేటా రూ. 50,000



**భువనేశ్వర్, ఆగస్టు 15:** స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా ఒడిశా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మార్ఘి మహిళలు, రైతులకు తీపికబురు అందించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భువనేశ్వర్‌లో గురువారం జాతీయ జెండాను ఎగరవేసిన తర్వాత మార్ఘి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్య సమరయోధుల నిస్వార్థ పోరాటం, సేవల ఫలితంగానే మనకు 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం లభించిందని చెప్పారు. ఆపై స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నామని అన్నారు. స్వతంత్రం కోసం ఎంతోమంది తమ ప్రాణాలను అర్పించడంతో పాలు సమున్నత త్యాగ ఫలితమే ఇవాళ మనం వాటి తాలూకూ ఫలాలను అనుభవిస్తున్నామని చెప్పారు. స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని సుభద్ర యోజనను ప్రారంభిస్తున్నామని వెల్లడించారు.

ఈ పథకం కింద మహిళలందరికీ యేటా రూ. 50,000 అందచేస్తామని తెలిపారు. ప్రధాని నరేంద్రమోడీ సెప్టెంబరు 17న ఈ ప్రథకాన్ని ప్రారంభిస్తారని మోహన్ చరణ్‌మార్ఘి చెప్పారు. ఇక ఒడిశా రైతులకు వరి పంటకు దేశంలోనే అత్యధికంగా క్వింటాల్‌కు రూ. 3100 చెల్లిస్తామని ఆయన వెల్లడించారు. రైతులు, మహిళల మేలు కోసం స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా తీపికబురు అందిస్తున్నామని సిఎం మోహన్‌చరణ్ మార్ఘి తెలిపారు.

## రాజకీయాల్లోకి వస్తానని

# కలలో కూడా ఊహించలేదు..

### ఎంపి కంగనారనౌత్

**సిమ్లా, ఆగస్టు 15:** ప్రముఖ బాలివుడ్‌నటి కంగనా రనౌత్ పార్లమెంటు ఎన్నికల్లో లోక్‌సభ ఎంపిగా గెలుపొందిన సంగతి తెలిసిందే. హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ నియోజకవర్గంనుంచి ఆమె బిజెపి తరపున పోటీచేసి విజయం సాధించారు. మరోవైపు ఆమెప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడంతో నటనకు ఫుల్‌స్టాప్ పెట్టేస్తారనే ప్రచారం పెద్ద ఎత్తున సాగుతోంది. ఈపుకార్లపై కంగన తొలిసారి స్పందించారు. తాను నటిగా కొనసాగాలా వద్దా అనేది సినీ ప్రేక్షకుల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని కంగన తెలిపారు. రాజకీయాల్లోకి వస్తానని తాను కలలోకూడా ఊహించలేదని, కానీ ప్రజలు తనను గెలిపించి పార్లమెంటుకు పంపాన్నారు. తాను ఏ పార్టీనుంచి పోటీచేసాననే విషయం పక్కనపెడితే తాను ఎన్నికల్లో పోటీచేయాలనిమాత్రంప్రజలు బలంగా కోరుకున్నారని అన్నారు. తన కొత్తచిత్రం ఎమర్జెన్సీ విజయం సాధిస్తే తాను ఇండస్ట్రీలో కొనసాగుతానని కంగనా తెలిపారు. రాజకీయాల్లో తన అవసరం ఎక్కువగా ఉందని అనిపిస్తే రాజకీయాల్లో కొనసాగుతానని చెప్పారు.

# ఉచితాలకున్న సొమ్ములు పరిహారం చెల్లింపులకు లేవా?

## మహారాష్ట్ర సర్కారుపై సుప్రీం ఆగ్రహం

**న్యూఢిల్లీ,ఆగస్టు 15:** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చే ఉచిత హామీలు పంచేందుకు సొమ్ములు ఉంటాయి. అయితే పరిహారం చెల్లించేందుకు మాత్రం డబ్బులు లేవా అంటూ మహారాష్ట్ర సర్కారుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. మేం ఉత్తర్వులు ఇచ్చిన మూడు వారాల్లోపు బాధిత వ్యక్తికి పరిహారం మొత్తం చెల్లించకపోతే మహారాష్ట్రలో అమలుచేస్తున్న ఉచిత పథకాలన్నీ నిలిపివేసేలా ఉత్తర్వులు జారీచేస్తామని సుప్రీంకోర్టు హెచ్చరించింది. 60 ఏళ్లుగా బాధితుడికి డబ్బు చెల్లించపోవడంపై విస్మయం వ్యక్తంచేసింది. దేశ అత్యున్నత న్యాయస్థానంలోని జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ కెవి విశ్వనాథన్‌ల బెంచ్ ఈ వ్యాఖ్యలుచేసింది. వివరాల్లోకి వెళితే రక్షణశాఖ అవసరాలకోసం పూణెకు చెందిన ఒక వ్యక్తిభూమిని సేకరించింది. డిఆర్‌డీఒకు అనుబంధంగా ఆర్మమెంట్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌కు కేటాయించింది. ఈ సేకరణ జరిగి అరవై ఏళ్లు కావచ్చింది. అయితే భూసేకరణ నిబంధనల మేరకు జరగలేదని బాధితుడు ఆరోపిస్తున్నాడు. ఇప్పటికీ ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదని చెప్పాడు. దీనిపై కోర్టును ఆశ్రయించగా వడ్డీతో కలిపి బాధితుడికిచెల్లించాలని కోర్టు గతంలోనే ఆదేశించింది. కోర్టు ఆదేశాలతో ప్రభుత్వం స్పందించి బాధితుడికి 37.42కోట్ల పరిహారం ఆఫర్‌చేసింది. అయితే పరిహారం ఇవ్వడంలో జరిగిన జాప్యం ప్రస్తావిస్తూ తమకు రూ.317 కోట్లు ఇవ్వాలని బాధితుడు డిమాండ్‌చేసాడు. ఇక్కడే ప్రభుత్వ పరంగా ప్రతిష్టంభన నెలకొంది. ప్రభుత్వం ఈ అంశాన్ని నిర్లక్ష్యంచేయడంతో బాధితుడు మరోమారు సుప్రీంకోర్టు మెట్లెక్కాడు. తాజాగా ఈ పిటిషన్ విచారించిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం, బాధితుడికి వెంటనే పరిహారం చెల్లించకపోతే మహారాష్ట్రలో ఉచిత పథకాలు నిలిపివేయాలంటూ ఆదేశాలిస్తామని హెచ్చరిం చింది. దీనితోమహారాష్ట్ర ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన లాయర్‌మూడు వారాల గడువు కోరారు. ఈ గడువు మంజూరుచేస్తూ తర్వాత కూడా పరిహారం చెల్లించకపోతే తీవ్రనిర్ణయం వెల్లడిస్తామని సుప్రీం బెంచ్ హెచ్చరించింది.

# ఇజ్రాయెల్‌పై వెనక్కితగ్గితే దేవుడి ఆగ్రహం తప్పదు!

## సంచలనం కలిగించిన ఇరాన్ సుప్రీం లీడర్ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** తమ గడ్డపై హమాస్ రాజకీయ విభాగం చీఫ్ ఇస్మాయిల్ హనియేను హతమార్చిన ఇజ్రాయిల్‌పై దాడులు చేయకపోతే ఆ దేవుడుసైతం ఆగ్రహిస్తాడని ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖొమైనా చేసిన వ్యాఖ్యలు ఇపుడు రెండుదేశాలమధ్య మరింత ఉద్రిక్తతలను రేకెత్తించేవిగా ఉన్నాయి. ఇజ్రాయిలీ ఇంటెలిజెన్స్ ఆధ్వర్యంలోనే హనియే హత్యజరిగిందని ఇరాన్ ఇప్పటికీ ఆరోపిస్తోంది. అయితే అందుకు మూల్యం చెల్లించుకోకపత్పదని, సమయం చూసి తప్పకుండా ఇజ్రాయిల్ మూల్యం చెల్లించుకుంటుందని ఇరాన్ హెచ్చరికలుచేస్తూనే ఉంది.



ఇప్పటికే అమెరికా, బ్రిటన్, ఇజ్రాయిల్ వంటి దేశాలు 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత ఇరాన్‌ను తక్కువగా అంచ నావేస్తున్నాయని, ఇరాన్ సామర్థ్యం చెప్పుకునే స్థితి ఇపుడు ఆసన్నం అయిందని ఖొమైనీ తమ దేశ ఆర్మీకి పిలుపునిచ్చారు. హనియే హత్యతర్వాత ఇరాన్ వెంటనే స్పందించకుండా వేచిచూసే ధోరణిలో ఉంది. ఇరాన్ విదేశాంగశాఖ ఇందుకు సంబంధించి ఒక ప్రకటన విడుదలచేస్తూ పాశ్చాత్యదేశాలు ద్వంద్వ వైఖరినిఅనుసరిస్తున్నాయని ఆరోపించారు. ఇక ఇరాన్ కొత్త అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ఖొమైనీ కఠినవైఖరితో ఏకీభవించారు. కొత్త అధ్యక్షుడు ఇప్పటివరకూ స్పందించకపోవడంపైనా కొంత అసంతృప్తితో ఉన్నారు.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# తణుకులో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



తణుకు రూరల్ (ప్రభాత వార్త) :ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో 78 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తణుకులో ఘనంగా నిర్వహించారు. తొలుత పట్టణ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ జాతీయ పతాక ఆవిష్కరణ చేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు రెండు శతాబ్దాల బ్రిటీష్ వారి పాలన నుంచి భారతదేశం స్వాతంత్ర్యం పొందిన రోజుకి గుర్తుగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని భారతదేశం గత పోరాటాలను గౌరవించే బహుముఖ వేడుక ఇది అని అన్నారు. గత విజయాలను గుర్తు చేసుకుంటూ ప్రజల మధ్య ఐక్యతకు పౌరులందరికీ మెరుగైన దేశాన్ని నిర్మించడానికి ఈ పండుగ జరుపుకుంటున్నామన్నారు. అనంతరం తణుకు మండల తహసీల్దార్ కార్యాలయంలో, తణుకు పట్టణం జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాల, ఇరగవరం మండలం తహసీల్దార్ కార్యాలయంలోనూ తణుకు పట్టణం ఉమ్మడి పార్టీ కార్యాలయం లో కూడా మువ్వన్నెల జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ ప్రదేశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాలలో ప్రభుత్వ అధికారులు పార్టీ నాయకులు కార్యకర్తలు పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జై హింద్





ఏలూరులో మంత్రి పార్థసారధి భీమవరంలో మంత్రి రామానాయుడు జెండా వందనం చేసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు ప్రభాతవార్త ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా

# నరసాపురంలో ఘనంగా 78 వ స్వాతంత్ర వేడుకలు






ప్రభాతవార్త నరసాపురం: నరసాపురం నియోజవర్గంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రవేటు కార్యాలయాల్లో అధికారులు, పార్టీ శ్రేణులు, నాయకులు, వివిధ సంఘాల వారు ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎమ్మేల్యే నాయకర్ ముఖ్య అతిథిగా



పాల్గొని జాతీయ పతాకాలను ఎగురవేశారు. దేశానికి జాతీయ నాయకులు చేసిన సేవలను కొనియాడారు. జనసేన పార్టీ కార్యాలయం వద్ద, సీతారాంపురం లేస్ ఆఫీస్ , సెవెంత్ డే స్కూల్ , సెంటెన్స్ స్కూల్, గవర్నమెంట్ హాస్పిటల్ ,ఎమ్మార్వో ఆఫీస్ ,ఎంపీడీవో ఆఫీస్,మొగల్తూరు ఎమ్మార్వో ఆఫీస్ మరియు వలందర్ రేవు లలితాంబ ఘాట్ దగ్గర దివ్యాంగులు వికలాంగులు ఏర్పాటు చేసిన మరియు పట్టణంలో పలు వార్డులలో జాతీయ జెండాలను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎందరో ప్రాణ త్యాగాల ఫలితంగా భారతదేశానికి స్వతంత్రము లభించింది ఆయనతో పాటు మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు జనసేన పార్టీ సీనియర్ నాయకులు చినిమిల్లి సత్యనారాయణ రావు రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ కలవకొలను తాతాజీ బిజెపి ఇంచార్జ్ మేకల సతీష్ జక్కం బాబ్జి కోటిపల్లి వెంకటేశ్వరరావు,వర్ధనపు ప్రసాద్ వలవల నాని ఆకన చంద్రశేఖర్ మాధంశెట్టి కోటేశ్వరరావు బందెల రవీంద్ర నిప్పులేటి తారక రామారావు గుబ్బల మారాజు వాతాడి కనకరాజు మరియు నియోజవర్గ జనసేన టిడిపి బిజెపి నాయకులు జనసైనికులు కార్యకర్తలు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సమాచార శాఖ సిబ్బందికి ప్రశంసా పత్రాలు



ఏలూరు ప్రభాతవార్త 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలకు గుర్తింపుగా ఉత్తమ సేవా పతకాలు అందుకున్న డివిజనల్ పిఆర్ఓ సిహెచ్.కె. దుర్గాప్రసాద్, సహాయక సమాచార ఇంజనీరు కె. ధనుంజయరాజు, ఉత్తమ ఫొటో గ్రాఫర్ పి. సాగర్ లను అభినందించారు. ఇదే విధంగా మరింత ఉత్తమ పనితీరు కనబరచి భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ పతకాలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించినందుకు గాను జిల్లా అధికారుల విభాగంలో జిల్లా పౌర సంబంధాధికారి ఆర్. వి. ఎస్. రామచంద్రరావు ను కార్యాలయ సిబ్బంది అందరూ అభినందించారు



పశ్చిమగోదావరి జిల్లా సమాచార శాఖ జిల్లా అధికారి టీ నాగేశ్వరరావుకు ప్రశంసా పత్రం అందజేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడుకలెక్టర్ చదలవాడ నాగరాణి. ప్రభాత వార్త. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా










పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ సంబరాల్లో పాల్గొన్న రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కలెక్టర్ నాగరాణి ఎస్పీ తదితరులు. ప్రభాతవార్త భీమవరం











మంత్రి నిమ్మల రామానాయుడు నుండి ప్రశంసా పత్రం అందుకున్న సమాచార శాఖ సిబ్బంది సోమరాజు






కొలుసు పార్థసారథి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్వహణ సమాచార పౌర సంబంధాల శాఖ మాత్యులు. మరియు ఏలూరు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నరసాపురం లైబ్రేరియన్ కె. జె .ఎస్. ఎల్ కుమారి ప్రభాతవార్త నరసాపురం


## కండిగలమ్మ అమ్మవారికి రెండు కేజీల 30 గ్రాములు వెండి కిరీటం బహుకరణ





ద్వారకా తిరుమల ప్రభాతవార్త : మండలంలోని గుండుగోలను కుంట గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన కండిగలమ్మ అమ్మవారికి భీమడోలు గ్రామ కాపురస్తులు త్రిమూర్తులు రెండు కేజీల 30 గ్రాములు వెండి కిరీటం రెండు బంగారపు కళ్ళును చేయించి గురువారం ఉదయం ఆలయ నిర్మాణ వ్యవస్థాపకులు చిలుకూరి ధర్మారావుకు అందజేశారు. ఆలయ పూజారి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి అలంకరణ చేశారు. ఈ క్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పరిసర ప్రాంత భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకుని తీర్థప్రసాదాలు సేకరించారు.

# భారత్ గొప్ప ప్రజాస్వామ్య దేశం - మేయర్ నూర్జహాన్



ఏలూరు ప్రభాతవార్త :అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారతదేశం అని అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలను కొనసాగించాలని ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. 78 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ప్రాంగణంలో జరిగిన జెండా వందన కార్యక్రమానికి నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందుగా అందరికీ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎందరో మహానుభావులు ప్రాణ త్యాగాల ఫలితంగా భారతదేశం ఆవిర్భవించిందన్నారు. భారతదేశం ఆవిర్భావం నుండి ఎన్నో సంస్కరణలు తీసుకువస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం ఎదిగిందన్నారు. స్వాతంత్ర పోరాటంలో ప్రాణా త్యాగాలు చేసిన మహాత్మా గాంధీ,అల్లూరి సీతారామరాజు, బాలగంగాధర్ తిలక్,లాలాలజపతిరాయ్ సుభాష్చంద్రబోస్,భగత్ సింగ్,ఎందరో మహిళా విరమణలను స్మరించుకొని వారి ఆశయాలను కొనసాగించినప్పుడే వారి యొక్క పోరాట ఫలితం ఉంటుందని ఆమె అన్నారు. మన తెలుగు వారు కూడా స్వాతంత్ర పోరాటంలో ఉండడం మనందరికీ గర్వకారణం అన్నారు. అదేవిధంగా స్వాతంత్రం వచ్చిన తర్వాత మనమందరం ఎంతో ప్రశాంతంగా జీవిస్తున్నామంటే సరిహద్దుల్లో ఉన్న మన సైనికుల ప్రాణ త్యాగాలను కూడా ఈ సందర్భంగా స్మరించుకొని నివాళులు అర్పించారు. భారతదేశ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలన్నారు. మన చట్టాలను మనం గౌరవిస్తూ మన దేశ అభివృద్ధికి అందరం సహకరించాలన్నారు. అలాగే ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు అందరూ ఎవరి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహించి నగర అభివృద్ధికి సహకరించాలన్నారు. అదేవిధంగా మన మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉత్తమ ఉద్యోగస్తులు 31 మందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేస్తున్న వికలాంగురాలు మల్లేశ్వరి కి ట్రై సైకిల్ ను అందజేశారు. తొలుత అందరూ మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల,నులుమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్స్ సభ్యులు ఎస్ ఎం ఆర్



పెదబాబు,డిప్యూటీ మేయర్లు గుడిదేశీ శ్రీనివాసరావు,నూకపేయి సుధీర్ బాబు, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్,అదనపు కమిషనర్ చంద్రయ్య, తదితరులు ప్రసంగించారు.మున్సిపల్ సెక్రెటరీ ఇన్చార్జి డిప్యూటీ కమిషనర్ దివ్య కుమారి,ఎస్ఈ వెంకటేశ్వరరావు,ఎంఈ కొండలరావు, అసిస్టెంట్ ఎగ్జామినర్ చందర్రావు, ఎం హెచ్ ఓడాక్టర్ మాలతి,పిఓ కృష్ణమూర్తి,ఏసీపీ తిరుపతిరావు, కార్పొరేటర్లు సుంకర చంద్రశేఖర్,షబ్బన శ్రీనివాసరావు, బత్తిన విజయకుమార్,దేవరకొండ శ్రీనివాసరావు,వంకదారు ప్రవీణ్,తంగెళ్ల రాము, మునగాల కేదారేశ్వరి జగదీష్,జిజ్జవరపు విజయనిర్మల కో-ఆప్షన్ సభ్యులు కొంపెల్ల తాయారు,మున్నుల జాన్ గుర్నాథ్, నిత విజయ్ కుమార్ జైన్,మెప్మా సీవోలు ఆర్పీలు,రెవెన్యూ,టౌన్ ప్లానింగ్ విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు...

ప్రభాతవార్తకు విలేకరులు కావలెను

తెలుగు జాతీయ దినపత్రిక వార్తలో విలేకరులుగా పని చేయుటకు ఈదిగువ సెంటర్లలో అనుభవం ఆసక్తి ఉన్నవారు ప్రభాతవార్త విలేకరిగా పనిచేయుటకు కావలెను. ఏలూరు, తాడేపల్లిగూడెం, ఆచంట , పెనుగొండ, పెదవేగి, భీమడోలు, గణపవరం , ఆకివీడు,పోలవరం, చింతలపూడి, లింగపాలెం, మొగల్తూరు, బుట్టాయిగూడెం , దెందులూరు, పెంటపాడు, కామవరపు కోట మండలాలుకు పట్టణాలకు. ఖాళీగా ఉన్న సెంటర్లలో పనిచేయుటకు కావలెను. అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

కాంటాక్ట్ నెంబర్: 9440374577

## జంగారెడ్డిగూడెం అధికారులకు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు

జంగారెడ్డిగూడెం – ప్రభాతవార్త : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో మెరుగైన పనితీరు కనబర్చిన జిల్లా అధికారులకు, వివిధ శాఖల ఉద్యోగులకు గురువారం రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రశంసా పత్రాలను పొందిన జిల్లా అధికారులతో జంగారెడ్డిగూడెం ఆర్డీవో కే.అద్దయ్య ఉన్నారు. మిగిలిన అధికారులు, ఉద్యోగులలో జంగారెడ్డిగూడెం ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వి.రాంబాబు, పంచాయతీ రాజ్ పీటీయు సబ్ డివిజన్ అసిస్టెంట్ ఈఈ ఎన్.అంకిరెడ్డి, రీజనల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ ఎండి.మధాని, జెడ్‌పీపీ డీఎల్‌డీవో ఎం.రాజు, ఎంపీడీవో కేవి.ప్రసాద్, తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయ ఉద్యోగులు కే.రమేష్ (సర్వే డీటీ), ఎస్.చంద్రరావు, సీనియర్ అసిస్టెంట్ ఎం.తులసి, మండల సర్వేయర్, డీఎల్‌డీవో ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ కే.సునీత, పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు పి.వరలక్ష్మి (అసిస్టెంట్ మేనేజర్–ట్రాఫిక్), పి.అరుణ, జూనియర్ లెక్చరర్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌స్కూల్స్, యు.రాజేష్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ట్రెజరీ, అకౌంట్స్ ఉన్నారు. జిల్ల మొత్తం మీద 16 మంది జిల్లా అధికారులకు, 242మంది వివిధ శాఖల ఉద్యోగులు ప్రశంసా పత్రాలు పొందగా, వారిలో జిల్లా అధికారులతో ఒకరు, 242మందిలో 13మంది అధికారులు, ఉద్యోగులు ప్రశంసా పత్రాలు పొందడం విశేషం. ప్రశంసా పత్రాలు స్వీకరించిన వారిని పలువురు అభినందించారు.



## మహనీయుల మార్గదర్శకాలతో ముందుకు సాగుదాం – ఎంపీపీ లంకా నిర్మల

చాట్రాయి, ఆగస్టు 15, ప్రభాతవార్త : ఎందరో మహనీయులు స్వాతంత్ర సమరంలో పాల్గొని ప్రాణాలర్పించారని వారికి గల దేశభక్తిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని మండల పరిషత్ అధ్యక్షురాలు లంకా నిర్మల అన్నారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో 78వ స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమాలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె జెండా ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి దేశభక్తి ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. చాట్రాయి భారతీయ స్టేట్ బ్యాంకులో బ్రాంచ్ మేనేజర్ కిరణ్ కుమార్ జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ దేశం పట్ల ప్రతి ఒక్కరికి గౌరవం భక్తి ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులను ఎన్నటికీ మరవరాదని వారి జీవన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ మెలగాలని ఆయన ఉద్బోధించారు. చాట్రాయి పోలీస్ స్టేషన్ లో ఎస్సై స్వామి, తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ప్రశాంతి, చాట్రాయి సచివాలయంలో సర్పంచ్ దామెర ఉష, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీపీ లంక నిర్మల జెండా ఆవిష్కరణ చేయగా డాక్టర్ విజయలక్ష్మి వైద్య సిబ్బంది పాల్గొన్నారు. బూరుగుగూడెం సచివాలయంలో సర్పంచి దేశి రెడ్డి హైమావతి జండా ఆవిష్కరించారు. పర్వతాపురం సచివాలయంలో సర్పంచ్ మిద్దె శివాజీ, కోటపాడు లో సర్పంచ్ పరసా సత్యనారాయణ, చిన్నంపేటలో సర్పంచ్ పరసా ధనలక్ష్మి, చాట్రాయి మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలోబిజెపి సీనియర్ నాయకులు గడ్డం సంజీవరెడ్డి జెండా ఆవిష్కరణ చేయగా నాయకులు పోతిరెడ్డిపల్లి చెన్నారావు, ఆదిమూలం నాగమోహన శర్మ, రాజా తదితరులు పాల్గొన్నారు.




## ఆరవల్లి లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



అత్తిలి – ఆగస్టు 15 ( ప్రభాత వార్త ): అత్తిలి మండలం ఆరవల్లి గ్రామం లో స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాలుర ప్రాథమిక పాఠశాల వద్ద చైర్మన్ వెలగల సుధా జెండా ఎగురవేశారు. గ్రంధాలయం వద్ద కమిటీ చైర్మన్ కర్రీ బుల్లి వెంకట రెడ్డి జెండా ఆవిష్కరించారు. గాంధీ విగ్రహానికి వెలగల ప్రసాద రెడ్డి పూల మాల వేశారు. స్పెషల్ పాఠశాలా వద్ద చైర్మన్ మేడపాటి బాలకృష్ణ పతాకావిష్కరణ చేసారు. ఉన్నత పాఠశాలా వద్ద కమిటీ చైర్మన్ వెలగల సత్య రెడ్డి జెండా ఎగురవేశారు. హెచ్ ఎం. అనంత లక్ష్మి , ఎస్వీఎస్ రెడ్డి , మేడపాటి కృష్ణ కుమారి , సత్తి మణిఖన్త శ్రీనివాసరెడ్డి , ఎల్ ఐ సి సత్యనారాయణరెడ్డి , తదితరులు పాల్గొన్నారు. వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందచేశారు.

## డీఎస్పీ రవిచంద్రకు అవార్డు

జంగారెడ్డిగూడెం – ప్రభాతవార్త : కేసులు దర్యాప్తులలో ప్రతిభ పాఠములు కనబరిచిన జంగారెడ్డిగూడెం డిఎస్పి యు రవిచంద్ర యూనియన్ హెూమ్ మినిస్టర్ మెడల్ ఫర్ ఎక్సెన్స్ అవార్డు ను ఈరోజు 78వ స్వాతంత్ర దినోత్సవం నాడు పలనాడు జిల్లా నరసరావుపేట నందు పౌరసరఫరాల మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ గారి చేతులమీదుగా పతకమును పొందినారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ లో ఉన్న అధికారులు అందరూ జంగారెడ్డిగూడెం డిఎస్పి యు రవిచంద్ర గారికి అభినందనలు తెలియ చేసి వారు భవిష్యత్తులో మరిన్ని బహుమతులు పథకాలు పొందాలని ఆకాంక్షించిన పోలీస్ సిబ్బంది




## జనసేన అద్వర్యం లోస్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.

అత్తిలి – ఆగస్టు 15 ( ప్రభాత వార్త ):78 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అత్తిలి జనసేన పార్టీ కార్యాలయం నందు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా దేశ సరిహద్దుల్లో సేవలందించిన విశ్రాంత మిలటరీ ఆఫీసర్ జడ్డు మోహనరావు జాతీయ పతాకం ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు.. ఈ సందర్భం గా జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి కుసంపూడి శ్రీనివాస్ . జనసేన నాయకులు అనుకుల రమేష్ .ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ కాట్నం విశాలాక్షి . జిల్లా కార్యదర్శి అన్నెం విశ్వప్రభు , తిరుపతి పురం సర్పంచ్ కందుల లీల మణికంఠ . టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ పూతినీడి శ్రీనివాస్ .సామన సత్తిబాబు ,కాశీ క్షేత్రంలో విశేష సేవలందిస్తున్న రేలంగి వాస్తవ్యులు కొలా శ్రీనివాస్ , జనసైనీకులు బడేటి త్రినాధ్, తానింకి అయ్యప్ప, బాధరాల శ్రీదర్,పేరికల సుబ్బారావు ,ఆనంద్ ,బడేటి శివ,పుప్పాల కుమారి పాల్గొని గౌరవ వందనం స్వీకరించారు.



## జాతీయ జెండాలను ఆవిష్కరించిన సీనియర్ నాయకులు

జంగారెడ్డిగూడెం – ప్రభాతవార్త : ఏలూరులోని జిల్లా బిజెపి కార్యాలయంలో 78వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్ కిషోర్ అధ్యక్షతన నిర్వహించిన 78వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలలో ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, రాష్ట్ర శాశ్వత కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ పాల్గొన్నారు. బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను సీనియర్ నాయకులు ముద్దాని దుర్గారావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్ మాట్లాడుతూ జాతీయ సమైక్యత, సమగ్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మాజీ ఎమ్మెల్యే అంబిక కృష్ణ మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు దీటుగా భారతదేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందని, ప్రతి ఒక్కరిలో జాతీయ భావం ఉండాలన్నారు. ప్రధాని మోడీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నడపన దాన భాస్కర్, దెందులూరు నియోజకవర్గం కన్వీనర్ గుమ్మడి చైతన్య, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కుసుమకుమారి, నాగం శివ, పలువురు మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు



## ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

ఆగిరిపల్లి ఆగస్టు 15 ప్రభాతవార్త. : ఆగిరిపల్లి మండలంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక సత్రం సెంటర్లో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఎండూరు నరసింహ ఆధ్వర్యంలో పదాకావిష్కరణ చేసి మిఠాయిలు పంచారు. ఎండిఓ కార్యాలయంలో ఎండిఓ శంకర్రావు, తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ ప్రసాద్, స్థానిక ఆటో స్టాండ్ లో, స్థానిక సెంటర్లోని గ్రంథాలయం వద్ద పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చౌటపల్లి లక్ష్మీ, విక్టర్ బాబు లు పతాకావిష్కరణ నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో,స్థానిక ఉన్నత పాఠశాలలో శ్రీ వెంకటేశ్వర పబ్లిక్ స్కూల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పలు స్వచ్ఛంద సంస్థల వద్ద స్వాతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు.



## ఉత్తమ ఏ ఎస్ ఓ గా ప్రసాద్.



అత్తిలి – ఆగస్టు 15 ( ప్రభాత వార్త ):అత్తిలి మండల అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి ఏ.వి.వి.ఎస్. వి.ప్రసాద్ ఉత్తమ మండల ఎపిఓ ( ఉపాధి హామీ పథకం ) అధికారిగా పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామ నాయుడు చేతులు మీదుగా ప్రశంసా పత్రము అందుకున్నారు. ఉత్తమ మండల ప్రజా పరిషత్ కార్యాలయ టైపిస్ట్ గా కె. శ్రీనివాస్ పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రినిమ్మల రామ నాయుడు చేతులు మీదుగా ప్రశంసా పత్రము అందుకున్నారు.ఇరువురిని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ బాబు , ఏ..ఓ. వి.వి.ఎస్. రామారావు , సిబ్బంది అభినందించారు.

## భగవాన్‌కు అభినందన

ప్రభాతవార్త భీమవరం :భీమవరం పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సి హెచ్ నాగరాణి అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బాగంగా నర్సాపురం పట్టణానికి చెందిన ఆదరణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బొడ్డు కృష్ణ భగవాన్ కు సమాజంలో సేవలు అందిస్తూ 72 సార్లు రక్తదానం చేసినందుకు గాను అత్యుత్తమ సేవా పురస్కార అవార్డును రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ నాగరాణి ల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా భగవాన్ ను రామానాయుడు అభినందించారు.



## ఏలూరులో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఏలూరు సిటీ, ప్రభాతవార్త : ఏలూరు కోటదిబ్బ లోని ఏలూరు జిల్లా మాజీ సైనిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 78వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి అమర్ జవాన్ స్మారక స్థూపం వద్ద నివాళులర్పించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆనంతరం నూతనంగా నిర్మించిన మాజీ సైనిక సంఘం భవనాన్ని గారపాటి సీతారామాంజనేయ చౌదరి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గారపాటి చౌదరి మాట్లాడుతూ ఎందరో మహానుబావుల త్యాగాల ఫలితంగానే భారతదేశానికి స్వాతంత్రం వచ్చిందన్నారు. దేశానికి త్యాగమూర్తుల చేసిన సేవలు, త్యాగాలు మరువలేనివన్నారు. మాజీ సైనికులు కొంత సమయం కేటాయించి పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు దేశభక్తి, జాతీయ సమైక్యత, సమగ్రతను కాపాడటం గూర్చి తెలుపుతూ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె వేణుబాబు, జిల్లా మాజీ సైనిక సంఘం గౌరవ అధ్యక్షులు వాసుకి శర్మ , అధ్యక్షులు కేతినీడి భాస్కర్ రావు , గారపాటి బ్రహ్మానంద చౌదరి, ప్రధాన కార్యదర్శి పి.బి. రమేష్, పెద్ద సంఖ్యలో మాజీ సైనికులు పాల్గొన్నారు.




## యువత పోరాట స్ఫూర్తి కలిగి ఉండాలి- ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్



తణుకు రూరల్ (ప్రభాత వార్త) : స్వాతంత్ర ఉద్యమాన్ని ఆదర్శంగా తీసుకుని యువత పోరాట స్ఫూర్తి కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక వైసిపి కార్యాలయం నందు జరిగిన జాతీయ జెండా పతకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి యువత సామాజిక అమాధ్యమాలకు ప్రాధాన్యతనిస్తూ ఏదైనా సాధించాలనే పోరాట స్ఫూర్తిని విస్మరిస్తున్నారని అయితే స్వాతంత్ర దినోత్సవం ఉద్యమాలకు పోరాటాలకు చిహ్నమని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంట్ వైసిపి ఇన్చార్జ్ కారుమూరి సునీల్ కుమార్ పాల్గొని ప్రజలకు స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు కల్పించిన స్వాతంత్ర సమరయోధులను మరువకూడదన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు






ప్రభాతవార్త నరసాపురం : నరసాపురం పట్టణం వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 78వ స్వతంత్ర దినోత్సవ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు, మరియు, నరసాపురం పట్టణం స్టీమర్ రోడ్ లోని స్వర్గీయ డా.వై.యస్ రాజశేఖర రెడ్డి గారి విగ్రహానికి, శివాలయం సెంటర్లోని జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి, అంబేద్కర్ సెంటర్లో గల, డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి, పూలమాల వేసి నివాళిలు అర్పించిన, నరసాపురం నియోజికవర్గ వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మరియు మాజీ శాసనసభ్యులు, ముదునూరి ప్రసాద రాజు మరియు పార్టీ కుటుంబ సభ్యులు





ఏలూరు ప్రభాతవార్త : ఏలూరు జిల్లాలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగా యి. మంత్రి కే పార్థసారథి జిల్లా కలెక్టర్ కే వెట్రి సెల్వి జాయింట్ కలెక్టర్ ఎస్ పి ఇతర అధికారులు పాల్గొన్నారు.







78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఏలూరు పోలీసు పెరెడ్ గ్రౌండ్స్ లో వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతి తెలిపే శకటాల ప్రదర్శన లో ఉత్తమంగా నిలిచిన గృహ నిర్మాణ శాఖ శకటం. ఈ సందర్భంగా సంబంధిత అధికారులను అభినందిస్తున్న రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార శాఖ మంత్రి శ్రీ కొలుసు పార్థసారధి. ప్రభాతవార్త ఏలూరు



నరసాపురం కోర్టులో జండా వందన కార్యక్రమంలో పాల్గొన్న అధ్యక్షులు చేగొండి బాలాజీ కొత్తపల్లిరమేష్ పి శ్రీనివాస్ తదితరులు. ప్రభాతవార్త నరసాపురం



రాయపేటలో జండా వందనం చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే మాధవ నాయుడు. ప్రభాత వార్త

## మహనీయుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్యం

### టిడిపి బీసీ సెల్ రాష్ట్రనాయకులు రాజశేఖర్

నూజివీడు, ఆగస్టు 15 ప్రభాతవార్త: ఎందరో మహనీయుల జీవితాల త్యాగ ఫలితమే స్వాతంత్రమని రాష్ట్ర బీసీ సెల్ నాయకులు తలపంటి రాజశేఖర్ అన్నారు. గురువారం నూజివీడు పట్టణంలోని1 వ వార్డులో వార్డ్ టిడిపి ఇంచార్జ్ తలపంటి శివకుమారి ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్ అప్పారావు కాలనీలో స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా జరిగిన వేడుకలలో జాతీయ పతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్మ్మాడి వేదనాయకం నీ ప్రశ్నించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాజశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రజలకు సంక్షేమ పథకాల అమలు చేసి వారి ఆదాయాలను పెంచేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో రాష్ట్ర మంత్రి, నూజివీడు శాసనసభ్యులు కొలుసు పార్థసారథి ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. నూజివీడుకు పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు సారథి చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఇప్పటికే నూజివీడు సమీపంలో ఉన్న మల్లవల్లి పారిశ్రామిక వాడలో అశోక్ లేలాండ్ ఇతర ప్రముఖ సంస్థలు పనులు కొనసాగిస్తున్నాయని, ఈ ప్రాంత ప్రజలకు భవిష్యత్తులో ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## తహసిల్దార్ కార్యాలయంలో 78వ గణతంత్ర దినోత్సవం ఎమ్మెల్యే

నిడమర్రు ప్రభాతవార్త 1: నిడమర్రు మండలం తహసిల్దార్ కార్యాలయంలో జాతీయ జెండా పతాక ఆవిష్కరణ చేసిన ఉంగుటూరు ఎం మ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి జాతీయ జెండా పతాక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయులని స్మరిస్తూ, వారి చిత్ర పటాలకు పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ దేశానికి బ్రిటిష్ దొరల నుండి విముక్తి లభించి దేశానికి స్వాతంత్ర్యన్ని తీసుకొచ్చి, దేశ ప్రజలు స్వేచ్ఛగా బ్రతకడం కోసం పోరాడిన మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి, మండల నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, జనసేన గ్రామ అధ్యక్షుడు కన్నాజి చిన్ని చెలం శెట్టి రమేష్ మైలవరపు సురేంద్ర చెలం శెట్టి సూరిబాబు బచ్చు గణేష్ కొట్టేసాయి మాదాసు బాలాజీ తెలుగుదేశం నాయకులు సత్తి నిడి నాని అంబళ్ళ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రొడక్షన్ నం.58 షూటింగ్

విక్టరీ వెంకటేష్, బ్లాక్ బస్టర్ అనిల్ రావిపూడి, ప్రెస్టీజియస్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ హ్యాట్రిక్ బ్లాక్‌బస్టర్‌లను కంప్లీట్ చేయడానికి సిద్ధంగా వున్నారు. సంక్రాంతి రేసులో ఉన్న ఎస్వీసీ ప్రొడక్షన్ నం.58 పొల్లాచ్చిలో షూటింగ్ జరుపుకుంటోంది. విక్టరీ వెంకటేష్ షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా వెంకటేష్ ఎక్స్- కాప్‌గా ప్రెజెంట్ చేస్తూ మేకర్స్ స్పెషల్ వీడియోను విడుదల చేశారు. వెంకటేష్, అనిల్ రావిపూడిసెట్‌లో సరదాగా గడిపిన సమయాన్ని వీడియో ప్రజెంట్ చేస్తోంది. ఈ నెల రోజులు షెడ్యూల్ మొత్తం టాకీ పార్ట్స్, సాంగ్స్ షూటింగ్‌పై టీమ్



ఫోకస్ పెట్టింది. హీరో, అతని ఎక్స్ గర్ల్ ఫ్రెండ్, అతని ఎక్స్‌లెంట్ వైఫ్. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే ఎక్స్‌ట్రార్డినరీ ట్రైయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్ ఇది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన మీనాక్షిచౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. టాప్ టెక్నిషియన్స్ ఈ సినిమా కోసం పనిచేస్తున్నారు. ఇన్-ఫార్ట్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించగా,సమీర్‌రెడ్డి సినిమాటోగ్రాఫర్.ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్, తమ్మిరాజు ఎడిటర్.ఎస్.కృష్ణ, జి ఆదినారాయణ కో-రైటర్స్. వి. వెంకటేష్ డైరెక్టర్. నటీనటులు: వెంకటేష్, మీనాక్షిచౌదరి, ఐశ్వరరాజేష్, ఉపేంద్రలిమాయే, రాజేంద్రప్రసాద్, సాయికుమార్, నరేష్, విటి గణేష్, మురళీధర్ గౌడ్, పమ్మిసాయి, సాయిశ్రీనివాస్, ఆనంద్‌రాజ్, చైతన్యజొన్నలగడ్డ, మహేష్ బాలరాజ్, ప్రదాప్‌కాబ్రా,చిట్టి. సాంకేతికి సిబ్బంది: రచన, దర్శకత్వం: అనిల్ రావిపూడి, సమర్పణ: దిల్‌రాజు, బ్యానర్: శ్రీ వెంకటేశ్వర క్రియేషన్, నిర్మాత: శిరీష్, సంగీతం: భీమ్స్‌సిసిరోలియో, డీవోపీ: సమీర్‌రెడ్డి, ప్రొడక్షన్ డిజైనర్ : ఎఎస్‌ప్రకాష్, ఎడిటర్: తమ్మిరాజు, కో -రైటర్స్: ఎస్.కృష్ణ, జి.

# 'థ్రిల్లింగ్ ఇన్‌స్పైర్ ఛాలెంజ్' ఈవెంట్


టాలెంట్ ఎవరి సొత్తూ కాదు..అవకాశం వదలొద్దు.. సోషల్ మీడియానే మీ హద్దు! థ్రిల్ సిటీ సోషల్ మీడియా, ఇన్‌స్పైర్





ఛాలెంజ్, కర్టెన్ రైజర్ ఈవెంట్‌లో మాస్‌కా దాస్ విశ్వక్‌సేన్. సృజనాత్మకతను చాటండి, లక్షల ప్రైజ్ మనీ గెలవండి.. హైదరాబాద్‌కు తలమానికంగా భాసిల్లుతున్న 'థ్రిల్ సిటీ-అమ్యూజ్మెంట్ థీమ్ పార్క్' సోషల్ మీడియా ప్రభావాశీలుర సృజనాత్మకతకు సవాలు విసిరింది. అసాధారణమైన, అద్భుతమైన అనేక విశేషాల సమాహారంగా ఇంటిల్లిపాదినీ అలరిసునతన్న 'థ్రిల్ సిటీ- థీమ్ పార్క్'లోని ఫన్ గేమ్స్, అడ్వెంచర్ గేమ్స్, హార్రర్ మేజ్, 12డి థియేటర్ లాంటి వందలాది యాక్టివిటీస్'ని బేస్ చేసుకుని షూట్ చేసిన విడియో రీల్‌ను చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన విడియోల నుంచి అత్యుత్తమమైన విడియో రీల్స్ మూడింటిని ఎంపిక చేసి, తలా లక్ష రూపాయల చొప్పున మూడు లక్షల నగదు బహుమతులను అందించే బృహత్ కార్యక్రమానికి తెర తీసింది. యంగ్ టాలెంట్‌ను కూడా యంకరేజ్ చేసే 'థ్రిల్లింగ్ ఇన్ఫ్లెన్సర్ ఛాలెంజ్' ఈవెంట్ కర్టెన్ రైజర్ వేడుకకు ముఖ్య అతిథిగా టాలీవుడ్ యువ సంచలనం విశ్వక్సేన్ విచ్చేశారు. ఈ రోజున సోషల్ మీడియాపై ఆధారపడని వ్యవస్థ, వ్యాపార రంగమంటూ ఏదీ లేదని, టాలెంట్ ఎవరి సొత్తూ కాదని, క్రియేటివిటీ కలిగిన ప్రతి ఒక్కరికీ సోషల్ మీడియా పట్టం కడుతుందని ఈ సందర్భంగా విశ్వక్సేన్ పేర్కొన్నారు. ఇందులోకి కొత్తగా ప్రవేశించేవాళ్లు కూడా ఇందులో బ్రహ్మాండంగా రాణించవచ్చని ఆయన అన్నారు. థ్రిల్ సిటీ సోషల్ మీడియా ఇన్ఫ్లుయన్సర్స్ ఛాలెంట్ ఈవెంట్‌కి కో-ఆర్డిరేటర్‌గా వ్యవహరిస్తున్న బందూక్ లక్ష్మణ్ మాట్లాడుతూ, మూడు విభాగాల్లో ముగ్గురు విజేతలను ఎంపిక చేసి, ప్రముఖ దర్శకుల సమక్షంలో జరిగే వేడుకలో లక్ష రూపాయల చొప్పున నగదు బహుమతి అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో థ్రిల్ సిటీ టీమ్ ఫీయాక్, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ స్వీకర్‌తో పాటు హైదరాబాద్వ్యాప్త సోషల్ మీడియా ఇన్ఫ్లు

# 'శంకర్ దాదా ఎంబిబిఎస్' రీ రిలీజ్



టాలీవుడ్ ప్రేక్షకులు, మూవీ లవర్స్ ఒకటిగా ఎదురు చూస్తున్న రీ రిలీజ్‌ల్లో శంకర్ దాదా ఎంబిబిఎస్ సినిమా కూడా ఒకటి. మెగా స్టార్ చిరంజీవి నటించిన ఈ సినిమా కామెడీ అండ్ ఎమో షనల్ చిత్రంగా 2004లో ఆడియన్స్ ముందుకు వచ్చి సూపర్ హిట్ సాధించింది. బాలీవుడ్ మూవీ మున్నా భాయ్ ఎంబిబిఎస్‌కి ఇది రీమేక్‌గా వచ్చిన ఈ సినిమాని జయంత్ పరాంజీ డైరెక్ట్ చేశాడు. సోనాలి బింద్రే హీరోయిన్‌గానటించింది. శంకర్ దాదాగా చిరంజీవి, ఎటిఎంగా శ్రీకాంత్ చేసిన సిందడి అంతా ఇంతా కాదు. ఈ సినిమాలో చిరంజీవి ఇంగ్లీష్ పదాలతో తెలుగు సమేతులు చెబుతుంటూ థియేటర్స్‌లో ఆడియన్స్ అంతా కడుపుబ్బా నవ్వుకున్నారు. అలాగే లైఫ్ జర్నీలో మనిషి ఎదుర్కొనే అనేక ఎమోషన్స్‌ని అందరి మనసుకి హత్తుకునేలా చూపించారు. మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 22న శంకర్ దాదా ఎంబిబిఎస్ థియేటర్స్‌లో రీ రిలీజ్ కానుంది. భారీగా అత్యంత ఎక్కువ థియేటర్స్‌లో విడుదల చేయడానికి డిస్ట్రిబ్యూటర్స్ ప్లాన్ చేస్తున్నారు. జె.ఆర్.కె పిక్చర్స్ ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొని వస్తోంది.

# 'అభినవ్' ట్రైలర్ విడుదల

శ్రీలక్ష్మి ఎడ్యుకేషనల్ చారిబుల్ ట్రస్ట్ సమర్పణలో సంతోష్ ఫిలిమ్స్ నిర్మిస్తున్న బాలలు చిత్రం 'అభినవ్'. భీమనగాని సుధాకర్ గౌడ్ నిర్మాత, దర్శకునిగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఫిల్మ్ ఛాంబర్‌లో రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్, నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్నకుమార్, నిర్మాత దామోదర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ను ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్ విడుదల చేశారు.

గ్రామీణ ప్రాంతాలలోని హరిజన, గిరిజన విద్యార్థులను సత్య అనే గంజాయి మాఫియా డాన్ విద్యార్థులతో గంజాయి స్మగ్లింగ్ చేస్తుంటాడు. బంటి అనే గిరిజన బాలుడు స్మగ్లర్ చేతిలో పావుగా మారి గంజాయి స్మగ్లింగ్ చేస్తుంటాడు. భారతి అనే అభ్యుదయ ఉపాధ్యాయురాలి ద్వారా ప్రేరణ పొందిన అభినవ్, రోహన్ అక్షర, ఇతర బాలబాలికలు ఎన్‌సీసీ, ఆర్మీ శిక్షణ పొందుతుంటారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ద్వారా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లిన గిరిజన విద్యార్థుల స్థితిగతులను గమనించిన డ్రగ్ మాఫియాను అంతం చేయడానికి ఆర్మీ తరహా శిక్షణ తీసుకుని గంజాయి మాఫియా డాన్ సత్య ద్వారా బందింపబడ్డ బాలకార్మికులు విముక్తి చేసి స్మగ్లర్‌గా మారిన బంటిని సత్యతమ్ముడైన విష్ణు, సామాజిక సంఘ సంస్కర్త విజయలక్ష్మి బంటిని మారుస్తారు. నిజం తెలుసుకున్న బంటి తన జీవితాన్ని నాశనం చేసిన సత్యను కాల్చి చంపుతాడు. ఈ చిత్రం యొక్క ప్రధాన ఉద్దేశం



బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించడం, గంజాయి మాఫియా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు బలి కాకుండా, విద్యార్థిదశ నుండే ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్‌లలో శిక్షణ పొంది దేశ రక్షణలో విద్యార్థులు కూడా భాగస్వాములు కావాలనేది ఈ చిత్రం కథ, ప్రధాన ఉద్దేశ్యం. ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో సమ్మెట గాంధీ, మాఫియా డాన్‌గా సత్య ఎర్ర, ప్రధాన బాలనటులు మాస్టర్‌గగన్, గీతాగోవింద్, అభినవ్, చరణ్, బేబీ, అక్షర, కెమెరా, సామరల భాస్కర్, సంగీతం - వందే మాతరం శ్రీనివాస్, ఎడిటర్- నందమూరి హరి, ఈ చిత్రాన్ని సారధి స్టూడియో యొక్క సహకారంతో పూర్తి చేయడం జరిగింది.





# ప్రొడక్షన్ నం8 గ్రాండ్ లాంచ్

మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ 13వ మూవీ విఎస్13, ఎస్ఎల్‌వి సినిమా బ్యానర్ ప్రొడక్షన్ నం8గా ప్రముఖ నిర్మాత సుధాకర్ చెరుకూరి నిర్మించనున్నారు. విశ్వక్‌ని ఫెరోషియస్‌గా ప్రజెంట్ చేసిన ప్రి లుక్ పోస్టర్ ద్వారా ఈ మూవీని ఇటీవల అనౌన్స్ చేశారు. డెబ్యూ టెంట్



శ్రీధర్‌గంటా రచన, దర్శకత్వం వహిస్తున్న విఎస్13లో విశ్వక్‌సేన్ హానెస్ట్ ఐపిఎస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. విలేజ్‌బ్యాక్‌డ్రాప్‌లో సాగేయూనిక్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం రూపొందనుంది. చిత్ర యూనిట్ పాటు మరికొందరు ప్రత్యేక అతిథుల సమక్షంలో ఈ సినిమా లాంఛనంగా ప్రారంభమైంది. నిర్మాతలు నాగవంశి ఈ సాహు గారపాటి స్క్రిప్ట్‌ని మేకర్స్ అందజేశారు. ముహూర్తం షాట్‌కు దర్శకుడు వశిష్ట క్లాప్ ఇచ్చారు. శ్రీకాంతనఓదెల కెమెరా స్విచాన్

# 'జీరో' గ్లింప్స్ లాంచ్

వెర్సటైల్ యాక్టర్ శివాజీ రాజా తనయుడు విజయ్ రాజా హీరోగా లక్ష్మీ నారాయణ.సి దర్శకత్వంలో ఓ స్పోర్ట్స్ డ్రామా రూపొందుతోంది. పాన్ ఇండియా మూవీ తెరకెక్కుతున్న ఈ సినిమాని సాయి విలా సినిమాస్ బ్యానర్‌పై ఆర్.లక్ష్మణ్‌రావు, ఆర్.శ్రీను గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. ఈ మూవీకి 'జీరో' అనే ఇంట్రస్టింగ్ టైటిల్ ఖరారు చేసిన మేకర్స్ గ్లింప్స్‌ని రిలీజ్ చేశారు. ప్రముఖ నటుడు. రచయిత తనికెళ్ల భరణి ఈ గ్లింప్స్‌ని లాంచ్ చేశారు. గ్లింప్స్ ఈవెంట్‌లో యాక్టర్ తనికెళ్లభరణి మాట్లాడుతూ, సినిమా పరిశ్రమలో శివాజీ రాజా ఆత్మబంధువు లాంటి వ్యక్తి. తనతో ఎన్నో యేళ్ల అనుబంధం వుంది. 'జీరో' గ్లింప్స్ చూశాను. చాలాబావుంది. సినిమాహీరోకి కావాల్సిన కసి విజయ్ రాజాలో కనిపించింది. మంచి కంటెంట్ వున్న సినిమా ఇది. డైరెక్టర్ చాలా ఎమోషనల్ తీశారు. నిర్మాతలు చాలా పాషన్‌తో ఈ సినిమా నిర్మించారు. వారికి తప్పకుండా అందరి ఆశీస్సులు ఉంటాయి. శివాజీ రాజాని ఎలా ఆదరించారో, నన్ను ఎలా గౌరవించారో.. విజయ్‌రాజాని కూడా అలానే ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను. తండ్రిలానేమంచి పేరు సంపాదించుకోవాలని ఆశిస్తున్నాను. ఈ సినిమాని అందరూ ఆదరించాలని కోరుకుంటున్నాను అన్నారు. యాక్టర్ శివాజీ రాజా మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. భరణి అన్నయ్యతో నాకు ఎంతో అనుబంధం వుంది. ఆయనకి డాక్టరేట్ రావడం చాలా ఆనందంగా వుంది.ఈ సందర్భంగా వారికి అభినందనలు. 'జీరో' గ్లింప్స్ నాకు చాలా నచ్చింది. ఈ సినిమా నిర్మాతలకు సినిమా అంటే చాలా ఫ్యాషన్. డైరెక్టర్‌గా అద్భుతంగా సినిమాని తీశారు. సాయి కార్తీక్ చాలా మంచి పాటలు ఇచ్చారు. సినిమా చాలా బావొచ్చింది. ప్రేక్షకులందరూ మా అబ్బాయిని ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను. థాంక్‌యూఅన్నారు. హీరో విజయ్ రాజా



మాట్లాడుతూ.. ఈ ఈవెంట్‌కి వచ్చి మాకు సపోర్ట్ చేసిన తనికెళ్ల భరణికి థాంక్ యూసోమచ్. నన్ను చిన్నప్పటి నుంచి సపోర్ట్ చేసిన అమ్మానాన్నలకు థాంక్ యూ. సాయి కార్తిక్ అద్భుతమైన ఆల్బం ఇచ్చారు. దర్శక నిర్మాతలకు థాంక్. ఈ సినిమా కోసం అందరం చాలా కష్టపడ్డాం. తప్పకుండా ఈ సినిమా మీ అందరినీ అలరిస్తుందనే నమ్మకం వుంది అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ సాయి కార్తిక్ మాట్లాడుతూ, నిర్మాతలు చాలా ఫ్యాషన్‌తో ఈసినిమాచేశారు. విజయ్ సూపర్‌గా పెర్మార్మ్ చేశారు. ఒక అథ్లెట్ ఎదుర్కొనే సవాళ్లని చాలా అద్భుతంగా చూపించారు. ఈ సినిమా పెద్దహిట్ కావాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ లక్ష్మినారాయణ. సి.. మన స్పోర్ట్స్‌లో వుండే పాజిటివ్స్, నెగిటివ్స్‌ని బేస్ చేసుకొని ఫ్యామిలీ ఎమోషన్స్, లవ్, స్పోర్ట్స్ డ్రామాగా ఈ సినిమాని తీశాం. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా చేసే అవకాశం ఇచ్చిన నిర్మాతలు, హీరో విజయ్ రాజాకి థాంక్‌యూ. ఈసినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుంది అన్నారు. నిర్మాత ఆర్.శ్రీను మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఇది మాప్రొడక్షన్ నంబర్.2. విజయ్ రాజా ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. షూలేకుండా పరిగేత్తేవారు. ఆయన కష్టం చూస్తే చాలా ఎమోషనల్‌గా కనిపించింది. సినిమా తప్పకుండా అందరికీ కనెక్ట్ అవుతుంది' అన్నారు. నిర్మాత ఆర్.లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ. ఈ సినిమాలో అందరికీ కనెక్ట్ అయ్యే ఇంట్రస్టింగ్ పాయింట్‌వుంది. మనం అందరం ఏదోఒక స్పోర్ట్ ఆడే వుంటాం.

# 'జై జవాన్' ట్రైలర్

సంతోష్ కల్వచెర్ల కథా నాయకుడిగా పావని రామిశెట్టి కథా నాయికగా ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి, సత్యప్రకాస్, నాగినీడు, విజయ్ రంగరాజు, అప్పాజీ అంబరీష్, బిహెచ్ఇఎల్ ప్రసాద్, బలగం సంజయ్, బాల పరంసార్, సంజన చౌదరి ముఖ్యతారలుగా రూపొందిన ఇండిపెండెంట్ ఫిల్మ్ 'జై జవాన్'. నాగరబాబు పోటు దర్శకత్వంలో కేఎస్ క్రియేషన్స్ పతాకంపై ఈశ్వరి కుమారి సమర్పణలో సందిరెడ్డి శ్రీనివాస్‌రావు, పోసం మధుసూదర్ రెడ్డి, పోటు వెంకటేశ్వర్లు ఈ చిత్రాన్ని నిర్మించారు. దేశభక్తి నేపథ్యంలో దేశ సరిహద్దుకు రక్షణగా నిలుస్తున్న సైనికుడి గొప్పదనాన్ని తెలియజేసే కథాంశంతో రూపొందిన ఈ చిత్రం కాన్సెప్ట్ నచ్చి ఈ చిత్ర ట్రైలర్‌ను ఇండిపెండెన్స్ డే సందర్భంగా ప్రముఖ దర్శకుడు గోపీచంద్ మలినేని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చిత్రం కాన్సెప్ట్ తనకు నచ్చిందని, ట్రయిలర్ చూస్తుంటే దేశభక్తి నేపథ్యంలో రూపొందిన గొప్ప చిత్రంలా ఈ సినిమా వుండబోతుందని, ఇలాంటి ఇండిపెండెట్ ఫిల్మ్ విజయం సాధించాలని, ఈ సినిమా ద్వారా ఈ టీమ్ అందరికీ మంచి పేరును తీసుకురావాలని ఆయన విషెస్ అందజేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో సైనికుడి గొప్పతనం గురించి తెలియజేశాం. సంతోష్ కల్వచెర్ల హీరోగా చక్కని ప్రతిబను కనపరిచాడు. ఆయనకు హీరోగా మంచి భవిష్యత్ వుంది. మా ట్రైలర్‌ను ఆవిష్కరించి, మాకు విషెష్ అందజేసిన గోపీచంద్ మలినేనికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఫైట్ మాస్టర్స్‌రామ్ లక్ష్మణ్‌లు కూడా పాల్గొన్నారు. ఇక ఈ ట్రైలర్ చూస్తుంటే దేశభక్తి వున్న ప్రతి ఒక్కరిని ఆలోచింపజేసే విధంగా, సైనికుడు ఈ దేశంకోసం తమ జీవితాలను ఎలాత్యాగం చేస్తున్నారో కళ్లకు కట్టినట్లు చూపించారు. ప్రాణం తీసి ఆయుధాలంటే భయంలేదు. చావుకోరే శత్రులుంటే కోపం రాదు అంటూ తనికెళ్ల భరణి చెప్పిన సంభాషణ .. జన్మనిచ్చిన తల్లిదండ్రుల రుణాన్ని, జీవితానిచ్చిన మాతృభూమి రుణాన్ని తీర్చుకునేదిఒక జవాను మాత్రమే అని సాయికుమార్ చెప్పిన డైలాగులు వింటుంటే గూస్‌బపంప్స్ వచ్చే విధంగా వున్నాయి.ఇండిపెండెన్స్ డే సందర్భంగా విడుదల చేసిన ఈ ట్రైలర్ అందర్ని ఆకట్టుకుంటుంది.



# 'పరాక్రమం' ట్రైలర్ రిలీజ్ ఈవెంట్

బిఎస్‌కె మెయిన్ స్ట్రీమ్ పతాకంపై బండి సరోజ్ కుమార్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పరాక్రమం'. శృతి సమన్వి, నాగలక్ష్మి, మోహన్ సేనాపతి, నిఖిల్ గోపు, అనిల్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా సెన్సార్ నుంచి యు/ఎ సర్టిఫికేషన్ పొందింది. ఈ నెల 22న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. ఈ రోజు 'పరాక్రమం' సినిమా ట్రైలర్ రిలీజ్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో సందీప్ కిషన్, నిర్మాత ఎస్‌కేఎన్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సరోజ్ మాట్లాడుతూ, 'పరాక్రమం' ట్రైలర్ లాంచ్‌కు వచ్చిన నా మిత్రుడు ప్రొడ్యూసర్ ఎస్‌కేఎన్, హీరో సందీప్ కిషన్‌కు థాంక్స్ చెబుతున్నా. ప్రతి కామన్ మ్యాన్‌కు కనెక్ట్ అయ్యే సినిమా. ఈ పోస్టర్లలో మీకు సత్తిబాబు, లోవరాజు అనే రెండు క్యారెక్టర్స్ కనిపిస్తున్నాయి. లోవరాజు తండ్రి సత్తిబాబు ప్రతి ఒక్కరిలో సత్తిబాబు ఉంటారు. లోవరాజు తండ్రి సత్తిబాబు. ప్రతి ఒక్కరిలో సత్తిబాబు ఉంటాడు.సత్తిబాబు నుంచి లోవరాజు జరిగే ట్రాన్స్‌ఫర్మేషన్ ఈ సినిమా. కామన్ మ్యాన్‌లా బతకడంకష్టం. మీ లైఫ్‌లో హీరోలు ఉంటారు విలన్స్‌ఉంటారు. ఎన్నో భావోద్వేగాలు ఉంటాయి. అవన్నీ మిమ్మల్ని మీరు తెరపై చూసుకున్నట్లు పరాక్రమం సినిమా ఉంటుంది. నేను అభిమానించే చిరంజీవి పుట్టినరోజు 'పరాక్రమం' రిలీజ్ చేసుకోవడం సంతోషంగా ఉంది. చిరంజీవిని చిరంజీవి అనే పిలుస్తా. ఆయనకు భారతరత్న కూడా చిన్నదే అనేది నా అభిప్రాయం. చిరంజీవి అంటే శిఖరం. ఆయన హీరోగా నాలాంటి ఎంతో మందిని ఇన్స్‌ఫైర్ చేశారు అన్నారు. హీరో సందీప్‌కిషన్ మాట్లాడుతూ, బండిసరోజ్ కుమార్ చాలా జెన్యూస్ ఫిలింమేకర్. ఆయన వ్యక్తిత్వం కూడా అలాగే ఉంటుంది. ఆయన సినిమా ఈవెంట్స్ రొటిన్‌గా వుండవు. నేను చెన్నైలో పొర్కాలం అనే సినిమా చూసి ఎవరీ దర్శకుడు అనుకుని ఆశ్చర్యపోయా. ఆయన బండి సరోజ్‌కుమార్. ఆ తర్వాత ఆయనను ఫేస్‌బుక్‌లో వెతికి మరీ టచ్‌లోకి వెళ్లా. మనం ఇండస్ట్రీలోకి గెలవడానికే రాము. ఇదొక ప్రయాణం. ప్రేక్షకుల అభిమానం పొందడానికి ప్రయత్నిస్తుంటా. బండిసరోజ్‌కుమార్ అలాంటి జర్నీ చేస్తున్నారు.ఆయన సినిమాలు యూట్యూబ్‌లో చూసి నేను డబ్బులు పంపించాం. నాకు తెలిసిన వారితో పంపించాం. నేను లౌక్యానికి లొంగుతాను. బండి సరోజ్ కుమార్ లొంగడు. స్వచ్ఛంగా సినిమాలు చేస్తుంటాడు. పరాక్రమం ఒక జెన్యూన్ ఫిల్మ్. ఈసినిమా మీాదరణపొందాలి. ఆయనకు ఆయన సినిమాలకు సపోర్ట్ చేసేందుకు నేనెప్పుడూ సిద్ధంగా ఉంటాను అన్నారు. నిర్మాత ఎస్‌కేఎన్ మాట్లాడుతూ, బండి సరోజ్‌కుమార్ డైరెక్టర్ నటుడిగానాకుఇష్టం. ఆయన టాలెంటెడ్ ఫిలిం మేకర్. బండి సరోజ్‌కుమార్ మాంగల్యం వంటి సినిమాలు చూసి





నేనూ డబ్బులు పంపాను. పరాక్రమం సినిమా మన మెగాస్టార్ చిరంజీవి బర్త్‌డే ఆగస్టు 22న రిలీజ్ అవుతుంది. ఈ సినిమాకు నా వంతు సపోర్ట్ ఎప్పుడూ ఉంటుంది. పరాక్రమం సినిమా బ్లాక్ బస్టర్ అయినా, సూపర్ హిట్‌అయినా, యావరేజ్ అయినా నేను బండిసరోజ్‌కుమార్‌తో సినిమా ప్రొడ్యూస్ చేయబోతున్నా. ఎందుకంటే నాకు ప్రతిభ గలకొత్తవారితో పనిచయడం ఇష్టం. ఆయన లాంటి ప్రతిభావంతులు ఇండస్ట్రీలో ఎదగాలి. పరాక్రమం వంటి చిత్రాలు ఆదరణ పొందితేనే ఇండస్ట్రీ బాగుంటుంది. థియేటర్స్ సర్వైవ్ అవుతాయి. ఈ సినిమా మంచి సక్సెస్ కావాలని కోరుకున్నా అన్నారు.ఈ కార్యక్రమంలలో పరాక్రమం చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

# అతి ఏదైనా ప్రమాదమే !

**ఆ మాయంలో పడ్డారో...**
ఆ బుల్లి పెట్టేలో ఏ మాయ ఉందో కానీ, నెలల పిల్లాడైనా కళ్ల ముందు మొబైల్ కనపడితే దానివైపు సమ్మోహనంగా చూస్తాడు. ఆ రంగుల కాంతి సహజంగానే వారిని ఆకర్షించేస్తుంది. అంతెందుకు ఒక అబ్బాయికి ఏడాదే. ఫోన్ చకచకా వాడేస్తాడు. తనకు



నచ్చిన వీడియోలు వాడే పెట్టుకుంటాడని గొప్పగా చెప్పుకొంటాం కానీ అది ఆ చిన్న బుర్రలపై చూపే చెడు ప్రభావం చాలానే. జపాన్‌కి చెందిన ఓ విశ్వవిద్యాయలం చేసిన అధ్యయనం.. ఫోన్‌కి అలవాటుపడ్డ రెండేళ్లలోపు చిన్నారుల్లో కమ్యూనికేషన్, సమస్యా పరిష్కార నైపుణ్యాల్లో లోపాలు కనిపిస్తున్నాయని చెబుతోంది. రోజులో గంటకు మించితే చుట్టూ ఉన్నవాళ్లతో గడపడానికీ చిన్నారులు ఇష్టపడటం లేదంటోంది మరో పరిశోధన. మరీ చిన్నపిల్లల్లోనే ఈ సమస్య కాస్త పెద్దవాళ్లకు పర్లేదు అనుకుంటున్నారేమో! కాస్త ఆఫోన్ పక్కనపెట్టు అన్నప్పుడు పిల్లలు మనకే ఎదురు తిరగడం, ఏడవడం, అరవడం లాంటివి గమనించారా? అది వాళ్ల మెదడుపై చూపుతున్న తీవ్ర ప్రభావానికి నిదర్శనమే అంటారు నిపుణులు. ఫోన్ టివి, ట్యాబ్, కంప్యూటర్ అన్నీ ఈ కోవలోకి వచ్చేవే. చదువు, పరిజ్ఞానం పెంచుకుంటారని మనం చేతికందించే ఆ సాంకేతికత ఒత్తిడి, ఊబకాయం, నిద్రలేమి లాంటి ఎన్నో తీవ్ర ప్రభావాలకు కారణమవుతోంది.

**ఎలా దూరం చేద్దాం ?...** ఇంట్లో స్క్రీన్ ఫ్రీ జోన్స్ ఏర్పాటు చేయండి. భోజనం, పడక గదుల్లో ఫోన్ వాడటం నిషిద్ధమ నండి. అయితే అది పెద్దవాళ్లూ పాటించాలి. వారానికోసారి మీరు 'డిటాక్స్ డే పాటించి, వాళ్లతో గడిపితే సరి. మిమ్మల్ని ఆదర్శంగా తీసుకొని వాళ్లూ పాటిస్తారు. ఏమీ తోచడం లేదు పిల్లలు తెర సమయం కోసంచూపే సాకే ఇది. దాన్ని దూరం చేయడానికి ఇతర వ్యాపకాలను పరిచయం చేయండి. పుస్తకాలు చదివించండి. వాళ్లకు నచ్చినవి వాళ్లనే ఎంచుకోనిస్తే సరి. మరీ చిన్నపిల్లలైతే రంగు వేయడా ప్రోత్స హించొచ్చు. దెబ్బలు తగిలించు కుంటారు. అలర్జీలొస్తాయని ఆటలకు దూరం చేయొద్దు. ఆడనివ్వండి. నలుగురితో కలవనివ్వండి. శరీరానికీ వ్యాయామం, సామాజిక నైపుణ్యాలూ అలవడతాయి. షాపింగుకి వెళ్లినపుడో, ఇంటికెవరైనా అతిథులొస్తేనో మిసిగించకుండా ఉంటారనీ ఫోన్ చేతికిస్తాం. కానీ సైబర్ వలలో పడేది అప్పుడు. తీరా వాళ్లేదో తెలియక నొక్కినా, డబ్బులు పోయినా నిందిస్తూ కూర్చుంటాం. ఇల్లంతా చెత్త అను కోకుండా బొమ్మలు, వాళ్ల మెదడును పరీక్షించే ఆటవస్తువులు, పజిళ్లు కొనిస్తే సరం. వీలుండే సంభాషణల్లో వస్తువుల ఎంపికలో వాళ్ల అభిప్రాయాలకీ చోటివ్వండి. ఖర్చు, నాణ్యత వంటివి చర్చిస్తే భవిష్యత్తులో వాళ్లకీ ఉపయోగ పడతాయి. వద్దు అన్నవి పిల్లలను మరింత ఆకర్షిస్తాయి. అందుకే అవే కావాలంటారు. కాబట్టి, వద్దన్న రోజులో స్క్రీన్ సమయంఇంత 'సేపే'నన్న నిబంధన పెడితే. అయితే అదీ గంటకు మించొద్దు. దీనికోసం సమయం పూర్తయ్యాక ఫోన్ దానంతట అదే ఆఫ్ అయ్యేలా, ఏం చూస్తున్నారో అన్న బెంగ లేకుండా పేరెంటల్ కంట్రోల్ యాప్‌లు ప్రయత్నించవచ్చు. □

# వరలక్ష్మి వ్రత వైభవం



**దివ్య తేజోవంతమైన కాంతి కిరణాలతో భూమిని పరిపాలిస్తున్న శ్రీమహావిష్ణువు యొక్క అర్థాంగి అవనిపై అడుగడుగునా దర్శనమిచ్చే ఆమె మరో రూపం మనం చలామణిలో నిత్యం మన అవసరాలు తీర్చుకుంటున్న ధనం. ఆ ధనలక్ష్మిని ప్రత్యేక విధానంలో సేవించుకునే పర్వదినం శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం.**
శ్రావణమాసం పూర్తి విష్ణు సంబంధ మాసం. కలియుగంలో వెలిసిన తిరుమలేశుని జన్మ నక్షత్రమైన శ్రవణం అనుసరించి వచ్చిన మాసం శ్రావణమాసం. ఈ మాసంలోనే ద్వారకానాథుని జన్మతిథి మొదలగు ప్రత్యేక విశేషాంశాలు కలిసిన మాసం మరియు సాక్షాత్తు లక్ష్మీదేవికి ప్రీతికరమైన మాసం. గౌరీ సంబంధ వ్రతములు చేపట్టి నిత్య సుమంగళిగా జీవితాన్ని ప్రసాదించమని ఆ పార్వతీదేవిని అభ్యర్థించే ఈ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చు శుక్రవారం సముద్రరాజు కుమార్తె, శ్రీరంగుని అర్థాంగిగా విష్ణువు వనసులో ప్రతిష్ఠింపబడిన లక్ష్మీదేవిని వరలక్ష్మిగా సమస్త దేవతలు, మానవులు కొలుచుకుందురు.



ఈ వ్రతమును సంకల్పించుకునేవారు ముందురోజు ఇల్లూ, వాకిలీ శుభ్రం చేసుకొని, గడపలకు పసుపు కుంకుమలు అద్ది, గుమ్మానికి మామిడి తోరణాలు కట్టి సిద్ధం చేసుకోవాలి. సూర్యోదయానికి ముందే మహాలక్ష్మి ప్రతీ ఇంటికి తిరుగుతూ,. ఏ ఇంటి ముంగిట అలికి, ముగ్గులతో అలంకరించి వుంటుందో, ఆ ఇంటిలోనికి ప్రవేశిస్తుందని విష్ణుపురాణంలో చెప్పినట్లు తెలుస్తోంది. అంతులేని ఐశ్వర్యానికి, సిరిసంపదలకు, పుత్ర పౌత్రాభివృద్ధికి, కీర్తి ప్రతిష్టలకు విద్యావ్యాపారాభివృద్ధికి తోట్పాటు నందించే మహత్తర వ్రతము వరలక్ష్మి వ్రతము. భూలోకంలో ప్రతీ హైందవ స్త్రీ తప్పక ఆచరించదగినది. అమ్మ ఆశీస్సులు అందుకొను అవకాశం కలిగినది. శ్రావణ శుక్రవారము వ్రతము. అయితే విధి విధానాలు పాటిస్తూ ఈ శ్రావణమాస శుక్రవారాలు మహాలక్ష్మిని భక్తిశ్రద్ధలతో పూజిస్తూ ప్రత్యేకించి పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారము జరుపుకునే వరలక్ష్మి వ్రతము అత్యంత ఫలదాయకమైనది.
ఈ వ్రతమును ఆచరించు స్త్రీలు సూర్యోదయానికి పూర్వమే నిద్రలేచి తలకు నువ్వులనూనె రాసుకొని ముఖమునకు,కాళ్లకు మంగళ సూత్రములకు పసుపు రాసుకొని స్నానాధికాలు ముగించుకొని, పరిశుభ్రమైన వస్త్రము ధరించి పూజ ప్రారంభం చేయాలి. ఈ పూజ చేయు మహిళలు వ్రతము పూర్తియగువరకు నిరాహారముగా నుండి పూజ జరుపవలెను. చక్కటి కలశను ఏర్పాటు చేసుకోవలెను. ఒక కొబ్బరి కాయను ఎంచుకొని, పసుపురాసి, కుంకుమతో అలంకరించి, రాగి, వెండి, ఇత్తడి, బంగారంతో చేసిన ఏదో ఒక పాత్రను తీసుకుని పవిత్రమైన నీటితో కాని, బియ్యంతోకాని నింపి, దానికి సిద్ధం చేసుకున్న కొబ్బరికాయను అమర్చి, ఆ కొబ్బరిపై క్రొత్త వస్త్రం చుట్టవలెను, కలశమునకు చీర కట్టే అలవాటు ఉన్నట్లయితే, కొంచెం పెద్ద కలశ తీసుకుని, దానిని అలంకరించుకోవచ్చును. మనం గుర్తుంచుకోవలసినది భక్తి ప్రదానము. పూజలకు సిద్ధం చేసుకొన్న స్థలంలో వరలక్ష్మిని నిలిపి, యధావిదిని ఆరోజువున్న మంచి సమయంలో పూజ చేయాలి. శక్తిని అనుసరించి అష్టోత్తరంతో కాని, సహస్రంతో గాని పూజ చేసుకొనవచ్చును. పోషశ పూజ మాత్రం విధిపూర్వకంగా చేయాలి. లభ్యతను అనుసరించి తొమ్మిది రంగుల పువ్వులు, నవధాన్యాలు ఉపయోగించటం శ్రేష్టము. పూజలో నవ తోరం గ్రంధి పూజ చేయాలి. ఇందులో 9 ముడులు ప్రధానము ఏదైనా ఒక రకం పువ్వులను ఉపయోగించవచ్చును లేదా తొమ్మిది రకములు పుష్పములతో చేసుకొనవచ్చును. తోరగ్రంధికి ప్రత్యేక మంత్రముతో అర్చించి ధరించవలెను. వ్రతఫలము సంపూర్ణముగా లభించుటకు, ఆ వరలక్ష్మి అనుగ్రహం సిద్ధించుటకు మూడు తోరములను తయారుచేసుకొని, సాక్షాత్తు అమ్మవారిగా భావించే పుణ్యస్త్రీకి ఒకటి, వరలక్ష్మికి ఒకటి, తాను ఒకటి ధరించవలెను.
తోరం ధరించేటప్పుడు పఠించవలసిన మంత్రము
**బధ్నామి దక్షిణ హస్తే నవసూత్రం శుభప్రదం పుత్రపౌత్రాభివృద్ధించ దేహిమే రమే.** పూజకు సిద్ధం చేసిన స్థలంలో తమలపాకులోగాని, వెండి పళ్ళెంలో గాని, రాగి పళ్లెంలోగాని పసుపు గణపతిని పెట్టి, పూజ ప్రారంభించాలి. 'శుక్లాంభరం ధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే అని



ఆదిదేవుని ప్రార్థించి అనంతరం మహాలక్ష్మిని వ్రతనియమానుసారంగా పూజించి, నైవేద్యాన్ని భక్తితో సమర్పించవచ్చును. ఫలములు, పాయసము, పాలు తేనె మొదలైనవి సమర్పించవచ్చును. అలాగే పూజావిధిలో వస్త్రం సమర్పించేటప్పుడు పట్టు వస్త్రాన్నే సమర్పించనవసరం లేదు. అందుబాటులోని కొత్త వస్త్రం ఏదైనా సమర్పించేటప్పుడు పట్టు వస్త్రాన్నే సమర్పించనవసరం లేదు. అందుబాటులోకి కొత్త వస్త్రం ఏదైనా సమర్పించవచ్చును. ఆభరణ సమర్పణ విషయంలో కూడా స్వర్ణాభరణముల అవసరం లేదు. వాటి స్థానంలో మంచి పుష్పాలు సమర్పించవచ్చును. విధివిధానం ప్రకారం, భక్తితో, వరలక్ష్మిని పూజించినట్లయితే, సంపదలు సౌభాగ్యము సిద్ధిస్తాయి. పూజానంతరము సూత పౌరాణికుడు, శౌనకాది మహర్షులద్వారా పరమేశ్వరుడు పార్వతీదేవికి చెప్పిన చారుమతిదేవి కథను చదువవలెను. కథను చదివేటప్పుడు అక్షతలు చేతిలో నుంచుకొనవలెను. తరువాత అక్షతలు అమ్మవారి పాదాలవద్దనుంచి, వాటిని శిరస్సుపై ధరించవలెను. ఆ వరలక్ష్మీ దేవికి నవవిధ ప్రదక్షిణలు చేసినట్లయితే, ఒక్కొక్క ప్రదక్షిణకు ఒక్కక్క ఫలితము సంప్రాప్తిసుంది. మహాలక్ష్మి అనుగ్రహం కోసం ముత్తయిదువులకు వాయనం ఇవ్వవలెను.
**వాయన విధిః** ఏవం సంపూజ్య కల్యాణీం వరలక్ష్మీం స్వశక్తతః దాతవ్యం ద్వాదశాపూపం వాయనం పిద్విజాతయే!!
**వాయనదాన మంత్రముః** ఇందిరా ప్రతిగృహ్ణాతు ఇందిరా వైదదాతిచ, ఇందిరా తారకోభాభ్య మిందిరాయై నమో నమః
ఈ వాయనంలో పరావర్తనము చెందిన అనగా నానబెట్టిన శనగలు, రెండు పళ్ళు, అరటి పళ్ళు లేక నారికేళం, 5 తమలపాకులు, 2 వక్కలు, పదకొండు రూపాయల దక్షిణ, 5 లవంగాలు, 5 ఏలకులు, గాజులు, కాటుక, పసుపు, కుంకమలు, కలిగినచో చీర లేక జాకెట్టు, సిద్ధం చేసిన తోరంగ్రంది, పుష్పములు వాయనముగా దానమిచ్చి, వారినుంచి అమ్మవారి తరఫున ఆశీర్వచనం పొందవలెను.

**అనంతా వైష్ణవీ వ్యక్తా విశ్వానందా వికాసినీ**
**శక్తిర్విభిన్న సర్వార్తిః సముద్రపరితోషిణీ.**
సర్వం సన్మాంగళాని భవస్తు. సర్వం వరలక్ష్మీ దేవతార్పణమస్తు.

**- డాక్టర్ దేవులపల్లి పద్మజ**

# అందంగా ముఖం



ముఖం అందంగా ఉండాలంటే పార్లర్‌ల వద్దకే వెళ్లాల్సిన పనిలేదు. మన ఇంట్లో దొరికే వాటితోనే చక్కటి నిగారింపును సొంతం చేసుకోవచ్చు. పైగా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. అందుకోసం ముఖంపై కాస్త శ్రద్ధ పెట్టి ఇంట్లో ఉంటే సహజసిద్ధమైన వాటిని అప్లై చేసి మచ్చలేని చందమామలా ఉండే ముఖాన్ని సొంతం చేసుకుండి.
అందకు ఈ సింపుల్ రెమిడీస్‌ని ఫాలోకండి.
- రోజూ పెదవులకు కాస్తంత మీగడ రాసిన సున్నితంగా మర్దన చేస్తే పదవులు పగడలకుండా గులాబీ రేకుల్లా మెరుస్తాయి.
- ముఖాన్ని రోజుకు రెండు మూడుసార్లు గోరువెచ్చటి నీటితో కడుక్కునిఇ పొడి టబల్‌తో చక్కగా తుడిచేస్తే మొటిమల వంటివిరావు.
- లేత కొబ్బరిని మెత్తగా మెదిపి ముఖానికి ప్యాక్‌లా వేసుకుని, ఆరిన తర్వాత కడిగేసుకుంటూ ఉండాలి. ఇలా చేస్తుంటే ముఖం చక్కగా అందంగా కనబడుతుంది.
- రకరకాల షాంపూల బదులు కుంకుడు కాయ రసం లేదా సీకాయ పొడితో తలస్నానం చేయడం వల్ల చుండ్రు, కేశ సంబంధమైన సమస్యలు రాకుండా జుట్టు ఆరోగ్యంగా నిగనిలాడుతుంది.
- . తల స్నానం పూర్తయిన తర్వాత, చివరి మగ్గు నీటిలో కొంచెం నిమ్మరసం కలిపి తలమీద పోసుకుంటే జుట్టు, చర్మ సమస్యలు రావు. □

# శనగపప్పు పూర్ణం



**కావలసినవి** : శనగపప్పు, మినపగుండ్లు, బెలనం-1, కప్పు చొప్పున, బియ్యం-ఒకటింబావు కప్పు, ఉప్పు-తగినంత, నెయ్యి-చెంచా, యాలకుల పొడి-చిటికెడు, నూనె-వేగడానికి సరిపడా

**తయారీ :** మినపగుండ్లు, బియ్యం, శనగపప్పులను విడివిడిగా నానబెట్టాలి. 4 గంటల తర్వాత ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్‌చేసి 2 గంటల తర్వాత ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేసి 2 గంటలు పక్కన ఉంచాలి. శనగపప్పును కుక్కర్‌లో 4 విజిల్స్ వచ్చే వరకు ఉడికించి, నీరు వడకట్టాలి. చల్లారాక పప్పు గుత్తితో మెదపాలి లేదా మిక్సీలో బరకగా వచ్చేట్టు గ్రైండ్ చేసుకోవాలి. అదే కుక్కర్‌లో పప్పుతో పాటు బెల్లం వేసి చిన్నమంట మీద కలుపుతూఉడికించాలి. ఇందులో యాలకుల పొడి వేసి, పిండి గట్టి పడుతున్నప్పుడు నెయ్యి వేసి దించాలి. చల్లారాక మనకు కావలసిన సైజులో ఉండలు చుట్టి, తయారు చేసుకున్న పిండిలో ముంచి కాగిన నూనెలో బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. □

# చిన్న మనసులపై భారం..

**పరీక్షలు దగ్గరికొస్తు న్నాయి. ఆటలు చాలించు, ఫలానా ప్రశ్నకి సమాధానం చెప్పు, ఎన్నిసార్లు చదివించా? ఇంకా రాలేదా..** ప్రతి ఇంట్లో దాదాపుగా వినిపిస్తున్న మాటలే కదూ! కాస్త పెద్ద పిల్లలు పరీక్షలంటే భయపడతారని తెలుసు. కానీ మనం కంగారుపడి చిన్ని మనసులపైనా భారం పెంచేస్తున్నామని తెలుసా? వాళ్లకేం ఒత్తిడి అని తీసిపారేయక.. కొన్ని జాగ్రత్తలు పాటించమంటు న్నారు నిపుణులు.



...మూడు, నాలుగు తరగతుల వరకూ పరీక్షలంటే చిన్నారులకు సాధారణ విషయమే! అమ్మో పరీక్షలు, మార్కులు తక్కువొస్తే అప్పుడు చెబుతా' అంటూ మనం కంగారుపడి, భయపెట్టడంతో వాళ్లూ దాన్నో బూచిలా చూడటం మొదలుపెడతారు. ఏడాదంతా చదివింది రివిజన్ చేయించాలన్నది మీ తాపనరతయం. నిజమే కానీ, ఆ చిన్న బుర్రలు ఆ సమాచారం మొత్తం నింపలేక ఎంత కంగారు పడతాయో గమనించారా? తీరా అసలు సమయానికి వచ్చే సరికి పొర పాట్లు చేస్తుంటారు.
- మనమేమో సీరియస్‌గా చెబుతుంటామా.. వాళ్లేమో అనాసక్తిగా, అయిష్టంగా రాయడం, చదవడం చేస్తుంటారు. అప్పుడు కోపం నషాళానికి అంటుతుంది కదూ! ఓసారి ఆలోచించండి. ఉదయాన్నే హడావుడిగా స్కూలుకి వెళ్లి. అన్ని గంటలు తరగతుల్లో కూర్చొని వస్తారు. ఇంటికి రాగానే గబగబా స్నామంటూ బాత్రూమ్‌లోకి తరిమేస్తాం. ఏదో కొద్దిగా తినిపించి వెంటనే పుస్తకాలు పట్టుకోమంటే వాళ్లకి మాత్రం విసుగు రాదా?
- నీరసంగా, నిద్రమత్తుతో కనిపించడం లాంటివి కనిపిస్తే సరిగా తినట్లేదు, త్వరగా నిద్రపోవట్లేదు అని అరిచేస్తాం కానీ.. ఆ చిన్ని బుర్రదలు భారం మోయలేకపోతున్నాయి అనడానికి సంకేతాలే. అంతెందుకు, పట్టుమని పదేళ్లు లేని పిల్లలు నిద్ర రావట్లేదంటూ మారాం చేయడం, రాత్రుళ్లు పదే పదే లేవడం, పగలు క్లాసులో పడుకోవడం.. ఒత్తిడి సూచనలే.
- తలనొప్పి, కడుపులో నొప్పి అంటే సాకులు చెబుతున్నారని కొట్టిపారేయొద్దు. నేషనల్ హెల్త్ సర్వీస్ ప్రకారం.. పరీక్షల ఒత్తిడి వారి జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపుతుందట. ఫలితమే కడుపుబ్బరం, నొప్పి, అజీర్తి వగైరాలన్నీ, కొందరిలో ఆకలి మందగించడం, వాంతులు, విరోచనాలకీ దారితీస్తుంది. మరేం చేయాలి? అలాగని వదిలేయలేం కదా అంటారా? □

# పొడిబారిన చేతులు మృదువుగా..

**మనం రోజూ నీటితో చేసే వివిధ పనులు కారణంగా చేతులు తేమను కోల్పోయి పొడిబారిపోతాయి. నిర్జీవంగా మారి పోతాయి. మరి దీనికి పరిష్కారం.. ఇంట్లోనే లభించే కొన్ని పదార్థాలే అంటున్నారు నిపుణులు. వాటి గూర్చి తెలుసుకుందాం..**



- ఆలివ్ ఆయిల్, చక్కెరలతో తయారుచేసిన స్క్రబ్ పొడిబారిన చేతులను కోమలంగా మార్చడంలో సహకరిస్తుంది. ఇందుకోసం అరకప్పు చక్కెరలో టేబుల్‌స్పూన్ ఆలివ్ నూనె వేసుకొని బాగా కలుపుకోవాలి. అవసరమైతే ఇందులో కొన్ని చుక్కల ఏదైనా అత్యవసర నూనె కూడా వేసుకోవచ్చు. ఇప్పుడు ఈ మిశ్రమం కొద్దిగా తీసుకొని దాన్ని చేతులపై రాసుకొని రెండు నిమిషాల పాటు మృదువుగా మర్దన చేయాలి. ఆపై గోరువెచ్చటి నీటితో కడిగేసుకుంటే సరిపోతుంది. ఇలా రోజూ చేయడం వల్ల కొన్ని రోజుల్లోనే పొడిబారిన చేతులు తిరిగి కోమలంగా మారతాయి.
- నిమ్మకాయను రెండు ముక్కలుగా కట్ చేయాలి. ఈ ముక్కల్ని చక్కెర పొడిలో అద్దుతూ చేతులు, మణికట్టుపై ఇరవై నిమిషాల పాటు మృదువుగా రుద్దుకోవాలి. ఆపై చల్లటి నీటితో కడిగేసుకోవాలి. పాదాలు పొడిబారినా ఈ చిట్కా ఉపయోగించచ్చు. అయితే ముఖానికి మాత్రం దీన్ని ఉపయోగించద్దంటున్నారు నిపుణులు. ఎందుకంటే సున్నితంగా ఉండే ముఖ చర్మంపై నిమ్మకాయను నేరుగా అప్లై చేయడం వల్ల చర్మం డ్యామేజ్ అయ్యే అవకాశాలు ఎక్కువంటున్నారు.




- .కలబంద గుజ్జు సహజసిద్ధమైన మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. దీన్ని చేతులకు రాసుకొని ఇరవై నిమిషాల పాటు ఉంచుకొని కడిగేసుకోవాలి. ఇలా తరచూ చేయంవల్ల చేతులు పొడిబారడం తగ్గుతుంది.
- పొడిబారిన చేతుల్ని కోమలంగా మార్చే సుగుణాలు తేనెలో పుష్కలంగా ఉన్నాయి. కాబట్టి రోజూ కొద్దిగా తేనె తీసుకొని చేతులకు రాసుకోవాలి. ఇలా అరగంట పాటు ఉంచుకొని ఆపై గోరువెచ్చటి నీటితో కడిగేస్తే చక్కటి ఫలితం ఉంటుంది.
- పొడిబారిన చేతులకు తేమను తిరిగి అందించడంలో కోడిగుడ్డులోని పచ్చసొన బాగా ఉపయోగపడుతుంది. ఇందుకోసం ముందుగా గుడ్డులోని పచ్చసొనను ఒక బౌల్‌లోకి తీసుకొని అది మిశ్రమంగా మారేంత వరకు బాగా కలుపుకోవాలి. ఇప్పుడు దీన్ని చేతులకు, మణికట్టుపై పట్టించి అరగంట పాటు అలాగే ఉంచుకోవాలి. ఆపై సబ్బు, చల్లటి కడిగేసుకుంటే గుడ్డు వాసన రాకుండా ఉంటుంది. ఇలా తరచూ చేయడం వల్ల చేతులు కోమలంగా మారతాయి.

**పడుకునే ముందు ఇలా...** రోజంతా ఇంటి పనులతో, వృత్తి ఉద్యోగాల రీత్యా తీరిక దొరకని వారు పొడిబారిన చేతులకు రాత్రుళ్లు కూడా ట్రీట్‌మెంట్ తీసుకోవచ్చు. ఇందుకోసం రాత్రి పడుకునే ముందు కాస్త కొబ్బరి నూనె లేదా బాదం నూనెను చేతులకు రాసుకుని బాగా మర్దనా చేసుకోవాలి. ఫలితంగా నూనె చర్మంలోకి బాగా ఇంకి పొడిబారిన చర్మాన్ని తిరిగి రిపేర్ చేస్తుంది. తేమగా, కోమలంగా మార్చుతుంది. □

# పోషకాల జామ..

**పులుపు, తీపి, వగరు** కలగలిపిన రుచిలో ఉండే జామ మనందరికీ పరిచయమే. ఉష్ణమండల ప్రాంతాల్లో విరివిగా పెరిగే ఈ పండులో శరీరానికి మేలు చేసే కీలక విటమిన్లు, ఖనిజాలూ పుష్కలంగా ఉంటాయి. ఇవి అనేక అనారోగ్యాలను నియంత్రించడమే కాదు.. మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ పెంపొందిస్తాయని పలు పరిశోధనలు చెబుతున్నాయి. తాజాగా అమెరికా పోషకాహార సంస్థ చేసిన అధ్యయనంలో ఆశ్చర్య కరమైన ఫలితాలెన్నో కనిపించాయి. అధిక రక్తపోటుతో బాధపడుతోన్న కొంతమందికి పన్నెండు వారాల పాటు భోజనాలనికి ముందు ఓ జామ పండుని తినడానికి ఇచ్చారు. రోజూ వారి రక్తపోటుని పరిశీలించగా.. కనీసం 8-9 పాయింట్లు తక్కువ గ్లైసమెక్ ఇండెక్స్ ఉండే జామపళ్లు మధుమేహాన్ని పెరగకుండా చూశాయట. దీంతో పాటు హెచ్‌డిఎల్ కొలెస్ట్రాల్ ఎనిమిది శాతం పెరిగిందనీ చెబుతోంది. అధిక మోతాదులో లభించే విటమిన్-సి, లైకోపీన్, యాంటీ ఆక్సిడెంట్లు వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. మెగ్నీషియం ఇతర ఆహారం నుంచి పోషకాలను సరైన మోతాదులో స్వీకరించడానికి సాయపడు తుంది. ఇందులోని ఫోలిక్ యాసిడ్ సంతాన సామర్థ్యాన్ని పెంచడంతో పాటు గర్భస్థ శిశువు ఆరోగ్యాన్నీ మెరుగుపరు స్తుందట. అందుకే రోజూ తప్పనిసరిగా ఓ జామ పండుని తినమని చెబుతున్నారు నిపుణులు. □



# జుట్టు నెరిసిపోతోందా..



**35 ఏళ్లు పైబడిన వారిలో జుట్టు తెల్లబడడం** అనేది చాలా సాధారణ అంశం. అయితే చాలామందిలో వంశపారపర్యంగా తెల్లజుట్టు వస్తుంటుంది. అంటే కుటుంబంలో ఎవరికైనా చిన్న వయసులోనే తెల్లజుట్టు వచ్చి ఉంటే తర్వాత తరాల వారికి కూడా వచ్చే అవకాశం ఉంటుంది. కొంతమందిలో పోషకాహార లోపం వల్ల కూడా జుట్టు తెల్లబడుతుంది. తీసుకునే ఆహారంలో ముఖ్యమైన విటమిన్లు, ప్రొటీన్లు, మినరల్స్ లోపం ఉన్నా జుట్టు తెల్లబడుతుంది. ఇవే కాకుండా గాఢత ఎక్కువగా ఉన్న షాంపూలు ఉపయోగించడం.. జెల్స్, స్టైలింగ్ వల్ల కూడా తొందరగా తెల్లజుట్టు వచ్చే అవకాశం ఉంటుంది. ఒకవేళ వంశపారంపర్యంగా తెల్లజుట్టు వస్తోందంటే దానికి ఎలాంటి చికిత్స ఉండదు. అది కాకుండా ఏదైనా పోషకాల లోపం వల్ల జుట్టు తెల్లబడుతోందంటే దానికి సంబంధించిన చికిత్స తీసుకోవడం వల్ల జుట్టు తిరిగి నల్లబడే అవకాశం ఉంటుంది. వీటికి తోడు ఒత్తిడి, ఆందోళన సమస్యలను తగ్గించుకోవాలి. తీసుకునే ఆహారంలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండేటట్లు చూసుకోవాలి. అలాగే శరీరానికి సరిపడినంత నిద్ర అవసరం. తగినన్ని నీళ్లు తాగడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల జుట్టు తెల్లబడడాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుంది. □



గురువారం న్యూఢిల్లీలో భారత్ ఒలింపిక్స్ అథ్లెట్లతో ప్రధాని మోడీ



## భారత్ ఒలింపిక్స్ అథ్లెట్లతో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** పారిస్‌ఒలింపిక్స్‌లో భారత్ తరపునప్రాతినిధ్యం వహించినఅథ్లెట్లబృందాన్ని ప్రధాని మోడీ అభినందించారు. గురువారం మధ్యాహ్నం ప్రధాని తననివాసంలో క్రీడాకారులను కలిసి వారితోముచ్చటించారు. షూటర్ మనూబాకర్ ఒలింపిక్ పతకం సాధించినపిస్టల్‌ను ప్రధానికి చూపించింది. రెండోసారి వరుసగా కాంస్యం సాధించిన హాకీ పురుషులజట్టు ప్రధానికి ప్రత్యేక కానుక ఇచ్చింది. ఆటగాళ్లంతా సంతకంచేసిన ఒక జెర్సీ, హాకీ స్టిక్‌ను అందచేసారు. కాంస్యం అందుకున్న రెజ్లర్ అమన్‌షెహ్రావత్ కూడా భారత జెర్సీని ప్రధానికి బహుమతిగా ఇచ్చారు. తర్వాత ప్రధాని క్రీడాకారులమధ్య కలియతిరుగుతూ వారితో సంభాషించారు. ఒలింపిక్స్‌లో వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. 140 కోట్లమంది భారతీయుల తరపున మీ అందరికీ అభినందనలు తెలియజేస్తున్నా. మరిన్ని కొత్త కలలు ఆశయాలతో ముందుకెళదాం. వాటికి సాకారంక ఓసం నిరంతరం కృషిచేద్దాం అని క్రీడాకారులనుప్రోత్సహించారు. కేంద్రక్రీడల మంత్రిమన్సుక్ మాండవీయ భారత ఒలింపిక్ అధ్యక్షురాలు పిటి ఉష తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఎర్రకోట వద్ద జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఒలింపిక్ అథ్లెట్లబృందం మొత్తం పాల్గొన్నారు. వీరంతా రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసారు.

# బంగ్లా టెస్ట్ సిరీస్‌కు భారత్




## నలుగురు ఆటగాళ్ల రీ ఎంట్రీ

### 15 నెలల తర్వాత స్టార్ ప్లేయర్ రిటర్న్

ఢిల్లీ: మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న భారత్-బాంగ్లాదేశ్ మధ్య టెస్ట్ సిరీస్‌కుగాను రెండు దేశాల క్రికెట్ బోర్డులు జట్ల ఎంపికల్లో తలమునకలై ఉన్నాయి. సెప్టెంబరు 19వ తేదీ నుండి మొదలయ్యే బాంగ్లాదేశ్‌తో భరత్ జట్టు నేరుగా టెస్ట్ సిరీస్ ఆడాల్సి ఉంది. ఈ సిరీస్ సమీపిస్తున్న తరుణంలో టీమిండియాను కూడా ప్రకటించాల్సి ఉంది. కొత్త ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ నేతృత్వంలో శ్రీలంక చేతిలో ఓటమి రుచి చూసి తిరిగి వచ్చిన టీమిండియా ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటోంది. మళ్లీ సెప్టెంబరు 19 నుండి బంగ్లాదేశ్‌తో జరగబోయే టెస్ట్ సిరీస్‌కు సిద్ధం కావాల్సి ఉంటుంది. ఈ లోపుగా టీమిండియాలో మార్పులు చేర్పులు చేయాలని భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు నిర్ణయం తీసుకుంది. బాంగ్లాదేశ్‌తో జరిగే ఈ సిరీస్ కోసం నలుగురు భారత్ ఆటగాళ్లు తిరిగి రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఈ నలుగురు ఆటగాళ్లలో ఒకరు 15 నెలల తర్వాత టెస్టు మ్యాచ్ ఆడటం గమనార్హం. బాంగ్లాదేశ్‌తో తలపడనున్న టీమిండియా టెస్టు జట్టులోకి తిరిగి రాగల నలుగురు ఆటగాళ్లలో జస్ప్రిత్ బుమ్రా, మహ్మద్ షమీ, ఆర్ అశ్విన్, రవీంద్ర జడేజా పేర్లు ఉన్నాయి. వీరిలో బుమ్రా, అశ్విన్, జడేజా ఈ ఏడాది మార్చిలో తమ చివరి టెస్టు మ్యాచ్ ఆడారు. అయితే షమీ తన చివరి టెస్ట్ మ్యాచ్‌ను గత ఏడాది జూన్‌లో ఆడాడు. కాగా గాయం కారణంగా షమీ టీమిండియాకు దూరంగా ఉన్నాడు. టెస్టు క్రికెట్‌లోనే కాకుండా బంగ్లాదేశ్ టూర్ ప్రారంభమయ్యే సమయానికి వైట్ బాల్ క్రికెట్‌లో షమీ ఏదైనా మ్యాచ్ ఆడాలంటే 10 నెలల సమయం ఉండేది. విశేషం ఏమిటంటే షమీ ఇప్పుడు నైట్స్‌లో బౌలింగ్ చేయడం ప్రారంభించాడు. ఇక అశ్విని విషయంలో భారత్ జట్టు మేనేజ్మెంట్ విధానం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది.అతను రెడ్ బాల్ క్రికెట్‌లో మాత్రమే ఆడతాడు. మార్చిలో ఇంగ్లండ్‌తో స్వదేశీ సిరీస్‌ను ఆడిన తర్వాత, అతను ఇప్పుడు నేరుగా బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్‌ను ఆడనున్నాడు. ఈ ఏడాది మార్చిలో ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌ను ఆడిన తర్వాత టీ 20 ప్రపంచ కప్‌లో బుక్రమా, జడేజా కూడా టిమిండియాలో భాగమయ్యారు. శ్రీలంకతో జరిగిన వైట్ బాల్ సిరీస్ నుండి వీరిద్దరికి విశ్రాంతినిచ్చింది. ఇప్పుడు ఈ ఇద్దరు ఆటగాళ్లు బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్ నుండి టీమిండియాలో పునరాగమనం చేయనున్నారు. ఇక ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో ఫైనల్‌కు చేరుకోవడం కోసం బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్ ముఖ్యమైంది. ఇటువంటి పరిస్థితిలో షమీ, బుమ్రా, అశ్విన్, జడేజాల పునరాగమనం భారత్‌కు మరింత ముఖ్యమైనదిగా మారింది. షమీ, బుమ్రా కలిసి భారతన పేస్ అటాక్‌కు బలం చేకూర్చారు. స్పిన్‌లో అశ్విన్, జడేజా జోడీ అద్భుతాన్ని ప్రపంచం చాలా సార్లు చూసింది. గత నాలుగేళ్లుగా చూస్తే ఆంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలరున ఈ నలుగురే కావడం విశేషం. 2020 సంవత్సరం నుండి ఇప్పటి వరకూ బుమ్రా అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధికంగా 181 వికెట్లు పడగొట్టగా, అశ్విన్ 180 వికెట్లతో అతని వెనుక ఉన్నాడు. ఇక జడేజా 141 వికెట్లు, షమీ 127 వికెట్లు తీశారు.

## బంగ్లా టెస్ట్ సిరీస్‌కు బుమ్రా ఔట్

### ఆ స్థానంలో అర్షదీప్ సింగ్ ఎంట్రీ

**ఢిల్లీ:** శ్రీలంకతో వన్డే సిరీస్ ముగిసన తదుపరి టిమిండియా ప్రస్తుతం సెలవులో ఉంది. అనంతరం స్వదేశంలో బంగ్లాదేశ్‌తో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో టిమిండియా తలపడనుంది. సెప్టెంబరు 19వ తేదీ నుండి ఈ రెండు మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానుంది. ఇక శ్రీలంక పర్యటనకు దూరంగా ఉన్న టీమిండియా స్టార్ బౌలర్ జస్ప్రిత్ బుమ్రా బంగ్లాదేశ్ జట్టుతో జరిగే సిరీస్‌కు కూడా దూరండా ఉండనున్నట్లు సమాచారం. ఈ భారత్ పేస్ గుర్రానికి మరి కొన్ని రోజుల పాటు విశ్రాంతి పొడిగించాలని భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) సెలక్షన్ కమిటీ నిర్ణయించనట్లు వెల్లడవుతోంది. బుమ్రా నేరుగా అక్టోబరు నెలలో న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌కు అందుబాటులోకి రానున్నాడు. ఇక బుమ్రా గైర్హజరీ నేపథ్యంలో యువ పేసర్ అర్షదీప్ సింగ్‌కు అవకాశం ఇవ్వాలని సెలక్టర్లు దాదాపు ఒక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే వైట్ బాల్ క్రికెట్‌లో తానెంటో నిరూపించుకున్న అర్షదీప్ ఇప్పుడు టెస్టుల్లో కూడ అరంగేట్రం చేయనున్నాడు. టీ 20 ప్రపంచ కప్-2024లో అద్భుత ప్రదర్శన కనపరిచిన ఈ పంజాబీ క్రికెటర్, శ్రీలంక పర్యటనలోనూ ఆకట్టుకున్నాడు. ఈ క్రమంలోనే సెలక్టర్లు అతడికి పిలుపునివ్వాలని యోచిస్తున్నారు. మరోవైపు ఈ సిరీస్‌తో దాదాపు 10 నెలల సుదర్ఘ విరామం తర్వాత స్టార్ పేసర్ మహ్మద్ షమీ రీ ఎంట్రీ ఇచ్చే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి.




## ప్రారంభమైన మహారాజా ట్రోఫీ

**ఢిల్లీ:** కర్నాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే మహారాజా ట్రోఫీ మూడో సీజన్ ప్రారంభమైంది. గురువారం నుండి ఈ ట్రోఫీని నిర్వహిస్తోంది. తొలి రోజు బెంగుళూరు బ్లాస్టర్స్-గుల్బర్గా మిస్టిక్స్‌కు, శివమొగ్గ లయన్స్-మైసూరు వారియర్స్ మధ్య మ్యాచ్ జరిగింది. కాగా మహారాజా ట్రోఫీ మూడో సీజన్ ఈ నెల 15 నుండి ప్రారంభమై సెప్టెంబరు 1వ తేదీ వరకూ జరగనున్నాయి. ఈ టోర్నీలో మొత్తం ఆరు జట్లు పాల్గొంటున్నాయి. గుల్బర్గా మిస్టిక్స్, బెంగుళూరు బ్లాస్టర్స్, మైసూర్ వారియర్స్, హుబ్లీ టైగర్స్, మంగళూరు డ్రాగన్స్, శివమొగ్గ లయన్స్ జట్లు మహారాజా ట్రోఫీ టైటిల్ కోసం తలపడనున్నాయి. ఈ టోర్నమెంట్ డబుల్ రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో జరుగుతుంది. ఒక జట్టు మిగిలిన జట్లతో రెండు సార్లు తలపడాల్సి ఉంటుంది. టాప్ 4లో నిలిచిన నాలుగు జట్లు సెమీఫైనల్, ఫైల్‌కు చేరుకుంటాయి. సెప్టెంబరు 1న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. హుబ్లీ టైగర్స్ డిఫెండింగ్ ఛాంపియన్స్‌గా బరిలోకి దిగుతుంది. ఈ టోర్నీలో మొత్తం 33 మ్యాచ్‌లో జరుగుతాయి.

## మహిళల వరల్డ్ కప్‌ను భారత్‌లో నిర్వహించలేం

### అంతర్జాతీయ క్రికెట్ మండలికి బిసిసిఐ షాక్

**ఢిల్లీ:** మహిళల టీ 20 వరల్డ్ కప్‌పై అనిశ్చితి కొనసాగుతోంది. తమ దేశంలో ఈ టోర్నీని నిర్వహించలేదమని భారతన క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ)కు స్పష్టం చేసింది. అక్టోబరులో మహిళల టీ20 పపంచ కప్-2024 మెగా టోర్నీని బంగ్లాదేశ్‌లో నిర్వహించాల్సి ఉండగా, అక్కడకొన్ని రోజులుగా ఘర్షణలు, ఆందోళనలతో అట్టుడుకుతూ ఇంకా పరిస్థితులు చక్కబడ లేదు. ఈ నేపథ్యంలో దాని నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలో ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ వరల్డ్‌కప్ వేదికను తరలించే ప్రయత్నంలోఉంది.ఆ ప్రక్రియలో భాగంగానే ప్రత్యమ్నాయ వేదికగా భారత్‌లో ఈ మెగా టోర్నీని నిర్వహించే విషయమై సంప్రదించింది. అయితే ఇందుకు భారత్ క్రికెట్ నియంత్రణ బోర్డు మాత్రం క్రికెట్ కౌన్సిల్‌కుషాక్ ఇచ్చింది. గత ఏడాది సొంత గడ్డపై వన్డే వరల్డ్ కప్ నిర్వహించిన బిసిసిఐ వచ్చే ఏడాది మహిళల వన్డే వరల్డ్ కప్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వనుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని మహిళల టీ 20 వరల్డ్ కప్ మెగా టోర్నీని భారత్‌లో నిర్వహించడం సాధ్యం కాదని భారత్ క్రికెట్ బోర్డు తెగేసి చెప్పేసింది. ఇప్పుడు మా దేశంలో వర్షాలు బాగా పడుతున్నాయని, అంతకంటే ముఖ్యమైన విషయం వచ్చే ఏడాది మహిళల వన్డే వరల్డ్ కప్‌ను నిర్వహించబోతున్నట్లు భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు కార్యదర్శి జై షా ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్‌కు వివరణ ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో మహిళల టీ 20 ప్రపంచ కప్ టోర్నీకి ఆతిథ్యం ఇస్తామని చెప్పలేమని తెలిపారు. ఒక వేళ అంగీకరించినట్లయితే వరుసగా రెండు వరల్డ్ కప్‌లను నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం

## ప్రభుత్వ రంగ బ్యాంకులపై మోడీ ప్రశంసలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ రంగ బ్యాంకులను ఉద్దేశించి మాట్లాడారు. గతంలో బ్యాంకింగ్ రంగం సవాళ్లు ఎదుర్కొన్నా, విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చామని చెప్పారు. ప్రపంచంలోని కొన్ని సమర్థమైన బ్యాంకుల్లో భారతీయ బ్యాంకులు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ, 'ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్న భారతీయ బ్యాంకులు బలంగా మారాయి. గతంలో బ్యాంకింగ్ రంగం పరిస్థితి ఎలా ఉందో ఒక్కసారి ఊహించండి. వృద్ధి లేదు, విస్తరణ లేదు, విశ్వాసం లేదు. ప్రస్తుత ప్రభుత్వం ఈ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు సంస్కరణలు తీసుకొచ్చింది. నేడు ఆ సంస్కరణల కారణంగా బ్యాంకుల పనితీరు మెరుగుపడింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కొన్ని సమర్థమైన బ్యాంకుల్లో భారతీయ బ్యాంకులు ఉన్నాయి. మధ్యతరగతి, రైతులు, గృహ కొనుగోలుదారులు, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఇ రంగాల అవసరాలను తీర్చడానికి బ్యాంకింగ్ వ్యవస్థ కీలకంగా మారింది' అని పేర్కొన్నారు.




## స్టాక్స్‌పై ఇన్వెస్టర్లకు నిపుణుల సిఫార్సులు!

**ముంబై, ఆగస్టు 15:** దేశం 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ స్టాక్ మార్కెట్ నిపుణులు తమ స్టాకిసిఫార్సులను విడుదల చేశారు. గత యేడాది స్వాతంత్ర్యదినోత్సవం తర్వాత అనేక కంపెనీల షేర్లు ఇన్వెస్టర్లకు భారీ లాభాలను తెచ్చిపెట్టిన విషయం విదితమే. ఈ క్రమంలో చాలా మంది ఇన్వెస్టర్లు ఈ యేడాది కోసం నిపుణుల సూచీలను పరిశీలిస్తున్నారు. ఆర్తి డ్రగ్స్ విషయానికి వస్తే ప్రస్తుతం ఫార్మాస్యూటికల్ రంగంలో మంచి రాబడులు పొందగల కంపెనీ అని స్టాక్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల ఈ కంపెనీ షేర్ విలువ గణనీయంగా పెరుగుతుంది. ఈ విధంగా కంపెనీ షేర్ విలువ ప్రస్తుతం ఒక్కోటి రూ.496 స్థాయిలో ట్రేడవుతోంది. భారతదేశంలో రబ్బర్ కెమికల్ మార్కెట్‌లో నోసిల్ ప్రముఖ కంపెనీ. ప్రస్తుతం కంపెనీ షేరు రూ.279 వద్ద ట్రేడవుతుండగా, దీని విలువ రూ.350 వరకు పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే కంపెనీ ప్రస్తుతం రుణ రహితంగా ఉంది. ఫెడరల్ బ్యాంకులో షేరు ధర రూ.204 వద్ద ట్రేడవుతోంది. దీని విలువ వీలైనంత త్వరగా రూ.235 చేరుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఫెడరల్ బ్యాంకు తన పెట్టుబడిదారులకు బ్యాంకింగ్ రంగ స్టాక్‌లలో




గత యేడాదిలోనే 52 శాతం లాభాన్ని ఇచ్చింది. రానున్న రోజుల్లో ఈస్టాక్ విలువ పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. వోల్టాస్ షేరు ధర ప్రస్తుతం రూ.1,550 వద్ద ట్రేడవుతోంది. సమీప భవిష్యత్తులో షేర్ విలువ రూ.1800 స్థాయికి చేరుకోనుందని తెలిసింది. కాబట్టి పెట్టుబడిదారులు ఖచ్చితంగా కంపెనీ స్టాక్‌ను కొనుగోలు చేయవచ్చు. అలాగే జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ అమ్మకాలు 45శాతం పెరిగాయి. హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ ఒక్కో షేరు రూ.4,460 వద్ద ట్రేడవుతోంది. దీనివిలువ దాదాపు 15నుంచి 20శాతం పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎల్అండ్‌టి ప్రస్తుతం దీని విలువ ఒక్కో షేరుకు రూ.3,543గా ఉంది. త్వరలో స్టాక్ ధర 15శాతం మేర లాభపడవచ్చని నిపుణులు చెబుతున్నారు. భారత్‌డైనమిక్స్ ప్రస్తుతం ఈ కంపెనీలో ఒకషేరు రూ.1320 వద్ద ట్రేడవుతోంది. దీని విలువ రూ.1500 వరకు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ప్లాటినం ఇండస్ట్రీస్ వీలైనంత భవిష్యత్తులో రూ.4,400 దాటుతుందని పెట్టుబడి పరిశ్రమ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే కంపెనీ ప్రస్తుతం సీసం లేని ఉత్పత్తులు, పివిసి పైపులపై దృష్టిసారిస్తోంది. సుయోక్ టెలిమాటిక్స్‌కంపెనీ ప్రస్తుతం ఈకంపెనీ ఒకషేరు విలువ రూ.1,471 వద్ద ట్రేడవుతోంది. ఈ కంపెనీ కమ్యూనికేషన్ కంపెనీలకు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ. వీలైనంత త్వరగా ఈ కంపెనీ షేరు విలువ రూ.1,800కి చేరనుందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.


## ఎస్‌బిఐ వడ్డీరేట్లు పెంపు..

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** ప్రభుత్వ రంగానికి చెందిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వడ్డీరేట్లను సవరించింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటును (ఎంసిఎల్ఆర్) 10బేసిస్ పాయింట్ల మేర పెంచింది. దీంతో కన్జ్యూమర్, ఆటో రుణాలు మరింత ప్రియం కానున్నాయి. సవరించిన ధరలు ఆగస్టు 15 నుంచే అమల్లోకి వస్తాయని ఎస్‌బిఐ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఈ యేడాది జూన్‌లో చివరిసారిగా ఎంసిఎల్ఆర్‌ను సవరించింది. సవరించిన రేట్ల ప్రకారం, వివిధ కాల వ్యవధులకు ఎంసిఎల్ఎల్ఆర్ 8.20 శాతం నుంచి గరిష్ఠంగా 9.1శాతంగా ఉంది. ఓవర్‌నైట్ ఎంసిఎల్ఆర్ 8.20శాతానికి చేరగా, నెల, మూడు నెలల కాల వ్యవధులకు లెండింగ్ రేటు 8.45శాతం నుంచి 8.5 శాతానికి చేరింది. ఆరు నెలల ఎంసిఎల్ఆర్ 8.85శాతానికి, యేడాది లెండింగ్‌రేటు 8.85 నుంచి 8.95 శాతానికిపెరిగింది. రెండేళ్ల ఎంసిఎల్ఆర్ 9.05శాతానికి, మూడేళ్ల ఎంసిఎల్ఆర్ 9.1 శాతానికి పెంచుతున్నట్లు ఎస్‌బిఐ ప్రకటించింది.బ్యాంకులు డిపాజిట్లసమీకరణకు చేసిన వ్యయాల ఆధారంగా ఈ ఎంసిఎల్ఆర్‌ను నిర్ణయిస్తుంటాయి. ఒకరోజు నుంచి మూడేళ్ల వ్యవధికి ఈ వడ్డీరేటును నిర్ణయి స్తుంటాయి. ఎక్కువగా యేడాది ఎంసిఎల్ఆర్‌కు చాలావరకు రుణాలు అనుసంధానమై ఉంటాయి. ముఖ్యంగా ఆటోలోన్స్ యేడాది ఎంసిఎల్ఆర్ కు, పర్సనల్ లోన్స్ రెండేళ్ల ఎంసిఎల్ఆర్‌తో అనుసంధానమై ఉంటాయి. గృహరుణాల జారీకి పరిగణనలోకి తీసుకునే ఎక్స్ టర్నల్ బెంచ్ మార్క్ లెండింగ్‌లో మాత్రం ఎలాంటి మార్పూ చేయ లేదు. ప్రస్తుతం ఈరుణాలపై వడ్డీరేట్లు 8.50శాతం నుంచి 9.65 శాతం మధ్య ఉన్నాయి.




## బ్యాంకు ఖాతా లేకున్నా యుపిఐ పేమెంట్స్..

**ముంబై, ఆగస్టు 15:** డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కీలక భూమిక పోషిస్తున్న యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) ప్లాట్‌ఫామ్‌పై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ (ఎన్‌పిసిఐ) మరో కొత్త ఫీచర్ పరిచయం చేసింది. బ్యాంకు ఖాతా లేకున్నా ఒకరి యుపిఐ అకౌంట్‌ను వేరొకరు వాడుకునేలా యుపిఐ సర్కిల్ పేరిట కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది. డెలిగేట్ పేమెంట్స్‌గా పేర్కొనే ఈ ఫీచర్‌కు సంబంధించి తాజాగా ఓ నోటిఫికేషన్ జారీచేసింది. ఇంతకీ ఈ ఫీచర్ ఎలా పనిచేస్తుంది? దీంతో ఏవిధంగా ప్రయోజనం? లావాదేవీలపై ఎలాంటి పరిమితులున్నాయి? ప్రస్తుతం బ్యాంకు అకౌంట్ ఉన్నవారు తమ మొబైల్‌లో యుపిఐ సేవలను వాడుకోవచ్చు. ఎవరి యుపిఐని వారే వినియోగించుకోవడానికి వీలుంది. వేరొకరు వాడేందుకు అనుమతి లేదు. కొత్తగా తీసుకొచ్చిన యుపిఐ సర్కిల్‌తో అది సాధ్యం కానుంది. ప్రైమరీ యుపిఐ అకౌంట్‌ను కుటుంబసభ్యులు, పరిచయం ఉన్న వ్యక్తులతో పంచుకునే వెసులుబాటును కల్పిస్తోంది. అంటే ఒకరి బ్యాంకు అకౌంట్‌ను వేరొకరు వినియోగించి లావాదేవీలు జరపొచ్చన్నమాట. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా బయటకు వెళ్లినప్పుడు వారి లావాదేవీల కోసం ఈ ఫీచర్‌ను వినియోగించుకోవచ్చు. లేదంటే స్కూల్, కాలేజీకి వెళ్లే పిల్లలకు వారి ఖర్చుల కోసం మీ యుపిఐ ఖాతాను పంచుకోవచ్చు. లేదంటే ఇంటి ఖర్చులను ట్రాక్ చేసేందుకు అందరూ ఒకటే బ్యాంక్ ఖాతాను వినియోగించడానికీ ఈ యుపిఐ ఫీచర్ ఉపయోగపడుతుంది. బ్యాంకు ఖాతా లేనందున ఇప్పటికీ నగదు లావాదేవీలపై ఆధారపడుతున్న వారిని దృష్టిలో పెట్టుకొని ఈ ఫీచర్‌ను తీసుకొచ్చినట్లు ఎన్‌పిసిఐ పేర్కొంది. యుపిఐ యాప్స్, పేమెంట్ సర్వీసు ప్రొవైడర్లు ఈ సేవలను త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నాయి. యుపిఐ డెలిగేట్ పేమెంట్ కోసం ప్రైమరీ యుపిఐ హోల్డర్ ఒక మ్యాండేట్‌ను క్రియేట్ చేయాల్సి ఉంటుంది. ఇందుకు తన కాంటాక్ట్స్‌లోని నచ్చిన నంబర్‌ను ఎంచుకోవచ్చు. ఒక ప్రైమరీ యూజర్ గరిష్ఠంగా ఐదుగురు సెకండరీ యూజర్లను ఎంచుకోవచ్చు. సెకండరీ యూజర్ మాత్రం ఒక ప్రైమరీ యూజర్ అకౌంట్‌ను మాత్రమే వినియోగించడానికి వీలుంటుంది. ప్రైమరీ యూజర్ సెకండరీ యూజర్ల చెల్లింపులకు సంబంధించి నగదు, వినియోగంపై పరిమితి విధించొచ్చు. నెలకు గరిష్ఠంగా రూ.15 వేలు వరకు వినియోగించుకోవచ్చు. గరిష్ఠంగా రూ.5వేలు వరకు లావాదేవీలు చేయొచ్చు. సెకండరీ యూజర్ చేసే లావాదేవీలు ప్రైమరీ అకౌంట్ హోల్డర్ యుపిఐ యాప్, బ్యాంకు ఖాతాలో కనిపిస్తాయి. చెల్లింపులకు సంబంధించి పూర్తి డెలిగేషన్ ఇస్తే, సెకండరీ యూజర్ ఎలాంటి అవాంతరాలూ లేకుండా చెల్లింపులు చేయొచ్చు. అదే పాక్షిక డెలిగేషన్ ఇస్తే, సెకండరీ యూజర్ నుంచి వచ్చే రిక్వెస్ట్‌ను ప్రతిసారీ ప్రైమరీ యూజర్ ఆమోదించాల్సి ఉంటుంది.




# వాణిజ్యం

## యుఎస్‌లో తగ్గిన రిటైల్ ద్రవ్యోల్బణం

**వాషింగ్టన్, ఆగస్టు 15:** అమెరికా ఆర్థిక వ్యవస్థను పట్టి పీడిస్తున్న ద్రవ్యోల్బణం చివరకు తగ్గుముఖం పడుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. లేబర్ డిపార్ట్‌మెంట్ బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ గణాంకాల ప్రకారం, జులై నెలలో అమెరికా రిటైల్ ద్రవ్యోల్బణం 2.9శాతానికి పడిపోయింది. అంతకుముందు జూన్ నెలలో ఇది 3శాతంగా నమోదైంది. ఒక నెల వ్యవధిలోనే ఇది 0.1శాతం తగ్గింది. కరోనా మహమ్మారి ప్రారంభమైన తర్వాత బలమైన ధరల పెరుగుదల కారణంగా వినియోగదారుల ధరల సూచిక భారీగా పెరిగింది. దీంతో అమెరికా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. అయితే క్రమంగా



ధరలు తగ్గుముఖం పడుతుండడతో వినియోగదారుల కొనుగోలు శక్తి పుంజుకుంటుంది. చాలా కంపెనీలు తమ ఉత్పత్తుల ధరలను తగ్గిస్తున్నాయి. అంతకుముందు ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయడానికి అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచింది. దీంతో వస్తువులు, సేవల కోసం డిమాండ్‌ను మందగించడానికి ప్రయత్నించింది. ప్రస్తుతం అంచనాలకు అనుగుణంగా రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతుండడంతో ఫెడరల్ సెప్టెంబర్ 17-18 పాలసీ సమావేశంలో వడ్డీరేటు తగ్గింపుపై ఒక ప్రకటన చేసే అవకాశం ఉందని తెలిసింది. అలాగే జులైలో నిరుద్యోగం రేటు మూడేళ్ల గరిష్ఠ స్థాయి 4.3శాతానికి పెరిగింది. నిరుద్యోగిత రేటులో వరుసగా నాలుగో నెలవారీ పెరుగుదల కనిపించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.